


జూలై-87
రూ. 6/-
దేశంలో అత్యధికంగా కొని చదవబడుతున్న తెలుగు





Vaani Krishna

స్థాపకుడు: వి.వి.రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్: లీలావతి రాఘవయ్య

సంపుటి 24 జూలై -87 సంచిక 6

"ఇదండీ వరస"

కథలు

అపూర్వ బంధాలు	వసుంధర	34
ఇదీ మన వ్యవస్థ-ఇదే మన అవస్థ	యామినీ సరస్వతి	58
హాండ్సప్	కేవస్వి	78

సీరియల్స్

మంచుపర్వతం	యండమూరి వీరేంద్రనాథ్	12
డిక్టేటర్	సూర్యదేవర రామ్మోహన రావు	50
డెత్ట్రాప్	తోటకూర ఆశాలత	70
నవత - యువత	పోల్కంపల్లి శాంతాదేవి	85
రాబందుల రెక్కలచప్పుడు	యర్రంశెట్టిశాయి	104

ఫీచర్స్

హ్యూమరాలజీ-58	యర్రంశెట్టి శాయి	6
కంప్యూటర్ టీజింగ్	కంప్యూటర్	46
అబద్ధాల పోటీ		68
పదవ్యూహం-7	యామిని	76


ఈ నెల ప్రత్యేకం యువరచయితలకు కథగురించి కాశీవట్నం రామారావు 94

ఈ నెల ప్రత్యేక నవలానుబంధం:
రెప్పల్లేనిరాత్రి మేర్లపాక మురళి

ఈ నెల ముఖచిత్రం: సుమలత

గౌరవ సంపాదకులు-యర్రంశెట్టి శాయి.

జ్యోతి పి.బి.నెం. 1824. హైదరాబాదు-20. ఫోన్-61180



హ్యూమరాలజీ-53

గత సంచిక తరువాయి

"ఆ - ఆ పోలీసులున్నా కూడా - వాళ్ళు దొంగల గురించి పెద్దగా పట్టించుకోరు. ఎందుకంటే వాళ్ళను పట్టుకుంటే డబ్బు దొరకదు కదా! అదే హెల్మెట్ లేనివాళ్ళను, రాంగ్ పార్కింగ్ వాళ్ళను, హోటళ్ళలో గడిపే ప్రేమికులను, పట్టుకుంటే బోలెడు డబ్బు దొరుకుతుంది. అందుకని ఎప్పుడూ ఆ పనే చూస్తూంటారు-"

వాళ్ళు అర్థంకాక భుజాలు ఎగరవేసుకున్నారు.

మర్నాడు ఉదయం వాళ్ళు పెద్దగా కేకలువేస్తూంటే మాకు మెలకువ వచ్చింది. అందరం అదిరిపోయి లేచి కూర్చున్నాడు.

ఆ తెగవాళ్ళంతా శివమెత్తినట్లు ఊగుతూ కేకలువేస్తూ, డప్పులు వాయిస్తూ దణ్ణాలు పెడుతున్నారు.

అదంతా ఏమిటో అర్థంకాక ఫారెస్ట్ గార్డ్ దగ్గరకెళ్ళి నిద్రలేపి సంగతేమిటని అడిగాము.

"అదా! అది వాళ్ళ పూజసార్! సూర్యుడికీ, గాలినీ, నీళ్ళనూ రోజూ పూజలు చేస్తారు -"

మేమంతా వాళ్ళ రాతియుగం అలవాట్లకు నవ్వుకుని వాళ్ళదగ్గరకు నడిచాము.

"ఇలా సూర్యుడినీ, కొలవటం పాతకాలంనాటి ఆచారం. మీరివన్నీ మానేయాలి-" అన్నాడు రంగారెడ్డి.

వాళ్ళు ఆశ్చర్యపోయారు.

"మరిప్పుడు వీటిని మీరు పూజించటం లేదా?" అడిగారు నోరుతెరచి.

"సూర్యుడు ఒక నక్షత్రం. దేవుడు కాదు. అలాగే నిప్పు, గాలి, నీరూ అన్నీ ప్రకృతి సహజమయిన వనరులు గానీ దేవుళ్ళుకాదు-" అన్నాడు శాయిరామ్.

వాళ్ళు మావేపూ, సెలయేరువేపు మార్చి మార్చి ఆశ్చర్యంగా చూడటం గమనించేసరికి మాకు అనుమానం వచ్చి సెలయేరువేపు చూశాం.

మా గోపాల్రావ్ యేటి మధ్యలో నిలబడి సూర్యనమస్కారం చేస్తున్నాడు.

"నిజమే - మనంమాత్రం ఎక్కడ

యర్రంశెట్టి శాయి

మారాము?" అన్నాడు రంగారెడ్డి పాలిపోయిన మొఖంతో.

"అయినా ఎందుకు మారాలిభాయ్! సూర్యుడు దేవుడనే మావాళ్ళంతా నమ్ముతారు. అలాగే గాలిదేవుడి స్థానంలో ఆంజనేయస్వామినీ, నీళ్ళస్థానంలో గంగాదేవినీ మనంకూడా పూజలుగిట్ట చేస్తనే ఉన్నాంకదా -" అన్నాడు యాదగిరి.

వెంటనే ఆ టాపిక్ మార్చేయటం మంచిదనిపించింది నాకు.

"సరేలెండి. తర్వాత మాట్లాడదాం. ముందు వాళ్ళకు స్కూలు మొదలుపెడదాం -" అన్నాడు జనార్థన్. "వాళ్ళకు చదువు అనేది ఉంటే వెనుకబడిన తనమంతా పోతుంది" అందరం

నాగరికతా...వర్ధిల్లు

త్వరత్వరగా రడీఅయి చెట్లకింద స్కూలుకి ఏర్పాటు చేశాము.

వాళ్ళ పిల్లలందరినీ చదువుకోటానికి రమ్మని చెప్పాముగానీ గంటసేపయినా ఎవరూ రాకపోయేసరికి మాకు అనుమానం వచ్చి వాళ్ళ నాయకుడిని పిలిపించాము.

అతను కన్ఫ్యూజన్‌లో ఉన్నట్లు అతని మొఖమే చెప్తోంది.

"మా తెగవాళ్ళంతా చదువు ఎందుకని అడుగుతున్నారు - ఏం చెప్పమంటారు?" అడిగాడతను.

"చదువు ఎందుకా?" అంటూ నవ్వాపుకుంటూ మావేపు చూశాడు జనార్థన్.

అందరం ఘొల్లున నవ్వేశాము హేళనగా.

"చదువుకుంటే అన్నీ తెలుస్తాయ్ మనకి! మంచి-చెడూ, నీతీ, అవినీతి అన్నీ అర్థమవుతాయ్! అదీగాక చదువుకుంటే ఉద్యోగాలు దొరుకుతాయ్. అదీగాక చదువుకుంటే రాజ్యాలుకూడా ఏలవచ్చు -"

"చదువుకుంటే రాజ్యాలు ఏలవచ్చా" ఆశగా అడిగాడతను.

"అవును -"


"అయితే మిమ్మల్ని పరిపాలించే నాయకులంతా చదువుకున్నవారేనా?" సంభ్రమంగా అడిగాడతను.

షేము గతుక్కుమన్నాము.

సాధారణంగా ఏమాత్రం చదువూ సంధ్యా లేని వేలిముద్రలవాళ్ళే రాజకీయ నాయకులవుతారనీ, వాళ్ళే ప్రజల్ని పరిపాలిస్తారనీ మా అందరికీ తెలుసు. అతని ప్రశ్నకు సమాధానం చెప్పలేక ఫారెస్ట్ గార్డ్‌వేపు చూశాము - మాకు సహాయం చేయమని, ఫారెస్ట్‌గార్డ్ వాళ్ళకేదో సర్ది చెప్పాడు.

"అయితే చదువు నేర్చుకుంటే చెడూ అవినీతీ అన్నీ వదిలేస్తామన్నమాట అంతేనా?" మళ్ళీ అడిగాడతను.

మేము మళ్ళీ మొఖాలు చూసుకున్నాం. దేశమంతా చదువుకున్నవాళ్ళే బాంక్ దోపిడీలు, బెదిరింపులు చేస్తున్నారన్న విషయం మాకు తెలుసు. అంచేత ఆ



ప్రశ్నకూడా దాటవేశాము. చదువుకీ మనిషి కారెక్టర్ కీ సంబంధం లేదని అన్నాడు శాయిరామ్.

"పోనీ ఉద్యోగాల సంగతేమిటి? మీకు చదువు లేకపోతే ఉద్యోగాలెలా దొరుకుతాయ్" అడిగాడు రంగారెడ్డి వాళ్ళను.

"అంటే చదువుకుంటే ఉద్యోగాలు దొరుకుతాయా?" అడిగాడు అడవితెగలో ఒకడు.

అందరం మళ్ళీ మొహాలు చూసుకున్నాం.

"దొరకటం అంటే దొరుకుతాయ్ గాని చాలామందికి దొరకవ్-" అన్నాడు చంద్రకాంత్.

ఈసారి వాళ్ళంతా మొహాలు చూసుకున్నారు.

"అయితే మూలాగా చదువూ సంధ్య లేకుండానే ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతక వాళ్ళు బ్రతకవచ్చుకదా! ఇంకా స్కూల్ చదువెందుకు?" అడిగాడు నాయకుడు,

"వాళ్ళమాట నిజమే! నేను డిగ్రీతీసుకుని ఆరేళ్ళయింది. ఇంతవరకూ ఉద్యోగమే లేదు. మన కాలనీలోనే నాలాంటి వాళ్ళు కనీసం వందమంది ఉంటారు. మరలాంటప్పుడు ఇంక ఈ చదువుల ఉపయోగమేమిటి?" అన్నాడు చంద్రకాంత్ వాళ్ళను సపోర్ట్ చేస్తూ.

"అవును! అసలీ చదువులొచ్చాకే మోసాలు ఎక్కువయిపోయాయ్-" అన్నాడు గోపాల్రావ్. అప్పటికప్పుడే ఆ వాళ్ళు కొంతమందికూడా స్కూల్ పెట్టే ప్రపోజల్ కాన్సిల్ చేసేశారు.

"వెధవస్కూళ్ళు! ఈ స్కూళ్ళంటేనే నాకు ఎలర్జీ! ఏమాత్రం అర్హతల్లేని టీచర్లు, ప్రిన్సిపాళ్ళు - దానికి వేలకొద్దీ డొనేషన్లు - రక్తం పీలుస్తున్నట్లు పీల్చేస్తున్నారు మన డబ్బంతా" అందిసావిత్రమ్మ.

ఆ తరువాత ఇంక ఏ అంశంలో ఆ అడవితెగ వాళ్ళను సంస్కరించాలో తెలీక అందరం ఆలోచనల్లో పడ్డాము.

అంతలో వాళ్ళ గుడిసెలమధ్య గట్టిగా కేకలు వినిపించినయ్. మరికొద్ది నిమిషాల్లో చాలామంది పోగయి ఓ స్త్రీ పురుషుల జంటను తీసుకొచ్చారక్కడికి.

"ఏం జరిగింది?" ఫారెస్ట్‌గార్డ్ నడిగాము మేము.

"భార్యాభర్తల తగవు! ఆ భర్తగాడు ఇంకెవత్తెనో మరిగాడంట. అందుకని భార్య కంప్లెయింట్ చేస్తోంది వాళ్ళ నాయకుడికి -"

చాలాసేపు వాళ్ళిద్దరిమధ్యా వాదోపవాదాలు జరిగాయ్- వాళ్ళ భాషలో! ఆఖరికి వాళ్ళ నాయకుడు తీర్పు ఇచ్చేశాడు.

వాళ్ళిద్దరికీ విడాకులు మంజూరు చేసేశాడు. ఆమెకు నష్టపరిహారంగా ఆమె భర్త నాలుగు మేకల్నీ, ఆరు కోళ్ళనూ ఇవ్వాలి!

అప్పటికప్పుడే మేకల్నీ, కోళ్ళనూ ఇచ్చివేశాడతను. వెంటనే ఓ కోడిని తన పాకమీద కట్టేసిందామె. అంటే మళ్ళీ స్వయంవరానికి రడీఅయిందన్నమాట!

"అంటే ఆమెకు మళ్ళా పెళ్ళవుతుందా?" అడిగాడు రంగారెడ్డి ఫారెస్ట్ గార్డ్‌ని ఆశ్చర్యంగా.


"ఓ! తెల్లారేసరికల్లా ఎవరోక యువకుడు జత కుదిరిపోతాడు-" మాకు ఎవరికీ కొద్దిసేపు నోటమాట రాలేదు.

"మగాడు తప్పుచేస్తే ఇంత తేలికగా విడాకులూ, ఆ స్త్రీకి మళ్ళా పెళ్ళి అవుతాయా?" ఆశ్చర్యంగా అంది రాజేశ్వరి.

"అవును - అది చాలా మామూలు విషయం వీళ్ళల్లో -" అన్నాడు గార్డ్.

"మరి మనం ఎన్నో ప్రభుత్వ సంస్కరణలు, మన స్త్రీ హక్కుల సంఘాలూ, ఉమన్‌లిబ్‌లూ పెట్టుకుని కూడా భర్తలేని స్త్రీలకు పెళ్ళిళ్ళు జరపలేక పోతున్నామెందుకని?" ఆలోచిస్తూ అడిగింది పార్వతీదేవి.

"అసలు మన నాగరిక సమాజంలో భర్తను వదిలిన స్త్రీకి రక్షణ ఎక్కడుంది? ఆమెకు ఎవరూ ఇల్లు అద్దెకివ్వరు; ఆఫీసుల్లో వారికి ప్రాముఖ్యత ఇచ్చి ఉద్యోగాలివ్వరు, వారిని గౌరవంగా చూడరు. ఛీ! మనదీ ఒక నాగరికతేనా?" విరక్తిగా అంది స్వరూపరాణి. మేమెవ్వరం వాళ్ళ మాటలను ఖండించలేదు. ఖండిస్తే ఏం జరుగుతుందో మాకు తెలుసు. మా పాత గొడవలూ, కలహాలూ, అన్నీ బయటికొస్తాయ్ మళ్ళీ అనవసరంగా. మా ఆఫీస్‌లో నా పక్కసీట్లో పనిచేసే చందన గురించి మా ఆవిడా, గోపాల్రావ్‌తోపాటు లేడీ జర్నలిస్ట్‌గా పనిచేసే శీలగురించి



వాళ్ళావిడా - సినిమాల్లో ఎక్స్ట్రాగా వేసే లలితతో పరిచయం పెంచుకున్న జనార్థన్ గురించి జనార్థన్‌భార్యా - దీనికిక అంతం లేదు-

హఠాత్తుగా రంగారెడ్డి లేచి నిలబడ్డాడు

"డియర్ ఫ్రెండ్స్! ఇప్పుడు మన కర్థమయిన దేమిటంటే ప్రపంచంలోకెల్లా అనాగరికులు మనమే! మనం ఊహించినట్లు కొండతెగలవాళ్ళూ అడవి తెగల వాళ్ళూ కాదు! నిజానికి అన్నివిధాలుగానూ వాళ్ళు మనకంటే ఎంతో నాగరికతతో జీవిస్తున్నారు. కనుక మనం వాళ్ళను చూసి నేర్చుకున్న విషయాలన్నీ అమలు చేసుకుని ఆచరించేట్లయితే బహుశా రాబోయే పంద సంవత్సరాల్లో మనం కూడా వాళ్ళలాగా అభివృద్ధి చెందవచ్చని నా అభిప్రాయం -

అందరూ అతని అభిప్రాయాన్ని వప్పుకున్నారు.

ఆ సాయంత్రమే అందరం తిరుగు ప్రయాణం కట్టాము. అడవితెగ వాళ్ళందరూ పిల్లాపీచుతో వచ్చి మాకు వీడ్కోలు చెప్పారు.

"మీ నాగరికత నేర్చుకుండానే వెళ్ళిపోతున్నారు" అన్నారువాళ్ళు విచారంగా. మేము వాళ్ళ మాటలు విననట్లు నటించాము.


మా బస్ బయల్దేరింది.

ఈసారి మా మొఖాల్లో ఆనందం మచ్చుకికూడా కనిపించటంలేదు.

"ఆ కోడి పద్ధతి బావుంది - మన కాలనీలోకూడా ఆ సిస్టం ప్రవేశపెడితే కట్నాల సమస్యలు ఉండవ్! అసలు ఇంటికెళ్ళగానే అరడజను కోళ్ళుకొనాలి. అప్పుడుగాని ఈ మగాళ్ళు అణిగి మణిగి పడివుండరు-" అంటున్నారు ఆడాళ్ళల్లో నుంచి ఎవరో -

మా మగాళ్ళ గుండెల్లో రాయి పడింది ఆ మాట వినేసరికి.

యాదగిరి దిగులుగా గట్టిగా మాట్లాడుకుంటున్నాడు తనలో తను-"హు! మళ్ళీ ఆ డ్రైనేజి గోతులూ, మురికి వాసనలూ శుభ్రంలేని మంచి నీళ్ళూ, మంచినీళ్ళ క్యూలూ, కిరసనాయిలు చావులూ, డొనేషన్ స్కూళ్ళూ, నిరుద్యోగ హాహాకారాలూ, కట్నాల కన్నీళ్ళూ, దోపిడీ పోలీసులూ, లాకప్ ఆక్రందనలూ, బోఫర్స్ లంచాలూ, గడ్డి అన్నారం భూముల కుంభకోణాలూ -హు! వెళ్ళిపోతున్నాం. మళ్ళీ మన అనాగరిక ప్రపంచంలోకి-" ●



యండమూరి వీరేంద్రనాథ్

సీరియల్

జరిగినకథ:—

వైజయంతి, విశాల, అనురాధ, భార్గవి స్నేహితురాళ్ళు. ఆ రోజు వాళ్ళంతా కాలేజీ ఫైనల్ పరీక్షలు రాశారు. పరీక్ష అయిపోయింతర్వాత నలుగురు కలిసి ఓ ఒప్పందం చేసుకొంటారు. అది 15 ఏళ్ళ తర్వాత వాళ్ళంతా మళ్ళీ కలుసుకొని, వాళ్ళ అనుభవాల్ని అందరికీ చెప్పడం.

—ఇక చదవండి.

వైజయంతి

1982 వ సంవత్సరం ఫిబ్రవరి నెల

స్థలం — ఉత్తర ప్రదేశ్ లోని ఇటావా జిల్లా.

సాయంత్రం అరవుతోంది. చలికాలం కావడంతో చీకటి పడిందప్పుడే.

ఒరాయి నించి వైలాగంజ్ వైపు వెళుతోంది ఆర్టీసీ బస్సు హరీష్ గుప్త బస్సుని ఉత్సాహంగా నడుపుతున్నాడు. మరో రెండు గంటల్లో వైలాగంజ్ చేరతారు. డిపోలో బస్సు అప్పచెప్పేస్తే బాధ్యత తీరిపోతుంది. ఆ తర్వాత నెల రోజులు సెలవు.

మరో వారం రోజుల్లో ఉంది పెళ్ళి ముహూర్తం. హరీష్ పక్కనే పెట్టుకున్న

అంతర్యుద్ధం



బ్యాగ్‌ని చూసుకున్నాడు గర్వంగా. పెళ్ళి కూతురి కోసం కాశీలో కొన్న ఎర్రపట్టు చీర, వెండి గొలుసూ, తల్లి కోసం కొన్న జరీ అంచు తెల్లచీరా ఉన్నాయందులో. రెండేళ్ళ నించీ కూడ బెట్టిన రెండు వేల రూపాయల క్యాషుకూడా ఉంది. అమ్మ గుర్తు వచ్చినప్పుడల్లా అతడి హృదయం కృతజ్ఞతతో పొంగుతుంది. తనకు ఏడాది వయసప్పుడు తండ్రి చనిపోయాడు. అప్పటినుంచీ పడరాని కష్టాలూ పడిందావిడ ఈనాటికి తను జీవితంలో స్థిరపడగలిగాడు. జబ్బులో వున్న ఆమె చివరి కోరిక తన పెళ్ళి చూడాలని, ఆమెకు నచ్చిన అమ్మాయినే ఎన్నుకున్నాడు. పెళ్ళి ఏర్పాట్లు అన్నీ చూస్తూంతన కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తుంటుంది. ఆమె కోసం కూడా తను ఖరీదయిన చీర కొన్నాడని తెలుస్తే బహుశ ఏడ్చేస్తుందేమో.

దూరంగా కుకర్‌గావ్ బ్రిడ్జి కనుపిస్తోంది. అక్కడి దాకా రోడ్డు గతుకులతో నిండి ఉంది. బ్రిడ్జి దాటాక మెయిన్ రోడ్డు బావుంటుంది స్పీడుగా వెళ్ళిపోవచ్చు. హరీష్ స్పీడు బాగా తగ్గించి నడుపుతున్నాడు. అయినా బస్సు కుదుపులతో నడుస్తోంది.

హెడ్‌లైట్స్ వెలుతురులో దూరంగా రోడ్డుకడ్డంగా ఏదో నిలబడి ఉండడం కనుపించిందతడికి. కాని అదేమిటో స్పష్టంగా తెలియడంలేదు. బస్సు మరికాస్త దూరం పోనిచ్చాడు హారన్ కొడుతూ. కదలలేదది.


పాతిక గజాల దూరానికి వచ్చాక స్పష్టంగా కనుపించింది. ఒకటికాదు రెండు ఎడ్లబండ్లు. రోడ్డుకడ్డంగా నిలబెట్టి ఉన్నాయి. లోపల మనుష్యులెవరూ లేరు.


హారన్ కొడుతూ మరింత దగ్గరగా బస్సుని పోనిచ్చి బ్రేక్ వేశాడు. హరీష్. డోరు హాండిల్‌మీద వేసిన చెయ్యి అలాగే ఆగిపోయింది. పక్కనుంచే దూసుకు పోయిందో తుపాకీగుండు. వెంటనే నాలుగు పక్కలనుంచీ తుపాకీల మోత వినిపించడం మొదలయింది.

పాసెంజర్లందరూ తలలు వంచి సీట్ల మధ్యలో దూరిపోయారు.

ఆ ప్రాంతాల్లో నివసించే వాళ్ళకిది కొత్తకాదు. ప్రత్యక్షంగా చూడకపోయినా ఆ నోటా ఈ నోటా ఎన్నో కథలు వింటుంటారు. ఎప్పుడో ఒకప్పుడు తుపాకీ అనుభవం కలుగుతుందని తెలుసు వాళ్ళకు.

ఉత్తరప్రదేశ్‌లోని ఆ దరిదాపుల పన్నెండు జిల్లాలనూ బందిపోట్ల దేశంగా పరిగణిస్తారు. అటు మధ్యప్రదేశ్ చంబల్ లోయనించీ యిటు రాజస్థాన్ బార్డర్ ప్రాంతం అంతా పాలించేది బందిపోట్ల ముఠాలే. ఆ ప్రాంతంలో దాదాపు రెండు వందల బందిపోట్ల గుంపులున్నాయని అంచనా. వాళ్ళలో పూలన్‌దేవి, కుసుమా, గీతా లాంటి స్త్రీ నాయకురాళ్ళున్నవి కాకుండా మాన్‌సింగ్, రాజుభట్నాగర్, మాధో మల్లా, ఘనశ్యామ్, సికార్వార్, మల్కాన్‌సింగ్ లాంటి పేరుమోసిన నాయకులుకూడా ఉన్నారు. వీళ్ళ గురించి రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. అందులో కొందరు బాహాటంగానే తిరుగుతుంటారు. గ్రామస్థులు వాళ్ళకు అతిథి సత్కారాలు ఘనంగా చేసి పంపుతారు పోలీసులు వస్తున్నారంటే వెంటనే వార్తనందచేసే ఇన్





ఫార్మర్లకు కొరత లేదు. కొండలు, నదీ లోయలు, పొలాలు వీళ్ళకు విశ్రాంతి స్థలాలు. పగలంతా విశ్రాంతి తీసుకుని రాత్రిళ్ల ప్రయాణాలు చేస్తారు. ఒక్కోసారి ఒక్క రాత్రిలో దాదాపు యాభై మైళ్ళుకూడా నడిచెయ్యగలరు. కాబట్టి వీళ్ళు ఏ సమయంలో ఎక్కడుంటారో ఎవరూ చెప్పలేరు. వాళ్ళకి వార్తలు అందచేసే ఇన్‌ఫార్మర్లు ఒక్కోసారి డబ్బుకోసం పోలీసులకు వాళ్ళ ఉనికిని చెప్పేస్తారు. అలా జరిగినప్పుడు పోలీసులు దాడి జరపడం, పోరాటంలో కొందరు చనిపోవడం జరుగుతుంటుంది. బ్రతికి బయట పడ్డవాళ్లు పారిపోయి మరో గుంపులో చేరడమో, స్వంతంగా ఒక నాయకుణ్ణి ఎన్నుకుని కొత్త గ్యాంగ్‌ని స్థాపించుకోవడమో జరుగుతుంది. కొల్లగొట్టిన డబ్బు వాళ్ళ నిత్యావసరాలకు, కొంత దాన ధర్మాలకు ఎక్కువగా ఆయుధాలు కొనుక్కోవడానికీ వినియోగిస్తారు. అత్యంత ఆధునాతనమైన అమెరికన్, ఫ్రెంచి స్టెన్‌గన్స్ ఉంటాయి వాళ్ళదగ్గర. సాధారణంగా పోలీసు యూనిఫారాల్లో తిరుగుతుంటారు.

"బందిపోట్లు" అని వాళ్ళను అసహ్యించుకునే ప్రజలు, విదేశీ తుపాకుల్ని రహస్యంగా తెప్పించి బందిపోట్లకు పెద్ద లాభాలకు అమ్ముకునే పెద్దమనుష్యుల్ని గౌరవిస్తుంటారు. ప్రభుత్వంకూడా పదిమంది బెదిరించి డబ్బు లాగేవాళ్ళను బందిపోట్లంటుంది కాని, పెద్దమనుష్యుల ముసుగేసుకున్న అసలు బందిపోట్లకి రక్షణ కల్పిస్తుంది.

తుపాకుల శబ్దం ఆగింది. సీట్ల మధ్యగా ఇరుక్కున్నవాళ్ళు లేవడానికి సాహసించలేక పోతున్నారు. ధడాలున బస్సు తలుపు తెరుచుకుంది. నలుగురు వ్యక్తులు స్టెన్ గన్స్‌తో లోపలకు ప్రవేశించారు.

"అందరూ లేచి సీట్లలో కూర్చోండి" ఆజ్ఞాపించిందో కంఠం.

అందరూ లేచి కూర్చున్నారు ఓపిల్లవాడు సీటు కింద కాలు చిక్కుకొని

మీ జీవిత భీమా పాలసీ హక్కుదారులను నియామకం చేయడం మరువకండి.



ఆనందరావుగారి జీవితానికి జీవిత భీమా పాలసీకి ఎంతో కోరిక వున్నది ముందాలోచనతో, క్షుణ్ణంగా ఆలోచించి ఆర్థిక కట్టుదిట్టం చేసుకొన్నారాయన. అకస్మాత్తుగా జరగరానిది జరిగిపోతే తనవారి జీవితాలకు కొంత ఆధారం కలిగించటానికి తగుచర్యలు తీసుకొన్నారు.

ఇంత ఆలోచనాపరుడయివుండి కూడా ఒక చిన్న విషయంలో పొరపాటు చేసేశాడాయన. అదే తన జీవిత భీమా పాలసీ హక్కు తన తర్వాత శ్రీమతికి చెందాలని వ్రాసివ్వడము మర్చిపోవడమే. హఠాత్తుగా జరగరానిది జరిగిపోయింది. క్లెయిము పరిష్కారం జరిగేటప్పటికి ఆనందరావుగారి శ్రీమతి ఎదురుచూస్తుంది. ఎన్నో చట్టబద్ధమైన నియమాలు, వ్యవహార పద్ధతులు, తద్వారా సంభవించే ఆలస్యానికి గురి అయిందామె. ఇలాంటి చిక్కు లేకుండా వుండాలంటే హక్కుదారులను నియామకం చేయండి.

గుర్తుంచుకోండి. జీవిత భీమా ఒక దీర్ఘకాల ఒప్పందం లాంటిది. ఈ ఒప్పంద కాలంలో, వ్యక్తి జీవితంలో, జీవన సరళిలో ఎన్నో మార్పులు రావచ్చు. మీరు వివాహం చేసుకోవచ్చు. పెరిగే కుటుంబానికి భద్రత చేకూర్చే అవసరం రానే వస్తుంది. తల్లి, తండ్రి, సహోదరి—వీరిలో ఇదివరకు ఎవరైతే హక్కు చెందాలని వ్రాసి ఇచ్చారో వారి పేరు మార్చి శ్రీమతికి చెందేలా వ్రాసి ఇవ్వాలని మీరు కోరడం సహజమే కదా.

కుటుంబ బాధ్యతలు పెరుగుతూంటే, స్వంత ఇల్లు కట్టుకోటానికి పాలసీని తాకట్టు పెట్టే అవసరం రావచ్చు. అలాంటి పరిస్థితిలో మీరు వ్రాసి ఇచ్చిన హక్కుదారుల పేరు చెల్లదు. ఋణం చెల్లింపడం ముగిసాక, పాలసీని మళ్లీ మీరు స్వాధీనం చేసుకొన్నాక, హక్కుదారుల పేరు తనంతటతానే పునః స్థిరీకరించబడదు. మళ్లీ క్రొత్తగా హక్కుదారుల పేరు వ్రాసి ఇవ్వాల్సివస్తుంది. క్లెయిము పరిష్కారం జరిగేటపుడు ఇబ్బందులకు, ఆలస్యాలకు ఆస్కారం లేకుండా చేసుకోవాలంటే ఇది తప్పనిసరి.

ఒకవేళ, జీవిత భీమా పాలసీ తీసుకొనేటప్పుడు ఋజువైన వయస్సు వ్రాయకపోతే, తర్వాత వయస్సు వ్రాయించడం అత్యవసరం. మీ వయస్సుకు ఋజువు పత్రాలను మీ పాలసీ వ్యవహారాలు చూసే బ్రాంచికి పంపండి.

మీరు జీవిత భీమా ద్వారా ఆదా చేసుకొన్న సొమ్మును ఒక మంచి మార్గంలోకి మళ్లించుకొని మీ దారికి, మీ కుటుంబానికి అవసరమైన భద్రత సమకూర్చటానికి సిద్ధమైనప్పుడు హక్కుదారుల నియామకం, లేక అవసరాన్నిబట్టి హక్కుదారుల పేరు మార్పిడం, వయస్సు వ్రాయించడం మొన్నగు విషయాలను గురించి జాగ్రత్త వహించటం ఎంతో వివేకమూ, మీకు మరింత ఉత్తమ సేవ చేయటానికి ఎల్ఐసికి ఎంతో సహాయంగానూ వుంటుంది.

మీకు ఉత్తమ సేవ అందించటంలో మాకు తోడ్పడండి. మీకు సహాయం చేయటానికి మా ఏజెంట్లు సర్వదా సంసిద్ధం. జీవిత భీమా పాలసీ సంబంధంగా సరైన సలహా తీసుకోటానికి, ఉత్తమ ఆస్కారం తర్వాత సేవ పొందటానికి ఎల్ఐసి ఏజెంటును కలుస్తూ వుండండి.

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
30 సంవత్సరాల సుదీర్ఘ ప్రజాసేవ

ent/LIC/2-87 TEL

పెద్దగా ఏడవడం మొదలుపెట్టాడు. అతడి తల్లి భయంతో నోటమాటరాక చూస్తోంది గుడ్లప్పగించి. అందరి దృష్టి తన మీదే పడటంలో బిక్కుమని చూస్తోంది.

ఖద్దరుమీసాలతో తలపాగా పెట్టుకున్న యాభై ఏళ్ళ వ్యక్తి అటువైపు నడిచాడు.

"వద్దు, వద్దు" పెద్దగా ఏడ్వడం మొదలుపెట్టిందావిడ. అయినా అతడాగ లేదు. బస్సులో వాళ్ళెవరూ కదలలేదు. ఎదిరిస్తే ఏం జరుగుతుందో అందరికీ తెలుసు. అతడు వంగి సీటుకిందనుంచి పిల్లవాడిని ఒడుపుగా లాగి వాళ్ళమ్మ ఒడిలో పడేశాడు.

"మీ దగ్గరున్న విలువయిన వస్తువుల్నీ డబ్బునీ, బయటకు తీయండి. దాచ డానికి ప్రయత్నిస్తే నాలుగు తన్ని తీసుకోవాల్సి వస్తుంది. హిందీలో అన్నాడు.

ఎవరిదగ్గరా విలువైన వస్తువులంటూ ఏమీలేవు. ఉన్న కాస్తడబ్బునీ తీసి యిచ్చేశారు. స్త్రీల మెడల్లో మంగళసూత్రాలనీ, పిల్లల వంటిమీదున్న వస్తువుల్నీ తీసుకోలేదు వాళ్ళు. హరీష్ దగ్గరకు వచ్చాడో వ్యక్తి.

కష్టపడి కూడబెట్టిన డబ్బు చేతులారా యివ్వాలంటే బాధగా ఉందతనికి. అయినా ఏమీ లేదని బుకాయించలేక పోయాడు. సంచీ తీసి అందించేశాడు.

"హు, బాగానే ఉందే డబ్బు. మంచి ఖరీదయిన చీరెలు" ఆ వ్యక్తి సంతోషంగా సంచీ భుజానికి తగిలించుకున్నాడు.

నాయకుడు తలుపు దగ్గరగా వచ్చి నిలబడ్డాడు.

"సాబ్" పిలిచాడు హరీష్. అతడు తలతిప్పి చూశాడు.

"ఆ ఒక్కచీర మా అమ్మకోసం కొన్నది యిప్పించెయ్యండి" దీనంగా అన్నాడు హరీష్.

నాయకుడి భృకుటి ముడిపడింది.

"జానీ! ఇతడి దగ్గరనుంచి చీరలు తీసుకున్నావా?" అడిగాడు. జానీ పరుగున వచ్చి సంచీ అందించాడు. అతడందులోంచి అన్నీ తీసి చూశాడు.

గమనిక!

ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ నిర్ణయం ప్రకారం త్రిమూర్తులు అఫ్ పేజీ ప్రచురించమని నిర్మాతలు తెలియజేశారు. కానీ, త్రిమూర్తులు ప్రకటన అప్పటికే అచ్చు అయిపోయినందున క్షమించ గోర్తున్నాం.

అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్

"ఎవరికివి ?" హరీష్‌ని అడిగాడు.

"ఆ తెల్లది మా అమ్మకు. నాలుగురోజుల్లో నా పెళ్ళి"

నాయకుడు డబ్బుతోసహా అన్నీ హరీష్ చేతుల్లో పెట్టాడు.

"ఇక పదండి. అసలుపని మర్చిపోకండి" ఆజ్ఞాపించాడు. అన్యాయంలో కూడా నైతిక విలువలుంటాయి. మనసు పరిధంతా స్ట్రగుల్‌ఫర్ ఎగ్జిస్టెన్సయినా కేంద్ర బిందువులో మానవత్వం వుంది.

"సాబ్" పిలిచాడు హరీష్. ఏమిటన్నట్టు వెనక్కి తిరిగాడు.

హరీష్ వంగి అతడి కాళ్ళకు నమస్కరించాడు.

"మీరు ఖలీరామ్‌గదూ! ఇప్పుడు గుర్తుపట్టాను. బాల్పురాలో నా పెళ్ళి. వస్తే సంతోషిస్తాను".

నాయకుడు ఖలీరామ్ అతడిని లేపి భుజం తట్టాడు ఆప్యాయంగా. తర్వాత పాసింజర్లవైపు తిరిగి "బిర్జూ అగర్వాల్, లేచి మాతోరా" అన్నాడు.

మూడోసీటులో కిటికీపక్కన కూర్చున్న బిర్జూ ఉలిక్కిపడ్డాడు తనపేరు బందిపోట్లకెలా తెలిసింది ?

"నిన్నే బిర్జూ, నువ్వు మాతో వస్తున్నావు" అతడి కళ్ళలోకి చూస్తూ కఠినంగా అన్నాడు ఖలీరామ్.

అప్పుడర్థమయింది అందరికీ ఆ దాడిలో అంతరార్థం.

వాళ్ళు బిర్జూని కిడ్నాప్ చేయబోతున్నారు.

అధికార వార్తల ప్రకారం 1980లో 52, 1981లో 28 కిడ్నాపింగ్స్ జరిగాయా ప్రాంతంలో. కాని రికార్డుల కెక్కనివి మరెన్నో. తమ బిడ్డల్ని వదిలించుకోవడానికో, తమని తాము రక్షించుకోవడానికో అనేకమంది లక్షలకొద్దీ రూపాయలు బందిపోట్లకు సమర్పించుకున్నారు.


బిర్జూ గొడవ చెయ్యకుండా దిగి వాళ్ళతో వెళ్ళిపోయాడు. ఎద్దుబళ్ళు అడ్డు తొలిగాయి. బస్సు ముందుకి కదిలింది

చీకట్లోంచి మరో నలుగురు వ్యక్తులు బయటకొచ్చారు.

బిర్జూకి ఇరవై రెండేళ్ళుంటాయి. బి.ఏ. పాసయ్యాడీమధ్యనే. అతడి తండ్రికి మైన్‌గంజ్‌లో బట్టల దుకాణాలున్నాయి. డబ్బు బాగానే సంపాదించాడు. తనలాగా బందిపోట్లకు చిక్కిన వాళ్ళగురించి విన్నాడు బిర్జూ. తమని మర్యాదగానే చూస్తారు. తండ్రిని డబ్బు అడుగుతారు. ఇస్తే గొడవేలేదు మర్యాదగా సాగనంపుతారు. ఇవ్వకపోతనే ప్రమాదం. బిర్జూకి తండ్రిమీద నమ్మకం ఉంది. అందుకే ధైర్యంగా ఉన్నాడు.

అతడిముందు కాన్వాస్ బూట్లు ఉంచారెవరో.

"మార్చుకో" కాళ్ళకున్న షూస్ విప్పి అవి తొడుక్కున్నాడు. కళ్ళకు గంతలు కట్టారు.



ఆ రాత్రి వాళ్ళు దాదాపు యిరవై కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. తెల్లవారబోయే సమయానికి ఒక పల్లెటూరు చేరుకున్నారు. ఒకరి ఇంట్లో వాళ్ళకు ఆశ్రయం దొరికింది.

తనలాంటి మరో యిద్దర్ని కలుసుకున్నాడు బిర్జూ.

అందులో ఒకడు రాజు పటాలే. రాత్రివేళ షాలంనించి నలుగురు స్నేహితులతో కలిసి యింటికి వెళుతోంటే దాడిచేసి పట్టుకొచ్చారతడిని. అయిదులక్షల రూపాయలు పంపమని అతడి తండ్రికి ఉత్తర్వు వెళ్ళింది. అంత యివ్వలేననీ లక్ష రూపాయలు యిస్తాననీ' వార్త పంపించాడు ఆయన. వీళ్ళు 'కనీసం రెండు లక్షలు యివ్వాలని' మరో ఉత్తరం పంపారు. దానికింకా జవాబు రాలేదు.

రెండోవాడు వినయ్ కుమార్. అతడిదీ బట్టల వ్యాపారమే. భార్యతో కలసి సినిమాకు వెళ్ళి వస్తుంటే పట్టుకున్నారు. భార్యని మర్యాదగా యింటిదగ్గర విడిచిపెట్టి అతడిని తీసుకొచ్చారు. అతడి మామగారు బాగా డబ్బున్నవాడు. రెండులక్షలకు కబురు వెళ్ళింది. సమాధానం రాలేదింకా.

అంతా కలసి మరో మూడురోజులు అలాగే ప్రయాణం సాగించారు. పగలంతా నిద్రపోవడం రాత్రిళ్ళు ప్రయాణం కాలి నడకనే.

నాలుగోరోజున బిర్జూచేత తండ్రికి ఉత్తరం రాయించాడు ఖలీరామ్.

ఆ ఉత్తరం బిర్జూ తండ్రి కృష్ణ అగర్వాల్ యింటిముందు పోస్టుబాక్సులో వేయబడింది. మరో రెండురోజుల్లో డబ్బు ఎక్కడ అందజేయాల్సిందీ తెలుపుతామని ఉందందులో.

• • • •

మైనపురి డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ పోలీసు కార్యాలయం హడావిడిగా ఉంది డిప్యూటిసూపరింటెండెంట్. అసిస్టెంట్లూ, నలుగురు ఇనస్పెక్టర్లు విశ్రాంతి లేకుండా తిరుగుతున్నారు.

యు.పి. ఇన్ స్పెక్టర్ జనరల్ రజీందర్‌సింగ్ జీపు వచ్చి ఆగింది.

డిప్యూటీ సూపరింటెండెంట్ కరమవీర్‌సింగ్ ఆయనకు సెల్యూట్ చేసి నిలబడ్డాడు.

"ఎంతవరకు వచ్చింది?" అడిగాడు రజీందర్‌సింగ్.

"అంతా సిద్ధమయినట్టేసర్. రెండు వందలమంది కానిస్టేబుల్స్ రెడీగా ఉన్నారు. అమ్మూనిషన్ రెడీ, మరో రెండు ట్రక్కులు రావాల్సిఉంది. అందుకే ఎదురు చూస్తున్నాం"

"గుడ్, రాత్రి తొమ్మిదయ్యేసరికి మీరు బాల్పురా చేరుకోవాలి"

"అయిపోయిందిసర్"

"మనకందిన సమాచారం కరెక్టేనా?"

"పూర్తిగా కరెక్టేసర్. అక్కడ ఒక పెళ్ళికి అటెండవుతాడని తెలిసిందిసర్"

"సరే జాగ్రత్త. ముగ్గురు వ్యక్తులు అతడి చేతిలో ఉన్నారు మీరు చాలా జాగ్రత్తగా వ్యవహరించవలసి వస్తుంది. ఎంత రక్తపాతం జరిగినా సరే వదలకండి. ఈ సారితో ఛబీరామ్ అంతమయి పోవాలి"

"అలాగే సర్. తప్పకుండా నాజీవితంలో నేను ఎదురు చూస్తూన్నది యిలాంటి అవకాశం కోసమేసర్ నా ప్రాణాలు పోయినా సరే ఛబీరామ్ ప్రాణాలతో తప్పించుకోలేడు సర్"

సర్కిల్ ఇనస్పెక్టర్‌గా పనిచేసిన అతడి తమ్ముడు ఓ పోరాటంలో ఛబీరామ గుంపుకి ఆహుతయి పోయాడు రెండేళ్ళ క్రితం ఆ నాటినుంచీ అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు కరమవీర్ సింగ్.

"సరే, అయితే నేను వెళ్ళొస్తాను విజయంతో తిరిగి వచ్చాక కలుస్తాను విష్ యూ ఆల్ ది బెస్ట్"


"థాంక్యూసార్, నా ప్రయత్నంలో లోపం ఉండదు"

రజీందర్ జీపులో కూర్చున్నాడు.

"ఒక్క విషయం చెప్పడం మర్చిపోయాను కరమ్‌వీర్. భిండ్ నుంచి ఫోన్ వచ్చింది నేను వచ్చే ముందే అక్కడ డెకాయిట్స్ కని కొత్త ఎస్.పి ని వేశారుగా. వాళ్ళకు వార్త అందిందట ఓ వందమంది బయలుదేరి వస్తున్నామని ఫోన్ చేశారు. షంగర్ నదికి అటువైపున కాపలా కాస్తారట.

"వాళ్ళెందుకు సర్ రావడం?" మొహం చిట్లించాడు కరమ్‌వీర్

"భిండ్‌లో ఛబీరామ్ మీద చాలా కేసులున్నాయి మర్డర్ కేసులూ, రేప్ కేసులూ కూడా ఉన్నాయి మనలాగే వాళ్ళు చాలా పట్టుదలగా ఉన్నారు అయినా వాళ్ళు వచ్చేటప్పటికి నువ్వేం పని పూర్తి చేసేస్తావు ఛబీరామ్ మన చేతుల్లో చిక్కితేనే నాకు సంతోషం" నాకు రావల్సిన విజయం మరో యస్.పి.కి దొరక్కూడదన్న హెచ్చరిక వుంది అతడి కంఠంలో.



"తప్పకుండా ప్రయత్నిస్తాను సర్. అయినా ఆ వచ్చేది ఎవరో మీకు తెలుసుగా మనలాగా వాళ్ళలో ధైర్యం ఉండదుసర్.

ఇద్దరూ ఎగతాళిగా నవ్వుకున్నారు – ఆ కొత్త యస్.పి.ని తల్చుకుని.

జీపు కదిలింది.

* * * *

రజీందర్ కరమ్‌వీర్‌లు భింద్ సూపరింటెండెంట్‌ని చాలా తక్కువగా అంచనా వేశారు.

మధ్య ప్రదేశ్‌లో భింద్‌నించి, ఉత్తర ప్రదేశ్ బార్డరు దాటి యిటావా దగ్గరకు వచ్చేసింది ఆ బెటాలియన్.

ఎలాంటి పరిస్థితుల్లో నయినా ఛబీరామ్‌ను పట్టుకు తీరాలని ధృఢ నిశ్చయంతో వస్తున్నారు వాళ్ళు కూడా.

ఆ బెటాలియకలో ఆ ఉత్సాహాన్నీ, పట్టుదలనీ రేకెత్తించిన వాళ్ళ ఎస్.పి ఆ ప్రాంతానికి కొత్త. వచ్చి నేలరోజులే అయింది.

వచ్చిన రోజున ఎవరూ కేర్ చేయలేదు. కారణం ఆమె ఓ స్త్రీ కావడం ఆమె పేరు వైజయంతి.

* * * *

పోలీసు డిపార్టు మెంటులో అంత ఉన్నత స్థానంలో ఓ స్త్రీని చూడడం అదే మొదలు వాళ్ళకి.

రెండో రోజున వాళ్ళ కర్థం అయింది వైజయంతి అందరిలాంటి మామూలు స్త్రీ కాదని. డ్యూటీలోవుండి పొరపాటు చేసినందుకు మొదటిరోజే ముగ్గురు పోలీసులు సస్పెండు కాబడ్డారు.

మూడో రోజున ఆమెలో దాయర్ధ్రి హృదయాన్నీ, స్వభావాన్ని కూడా రుచి చూశారు.

నాలుగో రోజున ఆమె అందర్నీ సమావేశ పర్చింది.

"ఫ్రెండ్స్, ఈ రోజునించీ నేను పూర్తిగా ఛార్జి తీసుకుంటున్నాను. నన్ను ఒక ప్రత్యేకమయిన పని మీద నియమించింది ప్రభుత్వం. అది అంటే నా కర్తవ్యం సరిగా నిర్వహించ గలగాలంటే మీ అందరి సహకారం కావాల అంటే మా డ్యూటీ మీరు సవ్యంగా చేయాలి. మా అందరి డ్యూటీ లేమిటో, నా డ్యూటీ ఏమిటో కూడా నాకు బాగా తెలుసు. డ్యూటీ సరిగ్గా చేసే వాళ్ళందరూ నాకు మిత్రులు. తప్పించుకునే వాళ్ళని నా శత్రువులుగా పరిగణిస్తాను. నా శత్రువులని ఎలా దెబ్బ కొట్టాలో నాకు బాగా తెలుసు. ఇంకొక్క విషయం నేను ఒక పోలీసు ఆఫీసర్నని మాత్రమే నాకు గుర్తుంటుంది. ఒక స్త్రీ నన్న విషయం నేను మర్చిపోతుంటాను ఆ విషయాన్ని నాకు గుర్తు చేయాలని మాత్రం ఎప్పుడూ ప్రయత్నించకండి. అప్పుడు నిజమైన స్త్రీ శక్తేమిటో నేను మీకు చూపించవలసి వస్తుంది"

ఆ స్త్రీ శక్తిని వారం రోజుల్లోనే వాళ్ళు స్వయంగా చూడగల్గారు.

అప్పటికప్పుడు ఓ యాభై మంది. సిబ్బందిని బయలుదేర దీసి చంబల్ లోయ లోకి వెళ్ళిందామె. బందిపోటు సియరం గుంపు ఆ ప్రాంతంలో విడిది చేసినట్లు ఆమె కెవరు చెప్పారో కూడా ఎవరికీ తెలియదు. ఎక్కడకు వెళుతున్నదీ ఆమె ఎవరితోనూ అనలేదు. కారణం పోలీసుల్లో కూడా కొందరు గూఢచారులుంటారు వాళ్ళు బంది పోట్లకు పోలీసుల కదలికలను గూర్చి వార్తలు అందిస్తుంటారు.

పద్నాలుగు గంటల పాటు ఏకధాటిగా ప్రయాణం చేసింది వైజయంతి రెండు గంటలు అందర్నీ విశ్రాంతి తీసుకోమంది. ఇంకెంత దూరం ప్రయాణించాలో ఎవ రికీ తెలియదు. అడగాలంటేనే భయం. అయితే వాళ్ళు ఎక్కువ సేపు ప్రయాణం చేయాల్సిన అవసరం రాలేదు. ఏడు మైళ్ళ దూరంలోనే ఉంది బందిపోట్ల ముఠా. పోలీసుల్ని గుంపులుగా విడగొట్టి దార్లు చెప్పింది. ఒకగుంపుకి - మరో గుంపు ఎటు వెళ్తుందో తెలీదు. ఎంతవేగంతో ప్రయాణం చెయ్యాలో మాత్రమే చెప్పింది చీకటి పడ గానే ప్రయాణం సాగించారు. దిశ వేగం - వాళ్ళని అనుకున్న చోటుకి నాలుగు వైపు ల్నుంచీ ఒకే సారి చేర్చింది. ఆమె తెలివి తేటలకి పోలీసులే ఆశ్చర్యపోయారు. అది చాలా పెద్ద పొలం. ఆర్డర్ యిచ్చేవరకు కాల్పులు జరప వద్దంది వైజయంతి. సియారాం గుంపే ముందు కాల్పులు జరిపింది. ఆరుగురు బందిపోట్లని ప్రాణాలతో పట్టుకో గలిగారు. నలుగురు కాల్పుల్లో మరణించారు. సియారాం, అతడి ప్రేయసి కుసుమ ముందుగానే తప్పించుకున్న విషయం తెలియలేదు వైజయంతికి. తమతోనే ఉన్న శత్రువుని పట్టేసింది వైజయంతి. ఆమెకి ఆ అనుమానం కాస్త ఆలస్యంగా వచ్చింది ఈలోపులోనే శత్రువులకి వర్తమానం వెళ్ళిపోయింది. బందిపోట్లు పక్షికూత రూపంలో తాము ఎదురు చూస్తున్నట్టు ఇన్ఫార్మర్ కి తెలుపుతారు. యిలాటి కూతని తన క్యాంప్ కి దూరంగా ఏర్పాటు చేసింది. ఇన్ఫార్మర్ రహస్యంగా వచ్చాడు. ఆమె పన్నిన వలలో చిక్కుకుపోయాడు.



అతడు సబ్ యినస్పెక్టర్. అందరూ విశ్రాంతి తీసుకునే సమయంలో రహ స్యంగా సియారాంకు వార్త పంపాడు. సియారాం తన గుంపుని వదిలి పారిపోయాడు ఆ యిన్స్పెక్టర్ని కూడా బందిపోట్లతో సహా కలిపి బంధించి ఖైదు చేయకుంది వైజయంతి. సియారాం, కుసుమల ఎస్కేప్ గురించి బాధపడలేదామె. పారిపోయి సియారాం పెద్ద పొరపాటు చేశాడు, అతడి కోసం అనుక్షణం వేటాడుతోంది పూలన్ దేవి. గుంపుని వదలి ఆమెతో ఒంటరిగా పోరాడడం సాధ్యం కాని పని సియారాంకు.

ఈ బంది పోట్లల్లో కూడా సంబంధ బాంధవ్యాలు గమ్మత్తుగా వుంటాయి.

బందిపోటు పూలన్ దేవికి శత్రువు కుసుమ! పూలన్ లాగా తనూ పెద్ద బంది పోటు రాణి ననిపించుకోవాలని ఆమె ఆరాటం.

1981 మే 7 న ఉత్తర ప్రదేశ్ ని అస్త్రా అనే గ్రామంలో, ఆ ఊరి పెద్ద రాంసింగ్ భార్యను పదిమందిలో వస్త్రాపహరణం చేసి నగ్నంగా నిలబెట్టడంతో పోలీసు రికార్డుల కెక్కింది కుసుమ.

కుసుమ తండ్రి ఒక స్కూలులో చప్రాసీ. చాలా చిన్నతనంలో కేదార్ నాథ్ అనే వ్యక్తితో ఆమె వివాహం జరిగింది అత్తింటిలో యిమడలేక కుసుమ పుట్టింటికి పారి పోయింది. ఆమెఒక సెక్స్ మానియాక్ అంత చిన్న వయసులోనె ఆమెకు చాలా మందితో సంబంధం ఉండేది. పుట్టింటికి తిరిగి వచ్చినప్పుడు ఆమెకు పదిహేడేళ్ళు చాలా అందంగా నిండు యవ్వనంలో వుంది. మార్చి 8, 1978 న మాధోమల్లా అనె బందిపోటు ఆమెను చూసి మోహించి ఎత్తుకుపోయాడు. అతడి ఉంపుడుకత్తెగా కొంతకాలం ఉండి పోయిందామె. మధోమల్లా సామ్రాజ్యానికి శత్రువృందం విక్రమ్ముల్లా అనే మరో గుంపు (పూలన్ దేవి ఆ గ్యాంగ్ లోనే ఉండప్పుడు). ఆ రెండు గుంపులకీ ఒక సారి పెద్ద పోరాటం జరిగింది. అందులో కుసుమకి గుండు దెబ్బ తగిలింది. ట్రీట్ మెంట్ కోసం ఆమెను ఢిల్లీ పంపించారు. అక్కడే ఆమెను పోలీసులు అరెస్టు చేశారు.

అప్పటికే విక్రమ్మల్లాకి కుసుమ మీద మనసు పుట్టింది. ఆమెను బయిలు మీద విడిపించడానికి విక్రమ్ లక్షల రూపాయల డబ్బు వెదజల్లాడు. కుసుమ జైలు నించి బయ...

పడింది. విక్రమ్‌కి చేరువయింది. అదేగుంపులో వున్న పూలన్‌దేవికి కుసుమకి ఒక్కక్షణం పడేది కాదు. అసూయతో రగిలిపోతూండేవారు. వాళ్ళ ముఠాలోనే ఉన్నాడు సియారాం. అతడు కుసుమ మాజీ ప్రియుడు. కొంతకాలానికి కుసుమకి తన ప్రస్తుత ప్రియుడైన విక్రమ్ అంటే మొహం మొత్తింది. మాజీ ప్రియుడే తన యవ్వనపు కోర్కెల్ని అణచగల మగధీరుడు అనుకుంది. అదీగాక విక్రమ్ పూలన్‌దేవితో కూడా గడపటం అంత ఇష్టం వుండేది కాదు. అందుకని సియారాంతో "విక్రమ్ నిన్ను చంపడానికి ప్రయత్నిస్తున్నాడని" అతడిని ఉసికొల్పింది కుసుమ. ఆ రాత్రే విక్రమ్‌ని చంపేశాడు సియారాం, పూలన్‌దేవి పారిపోయి స్వంతంగా ముఠాని ఏర్పరుచుకుంది. తన ప్రియుడి హత్యకు ప్రతీకారం తీర్చుకుంటానని మంటముందు ప్రతిజ్ఞ చేసిందామె. ఈవిధంగా-గొప్పగొప్ప రాజ్యాలు స్త్రీ కారణంగా చీలిపోయినట్టే-చంబల్ లోయలో ముఠాలు రెండుగా చీలిపోయాయి.

పారిపోయిన ముఠాకి సియారాం నాయకుడయ్యాడు. అతడి తమ్ముడు లాలారాం, భార్య కుసుమ అందులో ముఖ్యమైన మెంబర్లు, కుసుమ అందరికి ప్రియురాలే వాళ్ళ గ్యాంగు చెయ్యని ఘోరాలు లేవు. అన్నింటి వెనుకా కుసుమదే హస్తం.

అలాంటి సియారాం గుంపుని అంత చాకచక్యంగా వైజయంతి ఎదిరించిన తీరు పోలీస్ సర్కిల్స్‌లో దుమారాన్ని లేపలేదు. కారణం ఒక స్త్రీ విజయాన్ని అంత త్వరగా ఎవరూ అంగీకరించలేక పోవడమే. పైగా సియారాం తప్పించుకు పోవడం ఆమె ఓటమిగా చాటించారు.


దాడిలో ఆమెతో పాటు పాల్గొన్న ఆమె సిబ్బందికి మాత్రమే తెలుసు ఆమె నిజ స్వరూపం. ఆమె ఎంత తెలివి తేటలు గలదో అంత ధైర్యం కూడా ఆమెలో ఉందనీ, ఆమెలో ధైర్యం పిరికి వాళ్ళలో కూడా ధైర్యాన్ని కలుగ చేస్తుందనీ అర్థమయింది వాళ్ళకు.

ఈ రోజు ఆమె భభీరామ్ మీద దాడి జరపటానికి నిశ్చయించుకుంది. అందుకే ఈ రోజు ఉత్సాహంగా ప్రయాణం చేస్తున్నారు. షంగార్ నదీతీరం చేరుకునే సరికి సాయంత్రం అయింది. అక్కడే విడిది చేశారు. ఉదయం నది దాటి ప్రయాణం సాగిద్దామంది వైజయంతి. నదిని దాటాక అంతా కచ్చా రోడ్డు, రాత్రిళ్ళు ప్రయాణం చేయడం కష్టం జీపులు లేకుండా.

ఆ రాత్రి ఆమె నిద్రపోలేదు. అక్కడికి ఇరవై కి॥ మీ॥ దూరంలో ఉంది హకీనా గ్రామం. భభీరామ్ స్వంత ఊరది.

ఇద్దరు ఇనస్పెక్టర్లతోపాటు సివిల్ డ్రెస్‌లో హకీనాగ్రామం చేరుకుందామె. భభీరామ్ ఆ ఊరు వచ్చే అవకాశాలేమయినా ఉన్నాయేమో తెలుసుకోవాలి.

ఊరు కాస్త మధ్యస్థంగా ఉంది. దాదాపు పదివేల జనాభా ఉండవచ్చు, బాగా అభివృద్ధి పొందిందన్నట్టు సూచనగా చాలా దాబాయిళ్ళు కనుపిస్తున్నాయి. మంచి హోటళ్ళున్నాయి. ముఖ్యంగా అందరి మొహాల్లో ఉత్సాహం కనుపిస్తోంది.



ఆ ఊళ్ళోనే ఉన్న ఓ గూఢచారిని కలుసుకున్నారు వాళ్ళు. అతడు చెప్పిన మాటలకు ఆమె అత్యంత ఆశ్చర్యంతో స్థాణువై నిలబడి పోయింది.

దాదాపు వంద బందిపోటు దొంగతనాలకు నాయకత్వం వహించి ఇరవైమంది పోలీసుల హత్యలకు కారణభూతుడయిన భభీరామ్ ఆ ఊరి ప్రజలకు భగవంతుడు. తమ ప్రాణాలనయినా అర్పిస్తారుగాని భభీరామ్ గురించి ఒక్క విషయమైనా బయట పెట్టరు. ఆ ఊరికి అతనో రాబిన్‌హుడ్. పేదల రక్తమాంసాలతో పునాదులు వేసుకుని మేడలు కట్టిన వాళ్ళందర్నీ ఏదో ఒకరకంగా దోచి కష్టపడి పనిచేసే కూలీలకు పంచి పెడతాడు.

అతడి క్షేమాన్ని గురించి భయపడేవాళ్ళకు అతడిచ్చే జవాబు "చెమటోడ్చి పనిచేసే కార్మికుణ్ణి కొల్లగొట్టేవాడున్నంతకాలం నాలాంటి భభీరామ్‌లు ఉంటూనే ఉంటారు. నేనుకాకపోతే నాలాంటి మరొకడు" అని.

అతడు వస్తున్నాడంటే పండగ చేసుకుంటారక్కడివాళ్ళు, అతడున్న కాసేపూ కంటికి రెప్పలా కాపాడుకుంటారు. అందుకే అతడి ముఠామీద ఆ ఊళ్ళో దాడి చేయడం అవివేకం.

వైజయంతి క్యాంపుకి తిరిగి వచ్చింది.

మనసెందుకో కలచినట్లనిపిస్తోంది.

"ఏది న్యాయం? ఏది ధర్మం? చట్టానికి లోబడి జరిగే అన్యాయాలన్నీ బయటకురావు. ఒకవేళ బయట పడినా వాళ్ళ పలుకుబడికి హరించి పోతుంది ఎవరికీ తెలియకుండా. కల్తీ వ్యాపారం చేసి ప్రజలను స్లో పాయిజన్‌తో చంపేవాడికి రాజకీయ నాయకుల మద్దతుంటుంది. కల్తీ మందులతో అమాయక ప్రజల ప్రాణాలు తీసేవాడు చట్టం చేతిలోంచి బయట పడగలడు. రుజువులూ, సాక్ష్యాలూ రికార్డుల్లోంచి మాయమయి పోతుంటాయి. వాటిని ఎదిరించినందుకే తనకీ ప్రాంతానికి ట్రాన్స్‌ఫరయింది. బందిపోట్లని ముద్రపడ్డవాళ్ళందర్నీ కేసేమిటోకూడా విచారించకుండా హత్య చేసేస్తే తనకు మంచి పేరొస్తుంది. ఆ రకంగా రాజకీయ నాయకుల మద్దతున్న

వ్యాపారస్తులకు లాభం కలుగుతుంది. ఎంత స్వార్థం!"

ఆలోచిస్తుంటే ఆమెలో ఆవేశం కట్టలు తెంచుకుంది. ఏదో ఒకటి చెయ్యాలి. ఎన్‌కౌంటర్ల పేరుతో జరిగే మారణ హోమాలు ఆగాలి. వాళ్ళు న్యాయంగా చట్టానికి లొంగిపోయే ఉపాయాలు చూడాలి. అదంత సులభమయిన పని కాదు. కాని ప్రయత్నం చేయకుండా ఓటమి ఎప్పుడు ఒప్పుకోదు వైజయంతి.

తన ఆశయాన్ని మర్నాటి దాడిలోనే అసలు జరుపాలనుకుంది.

* * * *

శంగార్ నది అవతల వైపున మైనపురికి పది కిలో మీటర్ల దూరంలో విడిది చేశారు కరమ్‌వీర్‌సింగ్ పటాలం. వైజయంతి కూడా వస్తున్నదని తెలియగానే మరో బెటాలియన్ కూడా తరలించాడు కరమ్‌వీర్ భవీరాం తనకే చిక్కాలి అని అతడి ఆశ.

ఉదయం ఆరుగంటలనుంచి రెండు పక్కల నుంచీ భవీరాం గుంపుని ముట్టడించాలని అవతలివాళ్ళకు ఆదేశాలిచ్చింది వైజయంతి. వాళ్ళు ప్రయాణిస్తున్న మార్గం గురించి అరగంటకోసారి తెలుపుతూ ఉండమని చెప్పింది. ఇనస్పెక్టర్లందరి దగ్గరా వైర్‌లెస్ సెట్లున్నాయి.


"త్వరపడి ఫైరింగు చెయ్యకండి సాధ్యమయినంత వరకు వాళ్ళను ప్రాణాలతో పట్టుకోవాలి. కావలసినన్ని స్మోక్‌ల బాంబ్స్, టియర్‌గ్యాస్ షెల్స్ వెంటతీసుకురండి వాళ్ళ ఉనికి ఎవరికి ముందుగా తెలిసినా రెండోవాళ్ళకు తెలియ చేద్దాం, అప్పుడు ఒక్కసారిగా నాలుగువైపు నుంచీ చుట్టుముడదాం" వైర్‌లెస్‌లో చెప్పింది

"అలాగే మేడం, కాని వాళ్ళే ముందుగా ఫైరింగ్ చేయడం మొదలు పెడితే?" అని అడిగాడు కరమ్‌వీర్ అట్నుంచి వైర్‌లెస్‌లో. అతడికి కష్టంగా ఉంది మరో రాష్ట్రానికి చెందిన వాళ్ళు తనకు ఆదేశాలివ్వడం. కాని ఏమీ అనలేదు ఆమె ర్యాంక్ తనకన్న పెద్దది తన బాస్ దగ్గర పర్మిషన్ తీసుకు వచ్చింది. అందులోను ఓ స్త్రీ తనకు ఆజ్ఞలివ్వటం సహించలేక పోతున్నాడు.

"వాళ్ళు కాల్పులు మొదలుపెడితే దద్దమ్మల్లా కూర్చోమని నేననడంలేదు. కాని కాల్పులు ముందుగా మననుంచి మొదలవకూడదు. సివిల్ లిబర్టీస్‌ని గుర్తు పెట్టుకోండి. ఏమాత్రం పొరపాటు మనలో కనుపించినా ఏకిపారేస్తారు" పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ సంఘం గురించి పోలీసు ఆఫీసర్లుకూడా భయపడతారు. ఆ భయాన్ని వాళ్ళలో కలగచేయాలని ఆమె ఉద్దేశ్యం. ఆమెకు తెలుసు తను అతడికంటె పెద్ద ఉద్యోగి కాబట్టి తన మాటలు వింటున్నాడతడు.

"అలాగే మేడమ్. మీరు చెప్పినట్లే చేస్తాం" హామీ యిచ్చాడు కరమ్‌వీర్. ఆ రోజు దాదాపు ఇరవై అయిదుమైళ్ళు ప్రయాణం చేశారు వాళ్ళు. జీపులు, కార్లు ప్రయాణం చేయగలిగే మార్గం కాదది.

బందిపోట్ల ప్రయాణం రాత్రిళ్ళు సాగుతుంది. కాబట్టి పగలు ప్రయాణంచేసి రాత్రికి వాళ్ళు నదిని దాటి అవతలవైపుకి చేరుకోకుండా కాపలా కాయిస్తోందామె.



అలా మూడు రోజులు గడిచాయి. అటు యు.పి. బెటాలియన్‌కీ, తమకీ, దూరం యాభై మైళ్ళే ఉండిప్పుడు. అంటే మధ్యలో ఎక్కడో ఉన్నారు బందిపోట్లు. బహుశా తమ సంగతి ఈ పాటికి తెలిసిపోయి ఉంటుంది కాబట్టి ఆ రాత్రికే పారిపోయే ప్రయత్నం చేస్తారు.

ఆ ప్రాంతంలో నది పెద్ద మలుపు తిరిగింది. ఆ పక్కన కొద్ది పొలాలుతప్ప దాక్కోవడానికి సరైన ప్రదేశం లేదు. వాళ్ళు నదిని దాటలేకపోతే దీనికి సులభంగా చిక్కుతారు. అందుకే రాత్రి రెండు బ్యాచ్‌లుగా విడదీసి ఒక బ్యాచ్‌తో తను ప్రయాణం ముందుకు సాగించింది.

అక్కడే ఆమె పొరపాటు చేసింది. పోలీసు ఫోర్సుకంటే బందిపోట్లలో ప్రాణాలకు తెగించే ధైర్యం ఉంటుంది. ఆమె అనుభవానికింకా ఆ విషయం రాలేదు. ఆ సమయానికే పల్లెవాసుల వేషాల్లో పగలే నదిని దాటుకున్నారు వాళ్ళు. ఒక బ్యాచ్‌ని క్యాంపులో వదిలెయ్యడం ఆమె చేసిన మంచిపని. వాళ్ళు నదిని దాటేసారని తెలియగానే వెనక్కి తిరిగింది.

ఆ పక్కనే లోయలో ఒక పొలంలో ఉన్నారు భవీరాం బృందం. తన పటాలంతో వాళ్ళను ఎదిరించడం కానిపని. అందుకే ఆ రాత్రంతా ఆమె ఆ పొలం పక్కనే కాపలా కాసింది. తెల్లవారు జామున కరమ్‌వీర్ బృందం వచ్చి కలిసింది.

నాలుగు వందల మంది కానిస్టేబిల్స్ పొలాన్ని ఒక్క అడుగు వదల కుండా చుట్టు ముట్టారు. దాడి మొదలయింది.

ముందుగా లౌడ్‌స్పీకర్లలో వాళ్ళను లొంగిపొమ్మని హెచ్చరించింది. వైజయంతి భవీరామ్ నించి సమాధానం లేదు. అరగంట టైమిచ్చి స్మోక్ బాంబ్స్ ప్రయోగించారు. వాళ్ళు బయటకు రాలేదు.

పోలీసులు పొలంలోకి చొచ్చుకు పోవడం మొదలయింది అందరూ అప్రమత్తంగా కదులుతున్నారు. ఏ క్షణంలో నయినా బందిపోట్లు కాల్పులు జరపడం మొదలు

పెట్టవచ్చు.

అకస్మాత్తుగా పైకి లేస్తున్న ఓ తుపాకీ మీద బడ్డాయి వైజయంతి కళ్ళు. మరో చెయ్యి తెల్లజెండాతో పైకి వచ్చింది. సంతోషంతో ఆమె హృదయం నాట్యం చేసింది. కాని ఆ ఆనందం పటాపంచలు కావడానికి క్షణం పట్టలేదు.

ఉన్నట్టుండి ఒక పక్కనుంచి తుపాకీ ప్రేల్పుడు వినిపించసాగాయి, అంతే తుపాకి పైకెత్తిన చెయ్యి లోపలకు వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఎవరు ఎవరిమీద ఫైర్ చేస్తున్నారో తెలియని కన్‌ఫ్యూజన్.

దాదాపు రెండు గంటల సేపు సాగింది పోరాటం.

బాగా తెల్లవారి పోయింది.

వైజయంతి పొలం నుంచి బయటకు వచ్చింది. నలుగురు పోలీసుల కళేబరాలు బయటకు తీసుకొచ్చారు. గాయపడిన వాళ్ళను వెంటనే క్యాంప్‌కు పంపేశారు.

ఇరవై యిద్దరు దొంగలు బందీలయ్యారు. చనిపోయిన వాళ్ళు పన్నెండు మంది. అందులో తెల్లజెండా పట్టుకున్న వ్యక్తి చేతిలో జెండా అలాగే ఉంది. దాదాపు యాభై ఏళ్ళు వయసుంటుందతనికి పోలికలు సరిగ్గా సరిపోయాయి. అతడే భబీరాం.

కరమ్‌వీర్‌సింగ్ వచ్చి సెల్యూట్ చేశాడు. అతడి ముఖం సంతోషంతో వెలిగిపోతోంది.

"మేడమ్, భబీరాం శవం దొరికింది" అతడి సంతోషం దేనికో ఆమెకు బాగా తెలుసు. భబీరాంని ప్రాణాలతో గాని శవంగా గాని అప్పగించిన వాళ్ళకు లక్షరూపాయిలు బహుమతి ప్రకటించింది ప్రభుత్వం. శవం దొరికింది యు. పి.లో కాబట్టి ఆ ఘనత వాళ్ళకే దక్కుతుంది.


పేరు కోసం ఆమె ఎప్పుడూ ప్రాకులాడలేదు కాబట్టి ఆమెకు ఏ బాధా లేదు. బాధంతా ఒక్కటే అతడిని ప్రాణాలతో పట్టుకుంటే బావుండేదని. ఇంత కాలం న్యాయం వేరు చట్టం వేరు అనుకుంటూ వచ్చింది. ఇప్పుడు న్యాయం వేరు, ధర్మం వేరు అని అర్థమైంది. ఆటవిక న్యాయంలో ధర్మానికి అర్థం మారిపోతుంది.

"అతడు తెల్లజెండా చూపించాడుగా ఎందుకు ఫైరింగ్ మొదలు పెట్టారు?" అడిగింది కాస్త తీవ్రంగానే

"మీకు తెలియదు మేడమ్ అదంతా ప్లాను ఓ పక్క తుపాకి ఎత్తి లొంగి పోయినట్లు చూపిస్తూనే మరో పక్క కాల్పులు మొదలు పెట్టారు. మొదట ఫైర్ చేసింది వాళ్ళే మా కానిస్టేబుల్ అక్కడికక్కడే చచ్చిపోయాడు"

అతడు చెప్పేది నిజం కాదని ఆమెకు తెలుసు కాని రుజువు చేయలేని విషయం అతడి నవ్వులోనే ఆ విషయం తెలుస్తుంది.

ఆమె తన కోసం వేసిన టెంట్‌లో కూర్చుంది. పోలీసులు బందిపోట్ల దగ్గర దొరికిన ఆయుధాలను లోపల పెట్టారు. శవాలన్నింటిని వరుసగా పడుకోబెట్టారు. క్యాంప్‌కి ఆదేశాలెళ్ళాయి ట్రక్కులని దగ్గరగా తీసుకురమ్మని.



వైజయంతి అలసటగా కుర్చీలో వారగిలబడి కూర్చుంది. నాలుగు రోజుల్నుంచి సరియైన నిద్ర లేదు అలసట అయినా నిద్ర పట్టేలా లేదు. గుండెల్లో ఏదో ముల్లు గుచ్చుకుంటున్న బాధ.

బయట పెద్దగా గోల వినిపించడంతో బయటకు పరుగెత్తింది.

జనం.....గుంపులు గుంపులుగా వస్తున్నారు. నినాదాలు చేసుకుంటూ.

"కేప్టెన్ సాహెబ్ కి జై - పోలీసు జులుం నశించాలి"

అరగంటలో నేల ఈనినట్లు వచ్చేశారు చిన్నా, పెద్దా, స్త్రీలూ పురుషులూ, నడవలేని వాళ్ళు బళ్ళలో వస్తున్నారు కొంతమంది బాహాటంగానే ఏడుస్తున్నారు. కొందరు పోలీసుల మీద అరుస్తున్నారు.

వైజయంతి వాళ్ళను చూస్తూ నిలబడింది.

బండిదిగి వచ్చారు ఓ నూతన దంపతులు. కాళ్ళ పారాణి యింకా ఆరలేదా అమ్మాయిది.

కళ్ళనీళ్ళు కారుస్తూ వేడుకుంటున్నారు ఒక్కసారి భబీరాం కాళ్ళకు మొక్కనివ్వమని. పోలీసులు వాళ్ళను ముందుకు రానివ్వడం లేదు.

వైజయంతి ఆగలేక పోయింది. వాళ్ళను పిలిపించింది.

"అతడు మీకు బంధువా?" అడిగింది.

"అవును మేడం, ఆత్మబంధువు. మాకు చుట్టరికం లేదుగాని మాపాలిట దేవుడతడు. మీ పోలీసుల్లాగా స్త్రీలమీద అత్యాచారాలు చేయలేదెప్పుడూ. స్త్రీలను ఎంతో గౌరవిస్తాడు. ఈ రోజు అతడు చచ్చిపోవడానికి నేనే కారణం. నా పెళ్ళికోసమే ఈ ప్రాంతానికొచ్చాడు. అతడి కళ్ళలోనించి నీళ్ళు ధారగా కారుతున్నాయి."

"అతడెన్ని హత్యలు చేశాడో, ఎంతమందిని కిడ్నాప్ చేశాడో మీకు తెలుసా?"

"తెలుసు పోయినవారం నేను నడిపే బస్సునుంచే ఒకబ్బాయిని ఎత్తుకుపోయాడు. మీకు తెలుసా మేడం. ఆ అబ్బాయి తండ్రి వ్యాపారంలో లక్షలు గడించాడు. మేడలమీద మేడలు కట్టాడు. అదంతా బట్టల వ్యాపారంలో సంపాదించాడా? వడ్డీ వ్యాపారంచేసి. పేద ప్రజల రక్తాన్ని పిల్చి కట్టాడా మేడలు. అతడి దగ్గర

అరడజనుమంది రౌడీలున్నారు. వందరూపాయలకోసం సుధీరాంని నడిబజారులో ఎముకలు విరిగేలా తన్నారు. ఏ పోలీసయినా పట్టుకున్నాడా వాళ్ళని? ఎవ్వడైనా శిక్ష విధించాడా అలాంటి వాళ్ళకి? లేదు మేడమ్ ఏ చట్టానికి కళ్ళూలేవు చెవులూలేవు" ఆవేశంగా అన్నాడు హరీష్.

కరమ్‌వీర్ కోపంగా ముందుకు రాబోయి వైజయంతి చూపులకి ఆగిపోయాడు. హరీష్‌ని పంపేసింది.

కరమ్‌వీర్‌తో చెయ్యాల్సిన పనుల గురించి చర్చించి అప్పుడే వచ్చిన జీపులో కూర్చుని ఛింద్ బయలు దేరింది.

ఏదో చెయ్యాలని తపనతో బయల్దేరి ఏదో చేసి మరేదో చేసినట్లు గుండెల్లో బాధ.

ఈ విజయానికి ప్రభుత్వంనించి మెప్పు లభించవచ్చు, మెడల్సూ దొరకవచ్చు. అంతమంది తన బాధ్యతను సవ్యంగా నెరవేర్చిన తృప్తి కలగవచ్చు. కాని అంత వాళ్ళు వేసే ప్రశ్నలకు జవాబులిచ్చుకోవడం సాధ్యమా?

ట్రయినింగ్‌లో ఉన్నప్పుడు రిటైర్డ్ ఆర్మీ చీఫ్ జనరల్ మానిక్‌షా యిచ్చిన ఉపన్యాసం గుర్తొచ్చిందామెకు.

"పోలీసు అఫీసరు ఉద్యోగం కత్తిమీద సాములాంటిది. ఒక వ్యక్తిని హత్య చేస్తే పట్టరాని నేరం. కాని యుద్ధంలో ఎంతమందిని హత్య చేస్తే అంత ఘనత. దేశంలో యిప్పటి అరాచకత్వాన్ని బట్టి పోలీసులు యుద్ధం చేయక తప్పడంలేదు. కర్తవ్య నిర్వహణలో న్యాయాన్యాయాల విచక్షణ ఉండకూడదు. కాని మనలో అంతర్యుద్ధం మొదలవుతుంది. దాన్ని జయించడమే అసలైన విజయం. ఒక పోలీసాఫీసరుకు సదా గుర్తుంచుకోవలసిన విషయం కర్తవ్యం. న్యాయ పరిరక్షణ అనే ఈ బాధ్యతలో అన్యాయాన్ని అంతం చెయ్యటం ముఖ్యం. ఆ ప్రాసెస్‌లో అనుకోకుండా హత్యలూ చెయ్యవలసి వస్తుంది. ఒకవ్యక్తి మరణంతో వందమందికి మేలు జరుగుతుంది అనుకుంటే అనివార్య పరిస్థితుల్లో హత్య చేయడానికి వెనుకంజ వేయకూడదు. ఈ విషయంలో ముఖ్యంగా కావల్సింది ఆత్మస్థయిర్యం. దాన్నెప్పుడు కోల్పోకండి."

ఆ బ్యాచ్‌లో లేడీ ఆఫీసర్ తనొక్కతే. ఉపన్యాసం ముగించి ఆయన తనవైపు చూసి నవ్వారు. ఉపన్యాసం ముఖ్యంగా నీకోసమే సుమా అన్నట్లు.

ఆయన మాటలు నచ్చాయి ఆరోజు. అనుభవంలోకి వచ్చాయి ఈరోజు. కర్తవ్య నిర్వహణలో తను వెనుకంజ వేయలేదు. ఆ విషయంలో తృప్తిగానే వుంది కాని...ఏదో దిగులు.

ప్రాణం తీయడం తేలిక. ప్రాణం పోయడం సాధ్యంకాని విషయం. ఆలోచిస్తున్నకొద్దీ తలనెప్పి ఎక్కువవుతోంది.

ఆమె యిల్లు చేరేసరికి రాత్రి ఎనిమిదయింది. హాల్లోనే కూర్చున్నాడు శరత్.

—సశేషం

దివ్యస్మృతి



జ్యోతికి ఆప్తులూ, గ్రామాభిలాషి అయిన శ్రీ జూలూరి నాగరాజారావుగారు 13 మే, 1987 న దివంగతులయ్యారు.

శ్రీ నాగరాజారావు అనంతపురం జిల్లాలోని పెనుగొండ గ్రామంలో 1948 డిసెంబర్ 9 న జన్మించారు. బి.కాం పట్టభద్రులై హైదరాబాద్‌లోని ప్రముఖ వ్యాపార వర్గంలో ఒకరుగా పేరు పొందారు. వీరికి అనేక సాంస్కృతిక సంస్థలతో సన్నిహిత సంబంధాలున్నాయి.

జూలూరి వీరలింగం చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి అనేక గుప్త దానాలు చేసారు.

శ్రీ నాగరాజారావు దివ్యస్మృతికి జ్యోతి అంజలి ఘటిస్తుంది.

వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియ చేస్తున్నాం.

అపూర్వ బంధాలు

వసుంధర


మా శ్రీవారు పెద్ద ఆఫీసరు. అందుకేనేమో ఆయనకు నామీదకంటె ఆఫీసుమీదే ఆసక్తి. సెలవు రోజుల్లోకూడా ఆఫీసుకు వెడతారు. మామూలు రోజుల్లో ఆఫీసుకు గంట ముందు వెడతారు. ఎప్పుడో తప్ప ఆఫీసు వదలగానే యింటికిరారు. ఆఫీసులో ఆయనకు చాలా మంచి పేరుంది.

ఆఫీసులో అంతపని చేసినా శ్రీవారెప్పుడూ నామీద విసుక్కోరు. నా పనుల్లో సాయపడలేకపోతున్నారని విచారపడుతుంటారు కూడా.

"ఇంట్లో ఉండి నేనేం చేస్తానండీ; నాకీ పనులేం ఎక్కువ కాదు"-అనే దాన్ని మొదట్లో.

క్రమంగా శ్రీవారు అన్ని పనులకూ నామీద ఆధార పడిపోసాగారు.

ఉదయం లేవగానే బ్రష్షు, పేస్టూ దగ్గర్నుంచి, షేవింగ్ సెట్ తుడుచుకునే తువ్వాలు, కట్టుకునే బట్టలవరకూ అన్నీ నేనే అందివ్వాలి. నా పనులు నేను చేసుకుంటూ ఇవన్నీ చేయాలి.



శ్రీవారికి జీవితమంటే విరక్తిట. నేను బ్రష్షు అందించగానే ఆయనలో కొత్త ఉత్సాహం పుడుతుందిట. నేను షేవింగ్ సెట్ అందిస్తే తుప్పుపట్టిన బ్లేడు కూడా మల్లెపువ్వులా మారి ఆయన గెడ్డాన్ని తాకుతుందట. నేను తువ్వాలందిస్తే హంసతూలికా తల్పంపైన దొరుకున్నట్టుంటుందిట. తన బట్టలు నేనే అందిస్తే-నేను తన ఒడిలో ఉన్నట్లే అనిపిస్తుందిట.

"నీ సమక్షమే నా జీవితానికి ఉత్సాహం" అంటారాయన.



ఈ పొగడ్తలు నాకెంతో ఇష్టం.

వాటికోసం ఎన్ని పనులైనా చేస్తాను నేను.

అయితే వారికి లోకువైపోతానన్న భయంతో అప్పుడప్పుడు విసుక్కుంటాను అది నిజం విసుగుకాదు. నటన!

అన్నింటికీ వారు నామీద ఆధారపడితే అది నాకెంతో గర్వంగా ఉంటుంది. అయితే ఇన్ని కబుర్లూ చెప్పి-నా కోసం ఆఫీసు వదల్లేకపోవడం నా మనసు చివుక్కుమనేలా చేస్తూంటుంది.

"నేనాఫీసులో పనిచేసేది నీ కోసం కదోయ్" అంటారు వారు.

కానీ అందరిలా టంచనుగా ఆఫీసుకు





వెళ్ళి వచ్చేయొచ్చుగా.

దీనికీ వారు నన్ను మెచ్చుకునేవారు– "అందరికీ ఆఫీసులో పనిఉంటుంది. అందులోనూ పెద్ద జీతాలు తీసుకుంటున్నప్పుడు కొన్ని ప్రత్యేక బాధ్యతలుంటాయి. అవి సక్రమంగా నిర్వహించకపోవడం దేశద్రోహం. నువ్వు నన్నర్థం చేసుకుంటావని నాకు తెలుసు. అందుకే నా బాధ్యతను సక్రమంగా నిర్వహించగల్గుతున్నాను. అందరి భార్యలూ నీకులాంటి అవగాహన చూపించరు. అందుకే ఆఫీసులో వారికి చెడ్డపేరు. నా ఆఫీసులో నేను తెచ్చుకున్న మంచిపేరుకు పరోక్షంగా నువ్వే బాధ్యురాలివి"

ఈ మాట నాపై మంత్రంలా పని చేస్తుంది. అందుకే వారాఫీసులో పేరు తెచ్చుకునేందుకు మరింతగా సహకరిస్తుంటాను.

పెళ్ళయి ఈ విధంగా మాకు రెండేళ్లు గడిచాయి.

ఆదర్శ దంపతులమని పేరుపడ్డమేము మొదటిసారి గొడవపడ్డరోజు–మా మూడవ పెళ్ళిరోజు.

ఆ రోజాయన్నాఫీసుకు సెలవు పెట్టమని వారం రోజులముందే చెప్పాను.

ఆయన అంగీకరించారు.

ఆ రోజు పూర్తిగా మా కోసం....

నాకెంతో ఉత్సాహంగా ఉంది.

దగ్గరుంటే శ్రీవారు కబుర్లెంతో బాగా చెబుతారు. అవి వినడం నాకెంతో ఇష్టం.

ఉదయం ఇద్దరం తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు కట్టుకున్నాం. వారికిష్టమైన పులిహోర టిఫెనుగా చేశాను.

వంటలోకి దిగబోతుంటే– "అప్పుడే ప్రారంభించకు. కాసేపు కబుర్లు చెప్పుకుందాం" అన్నారువారు.

ఇద్దరం కలిసి పులిహోరతిన్నాం.

నన్ను పెళ్ళి చేసుకున్నాక వారి జీవితం ఏ విధంగా మారిపోయిందో వర్ణించి చెబుతున్నారు శ్రీవారు.

నాకు కాలం స్తంభించిపోయింది.

ఉన్నట్టుండి ఎవరో తలుపుతట్టారు.

వెళ్ళాను.

మావారి ఆఫీసు ప్యూను.

ఆఫీసులో ఏదో అర్జంటు పనుందట. వారు వెళ్ళడం తప్పనిసరి అట.

శ్రీవారు నాకు సారీ చెప్పి వెళ్ళిపోయారు.

నేను బాగా నిరుత్సాహపడ్డాను.

కాసేపటికి పక్కింటి వనజ మా యింటి కొచ్చి కూర్చుంది. నా నిరుత్సాహానికాశ్చర్యపడి కారణమడిగితే చెప్పాను

వనజ కిసుక్కున నవ్వి– "ఆఫీసు మానడం ఇష్టంలేని మగాళ్ళు సాధారణంగా చేసే ట్రిక్కేయిది–" అంది.

అంటే శ్రీవారు ముందుగా చెప్పి ప్యూన్‌ని ఇంటికి రప్పించుకున్నారని వనజ అభిప్రాయం.


ఆ ఆలోచనే నాకు కలగలేదు.

అప్పటికప్పుడు వనజకేదో చెప్పి పంపేశానుకాని ఈ అనుమానం నన్ను నన్ను పెనుభూతమై పీడిస్తోంది.

శ్రీవారిపై ఆఫీసరు ఫణిభూషణ్ మాకు దూరపు బంధువు. ఆయన అప్పుడప్పుడు మా యింటికి వస్తూ ఉంటారు. ఆయనకు యాభై ఏళ్ళుంటాయి. మితభాషి.

నేనెప్పుడూ ఆయనకు ఫోన్ చేయలేదు. ఆరోజు చేసి "అంకుల్! మా వారిని సెలవు కాన్సిల్ చేసుకుని రప్పి





నడం అన్యాయం కదూ! ఎప్పుడో కాని వారు సెలవు పెట్టరు" అన్నాను.

ఆయన వెంటనే "లేదమ్మా! అతడు సెలవే పెట్టలేదు. మామూలుగానే ఆఫీసుకు వచ్చాడు" అన్నాడు.

నేనిక అట్టే మాట్లాడలేదు. ఫోన్ పెట్టేశాను.

మనసు చెప్పింది. వారు నన్ను మోస గించారు.

ఆ సాయంత్రం వారు ప్రైముకే ఇంటికి వచ్చారు. మనిషి కాస్త భయం భయంగా ఉన్నారు. బహుశా ఫణిభూషణ్ నేను ఫోన్ చేసిన విషయం చెప్పి ఉంటాడు.

నేను నష్టం చేయకుండా గొడవ ప్రారంభించాను.

"ఈ రోజు మన పెళ్ళిరోజు. వృథా కానివ్వకు. ఇంకోరోజు దెబ్బలాడు కుందాం-" అన్నారు వారు తేలికగా.

నా మనసు తేలిక పడలేదు. గొడవ పెంచాను.

"నిజంగా ఆఫీసులో అర్జంటు పని ఉంది. సెలవుపెట్టే అవకాశంలేదు. అలా [illegible] నువ్వుపార్థం చేసుకుంటావని నీ మనసు నొప్పించకూడదనే ఉద్దేశ్యంతో ఫ్రెండింటికి రప్పించుకున్నాను. నీ మనసు బాధపడితే నేను భరించలేనని నీకు తెలియదూ?" అంటూ సంజాయిషీ ఇచ్చుకున్నారు వారు.

మామూలుగా అయితే మాటలకు లొంగి పోయేదాన్ని. ఆ రోజు నా కోపం అవధులు దాటింది.

కాసేపటికి ఒంటరిగానే పేచీ అందు కున్నా.

"నేను చేసిన తప్పల్లా నిష్కర్షగా నీ మాట కాదనలేకపోవడం. ఇకనించి అలాగే ఉంటాన్లే" అన్నారు వారు.

"మీరు చెప్పే కల్లబొల్లి కబుర్లన్నీ నిజమని నమ్మి మోసపోతున్నాను. ఇక మీదట మోసపోను. మీ అసలు రంగు తెలిసింపోరోజు-" అన్నాను

"అసలు కల్లబొల్లి కబుర్లు చెప్పాల్సిన అవసరం నాకేమిటి? ఇకమీదట ఇంట్లో ముక్తసరిగా ఉంటాను-" అన్నారు వారు.

నాకు చాలా కోపం వచ్చింది.

నేనంటే ఏమిటో తెలియకుండా ఉంది వారికి.

రెండ్రోజులక్రితం అక్కయ్య దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. తనకు నన్ను చూడాలనుందట.

అక్కకూ నాకూ ఆరేళ్ళ తేడా. మేమిద్దరం నా పెళ్ళయ్యాక మళ్ళీ కలుసు కోలేదు. నేనింటికెళ్ళినప్పుడక్కకు వీలుపడేదికాదు. అక్క వెళ్ళినప్పుడు నాకు వీలుపడేదికాదు.


"మీరాఫీసుకి వెళ్ళడానికి నేనో పెద్ద అడ్డంకి కదా! నేను కొన్నాళ్ళపాటు మా అక్కదగ్గరకు వెడతాను. నేను కావాలనిపించినప్పుడు ఉత్తరం రాయండి వస్తాను" అన్నాను వారితో.

వారభ్యంతరం చెప్పలేదు.

నా మనసు చివుక్కుమన్నప్పటికీ నేను లేకపోతే తప్పవారికి నా విలువ తెలియదని ఊరుకున్నాను.

మర్నాడు వారు నా ప్రయాణానికి చక్కటి ఏర్పాట్లు చేశారు.

• •



అక్క నన్నెంతో ఆదరంగా ఆహ్వానించింది.

ఇద్దరం చూడగానే ఒకరినొకరం కౌగలించేసుకున్నాం.

"మావారు చాలా మంచివారు. నిన్ను చూడాలనగానే పంపించేశారు"- అన్నాను అక్కతో. అది అబద్ధమే అయినా అందులో కొంత నిజమూ లేకపోలేదు.

అక్క నాకంటే ఆరేళ్ళ మాత్రమే పెద్దదైనా-తనెంతో ఆరిందాలాగా నేను చిన్నపిల్లనైనట్లూ ప్రవర్తించింది.

అందుకే అక్కంటే నాకు చాలా ఇష్టం. అక్కముందు నేనెప్పుడూ చిన్న పిల్లనైపోతాను. నేనేం చేసినా అక్క ముచ్చటపడుతుంది.

అయితే అక్కడున్న రెండ్రోజుల్లోనే అసంతృప్తి బయల్దేరింది. అందుక్కారణం బావ ప్రవర్తన!

బావ నాతో మర్యాదగానే ఉండే వాడు కానీ అక్కను పురుగుకన్న హీనంగా చూస్తున్నాడు. అదేమన్నా లెక్కచేయడు సరికదా హేళనగా తీసి పారేస్తాడు. సాటివారితో పోల్చి అక్కను చిన్నబుచ్చుతాడు. అయిన దానికీ, కాని దానికీ చిర్రుబుర్రులాడడమేకాక వెధవ, ముండ లాంటి పదజాలాన్ని వాడి సంస్కారహీనంగా ప్రవర్తిస్తాడు.

"ఇదేమిటక్కా బావలా మాట్లాడ తాడు!" అన్నాను నేను.

"నీకు కొత్తగా ఉండొచ్చు. నాకల వాటైపోయింది." అందక్క.

"ఎలాభరిస్తున్నావే బాబూ- ఈ తిట్లన్నీ!" అన్నాను.

"భరించక ఏం చేయను?"

"తిరగబడు...."

అక్క నవ్వి ఊరుకుంది.

"రేపు నీ పిల్లలు పెద్దవాళ్ళైతే వాళ్ళకూ ఇవే బుద్ధులొస్తాయి. వాళ్ళు కూడా నిన్నిలాగే తిడితే!" అన్నాను.

అక్కకిద్దరు మగపిల్లలు. పెద్దవాడికి నాలుగేళ్ళు రెండోవాడికి రెండేళ్ళు.

"నువ్వు చెప్పింది నిజమే రెండు నెల్లక్రితం పెద్దాడు నన్ను తిడితే విని బావవాడిని నాలుగుతన్ని-ఈ యింట్లో అమ్మను నేనుతప్ప ఇంకెవరూ తిట్ట కూడదు. తెలిసిందా అని హెచ్చరించారు". అంది అక్క.

'అందువల్ల ప్రయోజనముంటుందా?'

"ఏమో-ఆ తర్వాత బాబు నన్ను మళ్ళీ తిట్టలేదు"

"అక్కా ! నాకు బావ పద్ధతి నచ్చలేదు. నువ్వెలాగైనా బావను మార్చాలి. లేకుంటే అసహ్యంగాఉంటుంది" అన్నాను

"బావను మార్చడం నావల్లకాదు. ఆయన బయట ఆఫీసులోనూ అలాగే ఉంటారు" అంది అక్క.

"ఆఫీసులో అలా ఉంటే ఊరుకుంటున్నారా ?" అన్నాను.

"అవసరంలేనివాళ్ళు గొడవ చేస్తున్నారు. అవసరమున్న వాళ్ళూరుకుంటున్నారు. నోరు మంచిది కాదుకానీ బావది సలుగురికీ సాయపడేబుద్ధి ! అందుకే అంతా ఆయన్ని తిక్కమనిషి-అని సరిపెట్టుకుంటారు..." అందక్క.

"అంతా అలా సరిపెట్టుకున్నా సరే-కట్టుకున్నదానివి నువ్వెలా సరిపెట్టుకోగలవు ? ఒకసారి గట్టిగా తిరగబడితే సరి బుద్ధొస్తుంది, పెళ్ళాన్ని మనిషిలా చూడాలని తెలియని కుసంస్కారం చాలామంది మగాళ్ళకుంటుంది. కానీ నువ్వు చదువుకున్నదానివికదా - ఎదురు తిరగొద్దూ ?" అన్నాను.

అప్పుడు అక్క నవ్వి- "నిజం చెప్పనా ?" అంది.

"నిజమేమిటి ?" అన్నాను ఆశ్చర్యంగా

అక్క చెప్పింది.


బావదంతా పైకపోరు గాంభీర్యం. టింకే చిర్రుబుర్రులాడటమేగానీ మనసు మెత్త. అక్కలేకపోతే క్షణముండలేడు. అక్కనేదైనా అంటే భరించలేడు. నిజానికి అక్క అత్తగారు మంచిదికాదు. ఆవిడ బావదగ్గరే ఉండి కోడలి నారది పెట్టాలని చూసింది. బావ సాగనివ్వలేదు "నువ్వు తల్లివేకావచ్చు. కానీ నీ పద్ధతి మార్చుకోకపోతే నా దగ్గరుండొద్దు-" అని చెప్పి పంపించేశాడు బావ. అక్క అత్తగారిప్పుడు బావ తమ్ముడి దగ్గరుంటోంది. బావ తమ్ముడు మొహమాటస్థుడు. అతడి భార్య అత్తగారి చేతుల్లో అవస్థపడుతోంది.

ఇదంతా విని నేనాశ్చర్యపోయినా "అయితే మాత్రం బావ తిట్లనెలా సహిస్తావు ?" అన్నాను.

అక్క [illegible] "బావనాకు పరాయివాడు [illegible]కదా ! తాళికట్టిన భర్త. ఆయన తిడుతూంటే నాకవి తిట్లలా అనిపించవు. చెప్పాలంటే నాకు బావ తిడుతోన్నప్పుడు నవ్వొస్తుంది. ఎలాగో కష్టపడి దాచుకుంటాను" అంది.

"అలా తిడుతూంటే నవ్వెలాగొస్తుందె బాబా !" అన్నానాశ్చర్యంగా.

అక్క అప్పుడు నాతో నెమ్మదిగా ఇలా అంది "నల్లనివన్నీ నీళ్ళుకాదు. తెల్లనివన్నీ పాలుకావు. ఏ మనిషినైనా తెలుసుకునేందుకు సాహచర్యం అవసరం. భార్యాభర్తలను మించిన సహచరులెవరుంటారు ? నిజంచెబుతున్నాను. బావంటే నాకెంతో యిష్టం. ఆయన ప్రవర్తనపట్ల నాకు అసంతృప్తిలేదు. కొంతమారితే సంతోషిస్తానుగానీ మారకపోతే బాధపడను. ఆయన్ని నేనింతగా అభిమానిస్తున్నానంటే అందుకేదో కారణముండి ఉండాలిగదా ! ఆ కారణమేమిటంటే- సాహచర్యంలో నేనర్థం చేసుకున్న బావ మంచితనం, గొప్పతనం ! బావ పద్ధతి



చూసి ఇక్కడ నేనేదో కష్టపడిపోతున్నానని భ్రమపడకు. ఈ సృష్టిలో భార్యాభర్తలదొక అపూర్వబంధం. ఒకొక్కరి దాంపత్య జీవితమొకోవిధంగా ఉండవచ్చు. కానీ ప్రతి బంధమూ అపూర్వమైనదే !"

అక్క మాటలు నాకంతగా నచ్చలేదు.

మావారు నన్ను మాటిమాటికీ పొగుడుతారు. ఆ పొగడ్తలహాయిలో వారికోసం నేనెన్ని పనులైనా చేయగలను. కానీ పనులన్నీ చేయించుకుంటూ చీదరించుకునే బావని-అక్క ఎలా భరిస్తోందో నాకర్థం కావడంలేదు.

బహుశా మనసు సరిపెట్టుకుని ఉంటుంది, నా ముందు బయటపడడం ఇష్టంలేకపోయి ఉంటుంది.

అక్కడ అక్కమీద జాలిపడుతూనే మరో నాలుగు రోజులున్నాను. ఈలోగా శ్రీవారినుంచి ఉత్తరం వచ్చింది.

నేను లేకపోవడంవల్ల వారొక్కక్షణం కూడా గడపలేకపోతున్నారుట. ఇల్లంతా నరక ప్రాయంగా మారిందట. ఇకమీదట పూర్తిగా నా అడుగుజాడలలో నడుస్తారుట. నా కనుసన్నలలో మెలగుతారట. తన్ను క్షమించి వెంటనే రమ్మనమని వారి ఉత్తరం.

ఇలా ఉత్తరాలురాసే భర్తలరుదనుకుంటాను. వారాఉత్తరం వ్రాయకపోయినా నేను బావ కారణంగా అప్పటికే వారి గొప్పతనాన్ని గ్రహించాను

వెంటనే ప్రయాణమయ్యాను.


అక్క నాకు చీరపెట్టింది. అల్లరి వాళ్ళైన పిల్లలు నన్ను వదల్లేదు వీడ్కోలు చెప్పడానికి స్టేషనుకు వచ్చిన బావను చూస్తే కుసంస్కారి అనిపించలేదు.

నేను తిరిగిల్లు చేరగానే వారు నన్ను దగ్గరగా తీసుకుని "ఇంకెప్పుడూ నన్ను విడిచి వెళ్ళకు" అన్నారు. నేను వారి కౌగిలిలో కరిగిపోయాను.

వారు నాకోసం రెండురోజులు సెలవు పెట్టారు.

ఆ తర్వాత వనజ నన్ను పలకరించింది. శ్రీవారి గురించి వచ్చేయాల్సొచ్చిందని-మా అక్క నన్ను వదల్లేదనీ చెప్పాను. ఆయన ఉత్తరంలోని కొన్ని వాక్యాల నుదహరించాను కూడా !

వనజ ఆశ్చర్యపడి- "మీ వారికి



పొగడ్డం బాగా తెలిసి ఉండాలి. నువ్వు లేనందుకాయనింకే ఇబ్బంది పడ్డారో తెలియదుకానీ-నిక్షేపంలా తనకు తనే వంట చేసుకుని తిన్నారు. ఇల్లు నీటుగా సర్దుకునేవారు. మేమురోజూ మా యింట్లో భోంచేయమంటే ఒకపూట మాత్రం భోంచేసి-మర్నాడు మాకు చిన్నగిన్నెడు సాంబారిచ్చి-"నేను వంట చేసుకోగలనన డానికి సాక్ష్యమిది" అన్నారు. ఆ సాంబారెంత బాగుందనుకున్నావ్ ? అప్ప ట్నించీ మావారు నన్నొకటే సాధింపు- నీకు మగాళ్ళపాటి వంటకూడా రాదని." అంది.

తెల్లబోయాను. వారికి వంటొచ్చని నాకు తెలియదు.


వనజ అబద్ధం చెబుతోందా? చెబు తోందనుకుందామంటే ఆమెకా అవసర మేమిటి ?

ఒకటి మాత్రం నిజం. నేను తిరిగి వచ్చేసరికి-ఇల్లు ఆడవాళ్ళ మసలని ఇల్లులాలేదు.

చెప్పాలంటే నాకంఫేసేట్‌గా మెయిం టైన్ చేశారు వారు.

ఆ సాయంత్రం వారాఫీసు నుంచి రాగానే నిలదీశాను.

"చూడు వసూ! నీ వంటకలవాటు పడ్డాక నేనింక ఎవరివంటా తినలేను, హోటల్ కూడు నాకు పడదు. అందుకే ఏదో ఇంట్లో ఇంత ఉడకేసుకు తినేవాణ్ణి నిజంగానే నాకు అద్భుతంగా వంటొచ్చ నుకో.... అలాంటప్పుడు మాట్లాడకుండా నీ వంట తింటున్నానంటే - నీదింకా అద్భుతమైన వంటగదా ! వసూ ! నన్ను తప్పుగా అర్థం చేసుకోకు. ఇంట్లో నేను



పూర్తిగా నీమీద ఆధారపడి జీవిస్తాను. అందులో నేనా కానందం. నీవు లేకపోతే బ్రతకడం కోసం తిండి. నీవుంటే నీ కోసం బ్రతుకు, ఈ ఇంట్లోని ప్రతి అణువూ నీతోనే శోభిల్లుతుంది. నీవు లేక ఈ యిల్లు స్మశానమైపోతుంది. అందుకే అనుక్షణం నీకోసం తపించి పోయాను. ఆ తపనలోంచే నా ఉత్తరం పుట్టుకొ చ్చింది...."

శ్రీవారి మాటలు వినగానే నాకొక విషయం అర్థమైంది.

వారికి రాని విద్య లేదు. వారి ఓర్పుకు అంతంలేదు.

ఆఫీసులో ఓపిగ్గా పని చేస్తారు. ఇంట్లో నన్ను భరిస్తారు.

నా మనసు నొప్పించ కూడదన్నదే వారి అభిమతం.

నన్ను సంతోష పెట్టడానికె వారు నా మీద ఆధార పడుతున్నారు.

నాకుమాత్రం వారి సేవ మినహా వేరే పనేమున్నది ?

మాటలతో వారు నన్ను సంతోష పెడుతూంటే - సేవలతో నేను వారిని సంతోష పెడతాను.

ఇలాంటి భర్త స్త్రీకి అరుదైన వరం. ఆ వరాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి.

శ్రీవారంటే నాకు మరింత అభిమానం పొంగి పొరలింది.

* * *

నా స్నేహితురాలు శారద నన్ను చూడ్డానికి వచ్చి మా యింట్లో మూడు రోజులుంది.

భర్త క్యాంపుకు వెళ్ళాడు. ఈ లోగా శారదకీవూళ్ళో ఏదో పని పడింది. నన్ను చూడ్డమనే పని దానిని జత పర్చింది.

మేమిద్దరం కాలేజీలో క్లాసుమేట్స్. ఇద్దరం చనువుగా ఒసే అని పిల్చుకునే వాళ్ళం.

శారద తన అదృష్టం గురించి చెప్పింది.

తనకు పుస్తకాల పిచ్చి. ఎప్పుడూ ఏదో ఒకటి చదువుతూంటుంది.

ఇంటి పనులన్నీ భర్తే చేస్తాడుట. తనకెప్పుడైనా మూడ్ కుదిరితే చిన్నచిన్న సాయాలు చేస్తుందిట.

"చెప్పాలంటే వంట మర్చిపోయా ననుకో !" అంది శారద.

నేనాశ్చర్యపడి- "మరతడికి విసుగని



పించదూ ?" అన్నాను.

"చెప్పాలంటే నేనాయనదగ్గర చంటి పిల్లలా గారం చేస్తాను. పొద్దున్నే లేచి కాఫీ కలిపాకనే ఆయన నన్ను లేపుతారు. బ్రష్‌మీద పేస్ట్‌కూడా వేసిస్తారు. తను చద్దన్నం తిని నాకు వేడన్నం పెడతారు" చెప్పుకు పోతోంది శారద.

"అదృష్టవంతురాలివే..." అన్నాను నవ్వుతూ.

"అందుకే ఆయన్నెప్పుడూ క్యాంపులకు వెళ్ళనివ్వను, ఎప్పుడైనా తప్పనిసరై క్యాంపులకు వెడితే - భోజనం హోటల్లోనైనా చేస్తాను. ఇలా నీలాంటి వాళ్ళమీదనైనా వాలతాను -" అంది శారద.

"నీ పద్ధతి చాలా బాగుంది -" అన్నాను.

"కానీ నాకు నీ పద్ధతే నచ్చలేదు." అంది శారద.

"ఏమిటే నీకు నచ్చని నా పద్ధతి?" అన్నాను కుతూహలంగా.

"మీ వారిని మరీ సోమరిని చేసేస్తున్నావు. అన్ని పనులూ నువ్వే చేయాలనే అతడినెలా భరిస్తున్నావే బాబూ !" అంది శారద.

"అంటే ?"

అప్పుడు శారద నా పరిస్థితిని పూర్తిగా నామీద జాలిపడింది.

నేనప్పుడు మావారి గొప్పతనం గురించీ వారి పనులు చేయడంలో నేను పొందే ఆనందం గురించీ శారదకు చెప్ప సాగాను.

అలా చెబుతూండగా ఎందుకోనాకు చెబుతున్నది నేను కాక నా అక్క అని పించింది. వింటున్నది శారద కాక నేనే ననిపించింది.

సృష్టిలో స్త్రీ పురుషుల సంబంధం విచిత్రమైనది. వివాహ జీవితం వారిని బంధించినపుడు సాహచర్య ప్రభావంతో కాలానుగుణంగా - ఒకరినొకరు అనుగుణంగా మారిపోతారు. ఒకనాడు భిన్న ధృవాలనిపించినవారు కొంతకాలానికి ఒకరికోసం ఒకరు పుట్టారా అనిపించేటంతలా మారిపోతారు.

మనం ఎందరో దంపతులను చూస్తూ వీరు కలిసి ఎలా జీవిస్తున్నారా అని బాధ పడతాం. ఒకరి కారణంగా ఒకరికి సుఖం లేదేమోనని అనుమానిస్తాం. కానీ ప్రతి దంపతులదీ ఒక అపూర్వ బంధమన్న విషయం స్వానుభవంలోనే తెలుస్తుంది.

ఆలా చూస్తే ఈ ప్రపంచంనిండా ఎన్నో అపూర్వ బంధాలు. వాటిలో మాదీ ఒకటి.

అందువల్ల శారద మాటల ప్రభావం నాపైన లేదు. ***



కంప్యూటర్ టీజింగ్

బహుమతి పొందిన ప్రశ్న:-

కె. శివరామిరెడ్డి — నందివెలుగు

ప్ర. పెళ్ళిలో అల్లుడు కాళ్ళు మామ కడుగుతాడెందుకని ?

జ. *కూతురికి బురద అంటకుండా*

బహుమతి పొందిన ప్రశ్న:-

ఖాజాహుసేన్ — ఆదోని

ప్ర. మన దేశంలో పి.టి. ఉషా కంటే వేగంగా పరిగెత్తేది ఎవరు ?

జ. *తెలుగు టి.వి. ప్రేక్షకుడు*

బహుమతి పొందిన ప్రశ్న:-

యు.వి.పి.సి. రాజు — సునాబేడ

ప్ర. "చదరంగం" ఆట ఎవరు కని పెట్టారు? ఎప్పుడు మొట్ట మొదటి సారిగా ఎవరు ఆడారు విజయం ఎవరు సాధించారు ?

జ. *1 ఆడమ్ ఈవ్ లు*
2 ఆడమ్ ఆడాడు
3 పక్కింటి ఈవ్ సాధించింది

కె.యస్.మాచన్న — తాళ్ళపూడి

ప్ర. ప్రేమంటే ?

జ. *"కార్, కార్"*

ప్ర. మీ వారసుడు ఎవరు ?

జ. *ముందు వారసురాలు కోసం ఈ వెతుకులాట*

డి. ఆషా — నందివెలుగు

ప్ర. భర్త వెళ్ళేప్పుడు భార్య ఎదురొస్తుంది. ఎందుకు ?

జ. *ఇంకో కావిడెవరూ రాకుండా*

ప్ర. మల్లెపువ్వువంటిది మగువ జీవితం మరి మగవాడి జీవితం ...?

జ. *దాన్ని ధరించే నవరం జడలాటిది*

పి. జాచీరామం — విశాఖపట్నం

ప్ర. చిలకపలుకులికి నీ చేతులకి తేడా ఏంటో ?

జ. *తొమ్మిది నెలలు*

చుక్కల సుదర్శన్ — రామకృష్ణపూర్

ప్ర. ఈ ప్రపంచంలో శాంతి' ఎక్కడ ఉంది ?

మా ఆఫీసులోనే టైపిస్టు

కె. శివరామిరెడ్డి — నందివెలుగు

ప్ర. జ్ఞాపకార్థం అంటే ....?

జ. *అప్పుడప్పుడు కావాలనిపించేది*

ప్ర. అనాదిగా ప్రేమకు - పెద్దరికానికి నడుమ పచ్చగడ్డి వేసినా భగ్గుమంటుంది. ఎందుకు ?

జ. *గడ్డి మన సొంతం కాకపోవటం వల్ల*

ప్ర. యుగాంతానికైనా ఉత్తమ ప్రశ్నకు 'కంప్యూటర్' బహుమతిగావస్తుందా?

జ. *రాక్షసంగా ప్రయత్నిస్తే*

బొబ్బిలి శ్రీనివాసరావు — ద్రాక్షరామ

ప్ర. పెళ్ళివలన కలిగే ప్రయోజనం ఏమిటి ?

జ. *మీరు హాయిగా పాతకేస్ ని మర్చిపోవచ్చు*

కె. ప్రకాష్ — తాళ్ళపూడి

ప్ర. రెండు నాల్కల ధోరణి అంటే ?

జ. *ఒకేసారి ఇద్దర్ని ఒకరికి తెలియకుండా ఒకర్ని ముద్దు పెట్టుకోగల శక్తి*

బి. అప్పారావు — మాధాపూర్

ప్ర. దారిద్ర్యరేఖ దిగువనుండి పైకిలాగడమంటే ఏమిటి ?

జ. *పిల్లలు పుట్టకుండా చేయటం*

కొండిపర్తి — నింబోలిఅడ్డ

ప్ర. మొదటిసారి మాన భంగం మళ్ళీ మళ్ళీ జరిగితే ?

జ. *క్షణ భంగురం*

బి.వి. శ్రీనివాసరావు — నందివెలుగు

ప్ర. శీలం గొప్పదా - శిల గొప్పదా ?

జ. *శిలతో ఉన్న శీలం*

కె.వి.సాయిరామారెడ్డి — పిట్టలవేమవరం


ప్ర. "పొగత్రాగటం హానికరంలాగే" మంత్రుల వాగ్దానాలు విని మోసపోవద్దనే హెచ్చరికను చట్టబద్ధంచేస్తే ?

జ. *వాళ్ళ వాగుడు డిమాండ్ పెరుగుతుంది*

పోలసిరమేష్‌బాబు — మల్కాజ్‌గిరి

ప్ర. దినపత్రికల్లో మొదటి పేజీ రాజకీయాలకు కేటాయిస్తారెందుకు ?





• మర్డర్లు, ప్రమాదాలు, రేప్‌లకు మరో హెడింగ్ లేదుగనుక

కె.వి. లక్ష్మి — తాళ్ళపూడి

ప్ర. కేంద్రం మిధ్య ?

• అదిమిధ్య అయితే మనం ఎవరం? ఎక్కడ్నుంచి వచ్చాం ?

ప్ర. ఆడవాళ్ళు పేరంటం ఎందుకుచేస్తారు?

• మగాళ్ళ గురించి తెలుసుకో(వటానికి) కోసం

జి. హరా — ఖమ్మం

ప్ర. మనిషి కోతినుండి వచ్చాడు. మరి ఆకోతి దేనినుంచి వచ్చింది ?

• తల్లి కోతినుంచి

కృష్ణశ్రీ — తెనాలి

ప్ర. 'జ్యోతి' కి నిన్ను ఎడిటర్ని చేస్తే ?

• రోజుకో రచయిత్రిని తయారు చేస్తాను

పి. పార్వతి — విజయనగరం

ప్ర. స్త్రీ లేకపోతే ?

• సినిమా ఫీల్డ్ దివాలా తీస్తుంది

వి. కృష్ణమూర్తి — వరంగల్

ప్ర. ఆడది కాలు జారితే గర్భం! మరి కంప్యూటర్ జారితే ?

• దేశానికి ...

డి.యస్.కె. ప్రసాదరావు — అనకాపల్లి

ప్ర. అత్యాశలేని జీవిని ఎక్కడైనా చూశావా ?

• కాన్పుల విభాగం నర్స్

కె. ప్రకాష్ — తాళ్ళపూడి

ప్ర. మనం ఏ రంగంలో బాగా అభివృద్ధి సాధించాం ?

• అధిక దిగుబడిలో

కాకాశ్రీనివాసరావు — ద్రాక్షారామ

"ప్ర. స్టార్ హోటల్స్‌లో భోజనం 'డిమ్ లైట్ల' లోనే పెడతారెందువలన ?

• మీకెందుకు "కాకా" శ్రీ "నివాస" రావుగారూ

మురళి — ప్రత్తిపాడు

ప్ర. నీకు ప్రేమంటే ఏమిటో తెలుసా ? ఎప్పుడైనా ఎవర్నయినా ప్రేమించావా ? సిగ్గుపడకుతే అడ్రస్ చెప్తే నేను మిమ్మల్ని కలుపుతాగా !

సారీ బ్రదర్ నేను అడ్రస్ చెప్తే నువ్వు విడాకులు ఇవ్వావలసి వుంటోంది





ఓనర్

సూర్యదేవర
రామ్ మోహన్ రావు

చటుక్కున ఆ చెక్క పెట్టెను పైకి తీసి దాని చుట్టూ ఉన్న దుమ్మును త్వర త్వరగా దులిపేసి దాన్ని చొక్కా లోపల దాచుకొని, నలువేపులా ఓసారి చూసి సుడి

గాలిలా వ్యాన్ వైపు దూసుకు పోయాడు.

ఇది జరిగిన రెండు నిముషాలకు వ్యాన్ అరవై కిలో మీటర్ల వేగంతో ధరణి కోట రోడ్డుపై అమరావతి వేపుసాగి పోతోంది.

* * * *

మరో పది రోజులు త్రవ్వకాలు జరిగాక ఓ రోజు రాత్రి మేస్త్రి హఠాత్తుగా వచ్చాడు. బాగా తాగి ఉన్నాడు. తూలిపోతున్నాడు. కళ్ళు ఎర్రగా చింత నిప్పులా ఉన్నాయి.

"ఒరేయ్ బద్మాష్ నా కొడకల్లారా? ఈ రోజు రాత్రే మనం హైదరాబాద్ బయలు దేరుతున్నాం. అందరూ సామన్లు సర్దుకొని రడీగా ఉండండి" అంటూ వెళ్ళి ఆ వరండా మూలన ఢమీలుమని పడ్డాడు.

"బద్మాష్ నా కొడుకల్లారా అసంటే సిగ్గు లేకుండా ఊరుకున్నారా? వాణ్ని నాలుగు తన్నక." కనురెప్పపాటు కాలంలో రుద్రయ్య మేస్త్రిని చేరుకొని ఊపిరి పీల్చు కోపటం, కనురెప్ప వేయటం కూడా మర్చిపోయి దబదబ బాది ఓ మూలకు విసిరి పడేసాడు.

రుద్రయ్య ఆవేశానికి. ఆత్మాభిమానానికి నిశ్చేష్టులయ్యారు మిగతా కూలీలంతా. ఓ క్షణం భయంతో వణికి పోయారుకూడా - రేపిది మేస్త్రికి తెలిస్తే - తద్వారా ఖాన్‌కి తెలిస్తే ప్రాణాలతో ఉండనిస్తాడా ...?

గోవిందయ్య ప్రాణాలు రుద్రయ్య చర్యకు రెపరెపలాడాయి, బలమంతా ఓపిక తెచ్చుకొని వడివడిగా మనవడి దగ్గరకెళ్ళి పక్కకు లాగాడు. ఆవేశం కోపం కలిసిన మనవడి శ్వాస పగబట్టిన త్రాచుపాము బుసలా ఉంది.

గోవిందయ్య బాధ చూడలేక తలా ఒకరు అతనికి సాయంగా వచ్చి అనున యంగా రుద్రయ్యను పక్కకు లాగారు.

* * * *

హైదరాబాద్ ఓల్డ్ సిటి ...

చార్మినార్‌కి దక్షిణంగా ఉన్న సన్నని వీధి చివర ఓ పాత నవాబు ప్యాలస్ ముందు సందడి క్రమంగా పెరుగుతోంది. సాయం చీకట్లు ముసురుకుంటున్న వేళ అక్కడకి చేరుకుంటున్న ప్రతి ఒక్కరిలో తమ ఖాన్‌ని కల్సుకోవాలన్న ఆరాటం పెరుగుతోంది.

ది అన్ క్రౌన్డ్ కింగ్.... మకుటంలేని మహారాజు ... జంటనగరాల ఖాళీ స్థలాల కబ్జా కింగ్ ఖాన్... సొంత స్థలాలున్నా వాటికి పక్కా పట్టాలున్నా ఖాన్ పేరు వినితే చాలు గజ గజ వణికి పోతారు.

అతనో ఏరియాకి తన డాడ్జ్ వ్యాన్‌లో బయలుదేరాడంటే కనిపించని స్థలాలకు సయితం ఖాళీ పేర్లు వచ్చేస్తాయి. మరో వారానికి అది లిటిగేషన్ స్థలంగా మార్చ బడుతుంది. అడ్రస్ లేని వ్యక్తి దానికి ఓనర్ అవుతాడు పుట్టించిన కాగితాల ద్వారా.

జరిగినకథ:

రుద్రయ్య, గోవిందయ్యలు ఓ చోట భూమిని తవ్వే పని చేస్తుంటారు. అక్కడ ఏదో ధనరాసులున్నట్లు వాళ్ళ యజమాని ఇబ్రహీంఖాన్ నమ్మకం. ఆ రోజు రుద్రయ్య పనిచేస్తున్న ప్రాంతంలో ఏదో గట్టిగా తగలటంతో మళ్ళీ ఆరాత్రే వెళ్ళి ప్రయత్నిస్తాడు.

-ఇక చదవండి

ఎవడె వ్యాపారం చెసుకున్నా మానవ అవసరాలైన కూడు, గుడ్డ, కొంపల పైనే, పీటి మీదే లాభాలెక్కువని ఖాన్ నిశ్చితాభిప్రాయం.

పొట్టిగా ఐదడుగుల రెండంగుళాల ఎత్తులో, చిన్నవైన పిల్లి కళ్ళతో, సన్నగా సాధారణ దుస్తుల్లో కనిపించే ఖాన్ అంటే, అతనేమిటో, అతనేం చేస్తాడో టక్కున చెప్పేస్తారు ఎవరైనా,

అతనికి చీకటన్నా, నిశ్శబ్దం అన్నా చాలా ప్రేమ. చీకటి, నిశ్శబ్దపు తెర చాటున అతని కనురెప్పల కదిలికలు అతని అనుచరులకు ఎన్నో దారుణకృత్యాలకు సంజ్ఞలు అందిస్తాయి.

(ప్రపంచ వ్యాప్తంగా ఈమధ్య కాలంలోనే ఓ సరి కొత్తరంగం బ్రహ్మాండమైన వ్యాపారంగా గుర్తింపు కొచ్చింది. దీనికి పెట్టుబడి కేవలం తెలివితేటలు, ధైర్యం, కండబలం. ఈ వ్యాపారంలో రాత్రికి రాత్రి కోటీశ్వరులైన వాళ్ళు, పాపర్స్ అయిన వాళ్ళు ఈనాడు ఎంతో మంది. సగటు మానవుడి పిరికితనంతో, బలహీనతతో ఆశతో ఆడుకొనే ఈ అండర్ గ్రౌండ్ డాన్స్ గురించి ఇంతవరకు తెలుగులో నవల రాలేదు.

ఈ నవలలోని పాత్రలు కల్పితాలు కావు, ఎవరినో ఒకర్ని ప్రత్యేకంగా ఉద్దేశించి రాసిందో కాదో ముందు ముందు మీరే తెల్సుకోవటం మరింత ఉత్సాహాన్ని కల్గిస్తుంది. ఈ నవలలో రాయబోయే సంఘటనలు ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట జరిగినవే.

ఈ వ్యాపారంతో ప్రతి ఒక్క అధికారికి, మంత్రికీ, చివరకి ముఖ్యమంత్రికి కూడా అవసరం ఉంటుంది. చిన్న సంతకంతో కోట్లు ఆర్జించవచ్చు-నగరాలలో నడిబొడ్డులో సయితం తిష్ట వేయవచ్చు. ఏ ముఖ్యమంత్రయినా రాత్రికి రాత్రి చిన్న సంతకంతో కోట్లు ఆర్జించుకొనే ఆలోచన ఉంటే దీన్ని మించిన వ్యాపారం లేదు. లక్షలకు లక్షలు అవినీతికి పాలు బడ్డ అధికారులకు ఇదే ప్రథమ పెట్టుబడి రంగం. అనుమానం వస్తే సి.బి.ఐ, సి.ఐ.డి, ఇన్‌కమ్‌టాక్స్, యాంటీ కరప్షన్ శాఖలు ముందుగా దాడి చేసేది ఆయావ్యక్తులకు సంబంధం ఉండే అవకాశం ఉన్న ఈ వ్యాపారం పైనే.

దీనిలో ఉన్నన్ని డ్రామాలు మరి దేనిలోనూ ఉండవు. ఏ రంగంలోనైనా పుట్టించబడే పుకారులకు విలువ ఉన్నా లేకున్నా, ఈ రంగంలో పుట్టించే పుకారులకు విలువ లక్షల్లో ఉంటుంది.

బంజారాహిల్స్ నవాబు ప్యాలస్ స్థలంపై మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల సంతకం, సినీనటి మాధవి స్థలం కొనుగోలు, గడ్డి అన్నారం భూములు, జూబ్లీహిల్స్ సొసైటీల భాగోతం, బొంబాయి నారిమన్ పాయింట్‌లో అమితాబ్‌కి స్థలం, స్వామీజీల ఆశ్రమాలు, మాన్ హట్టన్ వ్యాపార హర్మ్యాలు, ట్రంప్‌టవర్స్, రాత్రికి రాత్రి అధికారాలను కోల్పోయి మాజీ దేశాధినేతలు కొనే ద్వీపాలు, అన్నీ ఈ వ్యాపారానికి సం



బంధించినవే.

ఈ భూగోళంపై మనిషి బతకటానికి తాపత్రయపడే కొన్ని గజాల స్థలంపై, చచ్చాక అవసరం అయ్యే ఆరడుగుల నేలపై వ్యామోహం, ఆశ, అవసరం ఉన్నంత కాలం ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతూనే ఉంటుంది. అందులో సాధారణ సగటు మానవుడి పరిమిత పొదుపులపై, అప్పులపై కబ్జాకింగ్‌ల కబంధ హస్తాల స్వైరవిహారం నిర్విఘ్నంగా సాగుతూనే ఉంటుంది.)

ఆ ప్యాలస్ ముందు గుమికూడిన వారిలో రుద్రయ్యకూడా ఉన్నాడు.

మేస్త్రీని తను కొట్టిన విషయం బయటకు రాకుండా తన తాత అభ్యర్థన కాపాడింది.

ఒకరి క్రింద తల వంచి పని చేయటం తన మనస్తత్వానికి విరుద్ధం. కొన్నాళ్ళు ఓపిక పట్టమంటాడు తాత. అలా అయితే తన తమ్ముడ్ని చెల్లెల్ని చదివించుకోగలడా ...? వాళ్ళని పైకి తీసుకు రాగలడా ...?

తాతను ప్రేమించగలడు - గౌరవించగలడే కాని తాత ఆలోచనతో తన ఆశల్ని ముడిపెట్టుకోలేడు, ఎప్పుడో ఒకప్పుడు ఈ కోటకు ఎదురు తిరగాలి. స్వయంగా తనే ఓ కోట నిర్మించుకోవాలి. హఠాత్తుగా కలకలం రేగటంతో ఉలిక్కి పడి ఆలోచనలనుంచి తేరుకున్నాడు రుద్రయ్య.

సరిగ్గా 7.20 కి వచ్చింది ఖాన్ కారు. కూలీలంతా భయంగా, వినయంగా పక్కకు తప్పు కొని దారిచ్చారు.

ఖాన్ కారులోంచి దిగి కూలీల వేపు కన్నెత్తైనా చూడకుండా వడివడిగా లోపలకు నడిచాడు. ఆ పొగరే రుద్రయ్యకు నచ్చింది.

ఆ ప్యాలస్‌లో ఓ భూగృహం ఉంది. అది అప్పట్లో నవాబు తన రహస్య రాజకీయ మంతనాల కోసం కట్టించు కొన్నట్టు చెప్పుకుంటుంటారు.

అయితే మరా నవాబు ప్యాలస్ ఖాన్‌కెలా సంక్రమించింది...? ఎవరికీ తెలియదు. అదే కదా ఖాన్ వ్యాపారమని ఎవరికి వారు సర్ది చెప్పుకొన్నారు.

సరిగ్గా 7.30కి దర్బార్ గంట మోగింది. అప్పటివరకు రణగొణ ధ్వనితో ప్రతి ధ్వనించిన ఆ ప్రాంతం గంట శబ్దంతో నిశ్శబ్దాన్ని ఆశ్రయించింది.

ఇప్పుడక్కడ సూది పడితే వినిపించేంత నిశ్శబ్దం ఏర్పడింది. కొంతమంది హడావుడిగా లోపలకెళ్ళారు. మిగిలిన వాళ్ళు లోపల నుంచి రాబోయే ఆజ్ఞకోసం ఎదురు చూస్తున్నారు అప్రమత్తంగా.

లోపలకు వెళ్ళిన కొద్ది మందితో రుద్రయ్యకూడా అనుమతి లేకుండానే వెళ్ళిపోయాడు.

రుద్రయ్య అదే తొలిసారి దర్బార్‌ని చూడటం. చూసీ చూడగానే విస్మయంతో ఓ క్షణం స్తంభించి పోయాడు. ముస్లిం సాంప్రదాయ పద్ధతుల్లో నిర్మితమైన అతి విలాసవంతమైన దర్బార్ హాలది.

హాలుమధ్య వేసిన పొడవాటి నగిషీ బల్లలకు అటూ, ఇటూ అందమైన చెక్క కుర్చీలు వేస్తున్నారు. వచ్చిన వాళ్ళు వెళ్ళి ఆ కుర్చీల్లో సర్దుకూర్చున్నారు. ఇప్పుడు మహారాజుల సింహాసనాన్ని పోలిఉన్న ఓ పెద్ద కుర్చీ ఒక్కటే ఖాళీగా ఉంది.

రుద్రయ్య గోడ వారగా ఉన్న స్తంభం పక్కన నక్కి నిలబడ్డాడు.

ఎవరూ ఏం మాట్లాడు కోవటంలేదు. భయంతో కూడిన నిశ్శబ్దం అక్కడ రాజ్యం చేస్తోంది.

ఆ నిశ్శబ్దంలో బరువైన బూట్ల పాదాల శబ్దం తగ్గు స్థాయిలో వినిపించి క్రమంగా పెద్దదయింది. ఆ దర్బార్ హాలుకి ఎదురుగా ఉన్న కర్టెన్ పక్కకు తొలిగింది. ఖాన్ బాడీ గార్డ్ - ఆరడుగుల ఎత్తులో మెలితిరిగిన నల్లటి కండలతో ప్రత్యక్షమయ్యాడు.

"సాబ్ వస్తున్నారు...." అన్నాడు పొడిగా.

అందరూ ఆటోమేటిగ్గా లేచినిలబడ్డారు.

కొద్ది క్షణాల్లో ఖాన్ వచ్చాడు.

రాగానే అందరి వేపు ఓ సారి తన దృష్టిని సారించి నింపాదిగా పెద్ద కుర్చీలో కూర్చుని సిగార్ తీసి నోట్లో ఉంచు కున్నాడు. పక్కనే ఉన్న వ్యక్తి చటుక్కున లైటర్ వెలిగించి ఖాన్‌కి అందుబాటులో ఉంచాడు.


ఖాన్ సిగార్ వెలిగించుకొని నోటినిండా పొగ పీల్చి తలపైకెత్తి ఆపొగను కొద్ది కొద్దిగా వదుల్తూ అన్నాడు.

"చెప్పు చంద్రయ్య...." అని.

ఒక వ్యక్తి లేచి నిలబడ్డాడు.

"మాఫ్‌కీజియే సాబ్...ఆ స్థలం ఆక్రమించు కోవటం కోసం ఒక మర్డర్ చేసి వాళ్ని భయపెట్టాలి. తమరి ఆజ్ఞ అయితే ఈ రాత్రికే ఆ స్థలం తాలూకు యజమానుల్లో ఒకరు మూసీనది మురికి కాలువలో తేల్తారు..."

"చంపితే పనయ్యేట్లయితే అలాగే కానివ్వు. మంచి బేరం కూడా చూడు.



నెక్స్ట్...?" అన్నాడు ఖాన్.

"సలామ్‌సాబ్. తమరు నన్ను క్షమించాలి. పంజాగుట్ట పదమూడో నంబర్ రోడ్డులోని ఆఖరి ఇంటి వాళ్ళు ఐదు లక్షలకు తక్కువ అయితే అమ్మరట సాబ్. నయానా భయానా బెదిరించి చూసాను సార్. ఆ ఇంట్లోని అందరూ భయపడి తక్కువకు, అమ్మటానికి సిద్ధపడ్డారు కాని -"

ఖాన్ కోపంగా చూసాడు ఆ వ్యక్తి వేపు. "ఈ ఖాన్‌కి కాని అనే మాట వినిపించకూడదు" ... కర్కశంగా అన్నాడు ఖాన్.

"అందుకే క్షమించాలిసాబ్. ఆ యింట్లోకి ఓ అమ్మాయి ఉందిసార్. చాలా డేరింగ్ పిల్లసార్, మాతో మా ఇంటిని బలవంతాన అమ్మించాలని కొంత మంది చూస్తున్నారు. వెంటనే చర్య తీసుకొమ్మని డి.సి.పి. సాబ్‌కి కంప్లైంట్ ఇచ్చింది. సార్..." అతను భయపడుతూ చెప్పాడు.

"ఆ డి.సి.పి కి సొంత ఇల్లు ఉందా...?" ఖాన్ ఏదో సాలోచనగా చూస్తూ అడిగాడు.

"ఉందిసాబ్"

"ఆయనకు అల్లుళ్ళు కొడుకు ఉన్నారా ?"

"ఒకళ్ళుడున్నాడు సార్...."

"అతనికి సొంత ఇల్లు ఉందా ?"

"లేదు సాబ్"

"అతనికి సొంత ఇంటి మీద ఆశపుట్టించు, అతన్ని ఎగదోసి మామ దగ్గరకు పంపించు, మామా అల్లుళ్ళ సమావేశం ముగిసాక జూబ్లీహిల్స్ పన్నెండవ రోడ్‌లోని 17వ ప్లాటు పట్టా కాగితాలు ఇలా ఇచ్చి, అలా ఆ కంప్లైంట్‌ని నీ చేతిలోకి తీసుకో, నెక్స్ట్"

రుద్రయ్య అదిరిపడ్డాడు ఖాన్ తెలివి తేటలకు.

"మీరు చెప్పినట్లుగానే ఆ ఇంట్లో దెయ్యం ఉందని పుకారు పుట్టించాను. ఇప్పుడా ఇల్లురేటు బాగా పడిపోయింది సార్. ఎవరూ కొనటానికి ముందుకు రావటం లేదు..."

"సెభాష్...త్వరలోనే దాన్ని అమ్మే ఏర్పాట్లు చేయ్...." అంటు ఖాన్

సడన్‌గా లేచాడు.

పోబోతూ ఓ క్షణం ఆగి

"ఆ అమ్మాయిని చిత్రహింసల పాలు చేసిన వారికి మంచి బహుమానం ఉంటుంది" అన్నాడు. ఎవ్వరూ ఒక్క క్షణం మాట్లాడలేదు, ఈ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న రుద్రయ్య చటుక్కున స్తంభం చాటు నుండి బయటకొచ్చాడు.

"నేనా పని చేస్తాన్ సాబ్" అన్నాడు అతివినయం, భయం నటిస్తూ.

ఖాన్ తల పక్కకి తిప్పి రుద్రయ్య వేపు చూసాడు,

రుద్రయ్య నిశ్చలంగా ఖాన్ వేపే చూసాడు. రుద్రయ్య కళ్ళలో కనిపించిన తెగువ, నిర్లక్ష్యం, అతని కండ బలం ఖాన్‌కి బాగా నచ్చాయి.

ఖాన్ పూర్తిగా రుద్రయ్య వేపు తిరిగి

"అయితే దర్బార్ లో చేరాలని ఉందా....?"

"అవును సాబ్" నిర్భయంగా అన్నాడు రుద్రయ్య-

"అయితే నీకో ఛాన్స్ ఇస్తాను. ఇప్పుడు నా దర్బార్ నిండా కండ బలం, గుండె బలం ఉన్నవాళ్ళే ఎక్కువ, నా కిప్పుడు బుద్ధి బలం ఉన్నవాడు కావాలి..."

"ఛాన్స్ఇవ్వండి రుజువు చేసుకుంటాను" రుద్రయ్య ధైర్యం, తెగువ చూస్తుంటే ఖాన్‌కి కోపం రావటం లేదు. ఆనందంగా ఉంది. తనకిప్పుడు ఒక చిచ్చర పిడుగు కావాలి. ఆ లక్షణాలు రుద్రయ్యలో కనిపించాయి ఖాన్‌కి.

"నీ తెలివి తేటలకో పరీక్ష - దర్బార్ లో ప్రవేశానికి అవకాశం ఇస్తున్నాను. పంజాగుట్ట పదమూడో రోడ్‌లోని ఆఖరి ఇంటిలో ఒక తెలివిగల పిల్లుంది. ఆపిల్లకి తెలివితేటలేకాదు ధైర్యం కూడా ఉంది. ఆమె ఒకగొప్ప ఆర్కిటెక్ట్. అసాధారణమైన తెలివి తేటలతోనే ఓడించాలని ఉంది నిజానికి ..."

"నిజమేసాబ్ ... ఒక ఆడపిల్లమిద దౌర్జన్యంతో గెలవటం కన్నా తెలివి తేటలతో గెలవటమే మగాడికి గొప్ప. ఆమె వివరాలందిస్తే ..."

"నాతోరా ...." అంటూ ఖాన్ లోపలకు నడిచాడు.

దర్బార్ లో ఉన్నవాళ్ళంతా నిశ్చేష్టులయి చూస్తుండగా రుద్రయ్య ధైర్యంగా ఖాన్‌ని అనుసరించాడు.

● ● ●

ఉదయం పదిగంటలకు షెల్టర్ కంపెనీ కారొచ్చి ఆ ఇంటి ముందాగింది,

అప్పటికే రడీగా ఉన్న తేజశ్వి చేతిలో ఫైల్‌తో హుందాగా వచ్చి కారులో కూర్చుంది.

అక్కడ షెల్టర్ ఇంటర్నేషనల్ కనస్ట్రక్షన్ కార్పొరేషన్ కంపెనీ ఛైర్‌మెన్ అమోలక్ సింగ్ అసహనంగా తన ఆఫీసు గదిలో పచార్లు చేస్తూ తేజశ్వి కోసం ఎదురు చూస్తున్నాడు.

సరీగ్గా ఇదే సమయంలో ఖాన్ తేజశ్వి గురించి, అమోలక్ సింగ్ గురించి వివరంగా చెబుతున్నాడు. (సశేషం)

ఇదీ మన వ్యవస్థ
ఇదే మన అవస్థ

— యామినీ సరస్వతి.

పిడుగులు పడినా చలించని గుండె నిబ్బరం కొందరిదైతే ఆకుపాటుకే అదిరిపడే సున్నిత స్వభావం కొందరిది. ఈ సున్నిత స్వభావాన్నే సందర్భాన్నిబట్టి దౌర్బల్యమని, పిరికితనమని, చాతకాని తనమని అన్నా తప్పులేదు.

స్వోత్కర్ష నాకెప్పుడూ అలవాటు లేదు. నిజంగా నిజం చెప్తున్నాకదా, నేను వట్టి పిరికివాణ్ణి, చాతకానివాణ్ణి, భయస్థుణ్ణి, అర్భకుణ్ణి, పుస్తకంలో పాము బొమ్మ కనిపిస్తే, అప్పటికప్పుడు కాళ్ళు మడిచి కుర్చీలో పెట్టుకునే హృదయ దౌర్బల్యం నాది. చిన్నప్పటినుంచి ఈ భయం, బెరుకు నన్ను వదల్లేదు. మళ్ళీ ఇందులోనూ ప్రకృతి నాకు అన్యాయం చేసింది. ఆప్తులు, మిత్రులు నన్ను 'మాస్లీ'గా వున్నానని పొగుడుతారుగాని, గిట్టనివాళ్ళు నేను విలన్‌లా కన్పిస్తానని అభివర్ణిస్తారు. కనిపించడమేగాదు, నేను నిజంగాకూడా విలన్నేనని నమ్మేవాళ్ళు వుంటే అది వేరే విషయం. లోకానికి ఇంత భీకరంగా కనిపించే నా ఆకారం లోపల ఒక పసితనపు బేలమనసే వుందని ఎవరికీ తెలియదు. నిజానికి చాలాసార్లు నేనుకూడా మరిచిపోతుంటాను. అయితే అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు నిజస్వభావం బైటపడి నన్ను అసహాయుణ్ణిగా నిలబెడుతూ ఉంటుంది.

ఈ బేలతనాన్ని పోగొట్టుకోవడానికి డిటెక్ట్ నవలలు చదివాను. దయ్యాలు, హత్యలు, థ్రిల్, హారర్ సినిమాలు చూశాను. లాభం లేకపోయింది. నేను నేనుగానే మిగిలాను.

నాలోని పసివాణ్ణి ఎవరూ గుర్తించరని అన్నానుకదూ, ఆ మాట పూర్తిగా రైటు కాదేమో; మా బాలగోపాలం నన్ను అంతో ఇంతో అర్థం చేసుకున్నాడనే చెప్పాలి.

ఇద్దరం ఒకే వూరివాళ్ళం. చాలా కాలంపాటు కలిసే చదువుకున్నాం. నేను బి.కాం. తర్వాత చిన్న ఉద్యోగం చూసుకుని సెటిలైపోయాను బాలగోపాలానికి చిన్నప్పటినుంచి నాటకాలపిచ్చి. ఆ పిచ్చి వాణ్ణి సులభంగా వదిలేసేదేమోగాని, వాడు మాత్రం ఆ పిచ్చిని వదల్లేదు. నటుడుగా పోటీని బట్టుకోలేననిపించాక, వాడు హఠాత్తుగా నాటక రచయిత్రైపోయాడు. నాటికలు, నాటకాలు శరవేగంతో రాసేసి ఆంధ్రదేశాన్ని ఒక ఊపు ఊపిపారేశాడు. ఆ తర్వాత కొన్నాళ్ళకి మద్రాసుకి మకాం మార్చేశాడు. గడసరితనం, పట్టుదల ఉన్న మనిషి సాధించలేనిదేమిటి? మద్రాసు చేరిన నాలుగైదేళ్ళకే మా బాలగోపాలం బిజీ రైటరైపోయాడు. సినిమాలకి వాడు రాసిన మాటలు వింటూ నేను కొన్ని సందర్భాల్లో పడి పడీ నవ్వాను. దుఃఖం ఆపుకోలేక ఏడ్చేశాను. వాడు 'మా బాలగోపాలం' అనుకోవడం చాలా గొప్పగా అనిపించిందప్పుడు.



ఆఫీసు పనిమీద మద్రాసు వెళ్ళాల్సి

చ్చింది. నాకు మద్రాసు కొత్త. లాడ్జి ఖర్చులు ఆఫీసే భరిస్తుందిగాని, ఏ లాడ్జిలో దిగాలో వెంటనే తోచి చావలేదు. వెళ్ళేలోగా ఎలాగూ బాలగోపాలాన్ని కలవాలనుకున్నానుగదా, ఆ పని ముందే చెయ్యొచ్చు, కనీసం ఫోన్‌లో అయినా అతణ్ణి సంప్రదించి, వాళ్ళింటికి దగ్గరగా దిగవచ్చుననుకున్నాను. ఫోన్ చేశానుగాని, బాలగోపాలం ఇంట్లో లేడన్నారు. నేనెవరూ, ఏమిటని ఆరా తీశారు. ఆ తర్వాత బాలగోపాలం ఫలానా లాడ్జిలో వున్నాడని ఆ లాడ్జి నంబరు చెప్పారు. ఆ లాడ్జికి ఫోన్ చేశాను. దొరికాడు బాలుడు. ఫోన్‌లో వాడిగొంతు వినగానే ప్రాణం లేచివచ్చినట్టయింది. ఎక్కణ్ణుంచి మాట్లాడుతున్నావన్నాడు. బస్‌స్టాండునుంచి అన్నాను. మంచి లాడ్జిని సూచిస్తే, వెళ్ళి దిగుతానన్నాను. ఏడిశావు. నేనున్నాననుకున్నావా? చచ్చాననుకున్నావా? అన్నాడు. ఉన్నావనే అన్నాను. అయితే తిన్నగా సూటుకేసుతోసహా ఇక్కడికి వచ్చెయ్యి. రూం నంబర్ ఫోర్నాట్టూ, అన్నాడు. నేనేదో చెప్పబోయేంతలో వాడవతల ఫోను పెట్టేశాడు.

ఆటోలో వెళ్ళి దిగాకగాని తోచలేదు నాకు, అది నక్షత్రాల హోటలని. ఒకటి రెండూ కాదు, ఐదు నక్షత్రాల హోటలది. ఇదివరకెప్పుడో ఒకసారి, ఏదో కంపెనీ ఇచ్చిన పార్టీకోసమని ఒక నక్షత్రాల హోటల్‌లో కాన్ఫరెన్స్ హాలులోకిమాత్రం వెళ్ళాను, లోపల గదులెలా ఉంటాయో తెలీదు నాకు. ఇంత విలాసవంతమైన హోటల్‌లో మావాడు బస చేస్తున్నాడంటే నాకెంత గర్వకారణం!

ఫోర్నాట్టూలోకి వెళ్ళేసరికి మావాడు నన్ను సాదరంగా ఆహ్వానించాడు. అప్పుడు వాడొక్కడే లేడు. పక్కన మరో వ్యక్తి వున్నాడు. వాడు పనిచేస్తున్న సినిమాకంపెనీ తాలూకు అసిస్టెంటుట. మా వాడు కథా మాటలూ రాయడంలో చేయితిరిగి పోయాడు. అందినంత మేరకు రెండుచేతులా సంపాయిస్తున్నాడు. మాటలు చెప్పడం, మాటలు రాయడం- ఇదేపని. మాటలతో వ్యాపారం చేయడంలో అంత మజా వుందని నాకు అంతవరకూ తెలియదు. తెలివుండాలేగాని, దేన్నయినా డబ్బుచేసుకోవచ్చు. మాటలంటేమాత్రం ఏం మాటలా! అంటాడు మావాడు.

అసిస్టెంటుని పంపేసి మావాడు ఆత్మీయపర్వంలోకి దిగాడు. నాకు అతిథి మర్యాదలు చేశాడు. మద్రాసులో ఎన్ని రోజులుంటే అన్నిరోజులూ, తనతో ఆ గదిలోనే వుండమన్నాడు. ఖర్చంతా ప్రొడ్యూసర్‌ది తనదేం పోదన్నాడు. మరి ప్రొడ్యూసరు మొహం మాడ్చుకుంటేనో? అన్నాను. మన మాటలూ మాడిపోతాయి గదా! అన్నాడు వాడు. తనకూ కంపెనీ లేకుండా బోరు కొడుతోందనీ, నేనుంటే హాయిగా వుంటుందనీ అన్నాడు. మరి నీ రాతపని ఎలాగ? అన్నాను. రాసినంతా రాస్తాను. లేకుంటే దార్లో కార్లో చెప్తాను, అసిస్టెంటు రాసుకుంటాడు. లేకుంటే సెట్లో అప్పటికప్పుడు చెప్తాను... అన్నాడు. వాడి ధీమాకి ఆశ్చర్యమనిపించింది. అలా వుండబట్టే నెగ్గుకొస్తున్నాడు. నాలాంటి వాడైతేనా, సరేసరి.

బాలగోపాలం నాతో కబుర్లు చెబుతూ



చిన్ననాటి సంగతులు నెమరేసుకుంటూ వుండగానే, ఎక్కణ్ణుంచో ఫోన్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడాక అతను రెండు నిమిషాల్లో రెడీ అయిపోయాడు. ప్రొడ్యూసర్ రెడ్డిగారినుంచి ఫోను ... అంటే సిల్వర్ జూబ్లీ పిక్చరేనన్నమాట. ఇటువంటి ఆఫర్ మళ్ళీ మళ్ళీ రాదు. ... అని అతుకులు పొతుకులుగా ఇంకా ఏవో అని, -నే వెళ్తున్నాగాని, నువ్వు హాయిగా రిలాక్స్ తీసుకో. ఏం కావాలన్నా తెప్పించుకో. దేనికీ నువ్వు డబ్బివ్వనవసరం లేదు. నీ యిష్టం వచ్చినప్పుడు రావచ్చు, పోవచ్చు నేను ఏ రాత్రికో వస్తాను. అందాకా బై అంటూ వెళ్ళిపోయాడు బాలుడు.

ఇంత యమబిజీ అయితే ఎలాగ? అయినా ఇదీ ఒక లైఫేననుకున్నాను.

సూటుకేసు విప్పి లుంగీ తీసి కట్టుకుని, మావాడు చెప్పినట్టు హాయిగా రిలాక్సయిపోయాను.

ఎంతసేపు నిద్రపోయానోగాని, ఫోన్ మోతకి మెలకువొచ్చింది. మా బాలుడే! సినిమా కంపెనీనుంచే ఫోన్ చేశాడు. నన్ను కాస్త పరామర్శ చేశాడు. నా ప్రోగ్రాం ఏమిటని అడిగాడు. ఆఫీసు పనిమీద నేను సిటీలో కొందరు మనుషుల్ని కలుసుకో వలసింది - మర్నాడు. అంత వరకు ఫ్రీయే. అమాటే చెప్పాను. సాయంత్రం ఏదైనా మంచి ఇంగ్లీషు సినిమాకి వెళ్దామా? అని నేనే ప్రపోజ్ చేశాను. సెకండ్‌షోకైతే వీలవుతుందన్నాడు మావాడు. అంతవరకు నువ్వు రూంలోనే పడి వుంటావా యేం? అన్నాడు. ఖాళీ దొరికితే చాలు వీధులంట రికామీగా తిరగడం నాకు అలవాటని మావాడికి బాగా తెలుసు. సాయంత్రమౌతోందిగా, అలా బైటికి వెళ్ళి కాస్త గాలి పీల్చుకొస్తాను, అన్నాను. ఎనిమిదీ ఎనిమిదిన్నరకల్లాలాడ్జికి వచ్చేస్తానని వాడు ఫోన్ పెట్టేశాడు.

నేనో పావుగంటలో తయారయి, కాఫీ తెప్పించుకుని తాగి, రూం తాళం కౌంటర్లో ఇచ్చి బైటపడ్డాను.

కాలు సాగినంతమేరా నడిచి నడిచి, ఎక్కడో పార్లర్‌లో సమోసాలు, ఐస్‌క్రీం ఆరగించి, మరికాస్త దూరం నడిచి వెళ్ళాను. అది మౌంట్ రోడ్డని తెలిసింది. విండోషాపింగ్ చేసుకుంటే మరో అరగంట గడిచేసరికి అలసటనిపించింది. మళ్ళీ హోటల్ దాకా నడిచే

ఓపిక లేక ఆటో ఎక్కేశాను.

రూంలోకెళ్ళి బెడ్‌మీద వాలి కాసేపు రెస్టు తీసుకున్నాను. మరునాటిరోజు నేను కలుసుకోవాల్సిన మనుషులు. సూట్‌కేసులో ఫైల్‌లో ఉండిపోయాయి. ఒకసారి ఆ అడ్రస్‌లు చూసి, వాటిగురించి మావాణ్ణి వాకబు చేయడం మంచిదికదా? అనుకున్నాను.

సూట్‌కేసు తీసి మంచంమీద పడేసి తెరిచి చూశాను. అదిరి పడ్డాను. కళ్ళు తిరిగాయి.

సూట్‌కేసునిండా నోట్లు, వందనోట్లు. నోట్లకట్టలు సూట్‌కేసునిండా నోట్లే. ఎన్ని ఎంత? ఎంతైతేనేం...

గుండె ఆగి, కొట్టుకుంటోంది.

సూట్‌కేసులోకి ఈనోట్లెలావచ్చాయి, నా సూట్‌కేసదే.... అనుకుంటూ సూట్‌కేసుని ఆత్రుతగా చూసేసరికి అది నా సూట్‌కేసుకాదు. నా సూట్‌కేసలానే ఇదీ వి.పి.ఐ. దే ఒకేరంగు, కేసైజు, అయితే ఇది నాదికాదు, ఈ సూట్‌కేసు గదిలోకెలా వచ్చింది, అనుకుంటూనె తలలో మెరుపు మెరిసింది. గదంతా ఒక్కసారి కలయ చూసే సరికి ... అది నాగదికాదు, అదీ- మావాడి గదికాదు, మూలన స్టాండ్ మీద చీరలు ఉన్నాయి. ఆ ప్రక్కన కోటు కూడా తగిలించి ఉంది. గుడ్‌గాడ్.

కరెన్సీ నోట్లున్న సూట్‌కేసు మా గదిలోకి రాలేదు.

కరెన్సీనోట్లున్న సూట్‌కేసున్న గదిలోకి నేనే వచ్చాను - ఇదెలా జరిగింది?

మావాడి రూం నెంబర్ 402,

ఈ రూంలో ఫోన్‌మీదే ఉంది రూం నెంబర్ - 420. కౌంటర్లో నేను పొరపాటున ఫోర్‌ట్వెంటీ అని చెప్పానా? నేను ఫోర్‌నాట్టూ అన్నాగానీ కౌంటర్‌లో మనిషే పొరపాటున ఫోర్‌ట్వెంటీ తాళం ఇచ్చాడా?

కౌంటర్‌లో మనిషి ఇటువంటి విషయాల్లో పొరబడే అవకాశం తక్కువ. నేను వస్తున్నప్పుడు కౌంటర్ దగ్గర జనం కూడా ఆట్టే లేరు, నేను 420 అనే చెప్పి ఉంటాను, నేనడిగిన తాళమే అతనిచ్చి ఉంటాడు -

వెంటనే వెళ్ళి తాళం రిటర్న్ చేసేయ్యాలనుకున్నాను. ఇది మామూలుగది కూడా కాదు. సూట్‌కేసు నిండా డబ్బున్న గది, ఎన్ని లక్షలో గాని ....

ఆ సూట్‌కేసుని మళ్ళీ షెల్ఫ్‌లో సర్దేయ్యాలి. పొరబాటున అయినా ఈ గదిలోకి మరెవరో వచ్చినట్లు ఏమాత్రం అనుమానం రాకూడదు. అటువంటి అనుమానం వస్తే, నేను పట్టుబడాల్సి వస్తుంది. కాని, ఆసూట్‌కేసుని మళ్ళీ తాకాలన్నా, దడుపు పుట్టుకొచ్చింది. అయితే దాన్ని అలాగే వదిలి వెళ్ళడం ఎలా?

గది మధ్యలో ఇది మాటలా నిలబడ్డాను. ఒళ్ళంతా చెమటలు పోశాయి. నేను జీవితంలో ఎన్నడూగాని కళ్ళజూడలేనంతటి డబ్బు, అందుబాటులో ఉంది. ఆ సూట్‌కేసు పట్టుకుని నేను తిన్నగా హోటల్‌నుంచి నడిచి వెళ్ళిపోవచ్చు. ఆ తర్వాత ఏమౌతుందోగాని...ఈ డబ్బుతో పెద్ద వ్యాపారం పెట్టుకుని దర్జాగా బ్రతకవచ్చు.

దొంగిలించేమాట దేవుడెరుగు, సూట్‌కేసును సర్దేసి రూమునుంచి బయటపడితే



చాలు... గదిలో నేనుండగా ఎవరైనా వస్తే...

చప్పున సూట్‌కేసుని అందుకుని షెల్ఫ్‌లో సర్దబోయాను. అంతలో తలుపు చప్పుడైంది. కీ హోల్ తాళంచెవి కదిలింది. సూట్‌లో ఉన్న ఒక వ్యక్తి గుమ్మంలో నిలబడ్డాడు. నన్ను చూసి మొదట నిర్ఘాంత పోయాడు. ఆ వెంటనే "థీఫ్" అని కేకేశాడు. కేక వేసిన వెంటనే అవతలికెళ్ళిపోయి తలుపు దఢాల్న మూసేశాడు. కీహోల్‌లో తాళం తిరిగింది. నేను ట్రాప్ అయిపోయాను. వరండాలో అడుగుల చప్పుడు, కేకలు, ఎవరో ఫోన్‌లో మాట్లాడుతున్నశబ్దం ...

గది మధ్యలో కుప్పకూలిపోయాను. ఎంత టైము గడిచిందో తెలియదు. మళ్ళీ తలుపు తెరుచుకుంది. ముందుగా ఉన్నాడు పోలీసు ఇన్‌స్పెక్టర్. ఆయన చేతిలో రివాల్వర్. ఆ వెనుకే సూట్ మనిషి, హోటల్ మేనేజర్...

నేను పోలీసుల మధ్య ఉండగానే, సూట్‌మనిషి సూట్‌కేసు తెరిచి డబ్బు లెక్క చూసుకున్నాడు. అంతవరకు నేను ధీమాగానే ఉన్నానుగాని, లక్షరూపాయలు తగ్గినయి, అన్నాడు సూటువాడు. నా గుండె గుభేల్‌మంది.

లేదు. నేను డబ్బు తియ్యలేదు, కావలిస్తే తనిఖీ చేసుకోండి అని అరిచాను. వాళ్ళు నా జేబులలో వెతికారు. ఫోర్నాట్టూలోకూడా వెతికారు. ఏమీ దొరకలేదు. అయినా వాళ్ళ అనుమానం వదల్లేదు.

ఫోర్‌ట్వంటీలోకి నేను ఇదివరకే ఒకసారి వచ్చి ఉండవచ్చునన్నారు. అప్పుడు కొంత డబ్బుని మాత్రం చోరీచేసి సిటీలో మరెక్కడైనా దాచి ఉండవచ్చునన్నారు. సిటీలో మరెక్కడైనా నేనుదాచడమేమిటి? నాకెవరు తెలుసు? అని అరిచి మొత్తుకున్నా నా గోల ఎవరూ వినిపించుకోలేదు.

ఆ రాత్రి పోలీస్ స్టేషన్‌లో గడపవలసి వచ్చింది.

జీవితంలో తొలిసారిగా పోలీసు లాకప్‌లో ఆ నరకం వర్ణనాతీతం.

తెల్లవారుఝామున వచ్చాడు బాలగోపాలం. బెయిల్‌కోసం ప్రయత్నించాడుగాని, ఇవ్వనన్నారు.

—నువ్వు ఆ సరికే డబ్బుతీసి ఎక్కడైనా దాచావంటే నేను నమ్మలేననుకో. అయినా ఈజీగా బిగ్‌మనీ సంపాయించవచ్చనే ఆలోచన ఎలా వచ్చిందిరా నీకు అన్నాడు మా బాలుడు.

ప్రపంచం తల్లక్రిందులైంది. ఎవరికి చెప్పుకోవాలిక ?

నాలుగు రోజులు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాను. ఆకగా పోలీసులు మా వూరెళ్ళారు. ఇల్లు సోదా చేశారు. ఆఫీసుకి వెళ్ళారు. దర్యాప్తు చేశారు. మావిడా పిల్లలూ గోడు గోడు మన్నారు. మద్రాసులో నాకు తెలిసిన వాళ్ళెవరైనా ఉన్నారా? అని ఆరాలు తీశారు. నేను డబ్బు దాచే అవకాశాలున్నాయా! అని పోలీసులు తర్జన భర్జనలు పడ్డారు.

కేసు విచారణకి వచ్చింది. మాలాయరు దాక చక్యమంతా ఉపయోగించాడుగాని అతనేం దేవుడు కాదుగదా? చోరీసొమ్ము పట్టుబడలేదుగాని, నేను వేరేవాళ్ళ గదిలోకి ప్రవేశించాను. డబ్బుతో ఉన్న సూట్‌కేస్ని తెరిచాను. చోరీచేసే వుద్దేశ్యం నాకు ఉన్నట్టు ప్రాసిక్యూషన్ బల్లగుద్ది అదరగొట్టి వాదించాడు. అక్రమ ప్రవేశం, చోరీ యత్నం ఆరోపణలమీద ఆరునెలల శిక్ష పడింది.

మావిడా పిల్లలూ హృదయ విదారకంగా విలపిస్తూ ఉండగా, వ్యాన్ ఎక్కి వెళ్ళాను. జైలుకి.

మళ్ళీ తలుపు చప్పుడు, తలుపు మూసిన శబ్దం.

ఈ రూం కాదు. ప్రక్కరూం, అయితే అంతకుముందు నేను విన్నదికూడా పక్కగది తలుపు చప్పుడేనన్నమాట.

ఫాంటసీ కరిగిపోయింది.

సముద్రకెరటంలా నా భయంకరమైన ఊహ వెనక్కి వెళ్ళిపోయింది.

సూట్‌కేసుని షెల్ఫ్‌లో సర్దేశాను. నా సతమాయించుకున్నాను.

గదిమధ్య ఒంటరిగా నిలబడ్డానుగాని, నాలోని ఇడియట్‌ని బలవంతంగా మూలకి నెట్టి, ఆలోచనలని కేంద్రీకరించి పరిగెత్తించాను.

షెర్లక్‌హోమ్స్, అగాథాక్రిస్టీ, హాడ్లీ ఛేజ్, పెర్రీమాసన్, వాదేహౌస్, కొమ్మూరి సాంబశివరావు... నేను చదివిన డిటెక్టివ్ నవలల పరిజ్ఞానాన్ని ఒక్కసారి ఆవాహన చేశాను. కూల్...కూల్...కూల్ కూల్‌డౌన్.

తలుపు తెరిస్తే కనపడేది పడినా, కొంపకూలినా, కొండకూలినా, సహజంగా, అతిసహజంగా ప్రవర్తించాలి. అంతే. సహజంగా చూసుకుంటూ ఎలా బైటపడాలి ?

తలుపు తీయడమే. తీశాను. వరండాలో ఎవరూ లేరు. ఉన్నా, నేను పట్టించుకోకూడదు. తాళం వేశాను. కీరింగ్‌కి వ్రేలాడుతున్న ప్లేటుమీద 420 అంకె వెక్కిరిస్తోంది. తాళంచెవి అలాగే జేబులో వేసుకున్నాను. మళ్ళీ అప్పుడే 402 దాకా వెళ్ళవసరం లేదు.

కౌంటర్ దగ్గరికొచ్చాను. అక్కడ ముగ్గురైదుగురు కస్టమర్లున్నారు.

మరో చేయిలోంచి పర్సు తీశాను. అందులోంచి ఏదో కాయితం తీసి, దాన్ని చూసుకుంటూ కౌంటర్ దగ్గరికి వచ్చి చాలా యథాలాపంగా తాళం తీసి కౌంటర్‌మీద పెట్టాను. కౌంటర్‌లో మనిషి నన్ను చూశాడా? గమనించాడా? చూశాడా? నాకు అనుమానం. కాయితాన్ని మడత పెడుతూ కాయితం మడతని పర్సులో పెట్టేస్తూ నవ్వుతూ సోఫాలదాటి నడుస్తూ గుమ్మందాటి గుమ్మంవైపు చూడకుండా దూరానికి చూపుసారిస్తూ నడిచి హోటల్‌నుంచి వచ్చేశాను.

ప్రాణవాయువు అంటే ఏమిటో తొలిసారిగా తెలిసినట్లయింది. మళ్ళీ వెళ్ళి 402 తాళం అడిగితేమాత్రం ఫాంటసీ కాస్తా నిజమయ్యే ప్రమాదం ఉంది. ఎనిమిదిన్నర దాకా రోడ్లు తిరుగుతూ ఉండి మళ్ళీ హోటల్‌కి వచ్చాను. సహజంగా వుండాలికాబట్టి తిన్నగా కౌంటర్ దగ్గరికెళ్ళి, 402లో మావాడున్నాడా ? అని అడిగాను. ఇంకా రాలేదు. మీరు రూంలోకి వెళ్ళొచ్చుగా అన్నాడు కౌంటర్ మనిషి. థేంగాడ్ ఇందాకా 420 తాళం నేను తీసుకుని వాపసిచ్చినట్టు అతను గుర్తించలేదన్నమాటే! లేక, నేను ఇందాకా 402 తాళం తీసుకుని మళ్ళీ తిరిగి ఇచ్చేశాననుకుంటున్నాడా ? నాకు అనవసరం.

మా బాలుడు వచ్చేంతర్వాత అతన్తోబాటు నిస్సంకోచంగా 402కి వెళ్ళాను. రూం గుమ్మంపైన నంబర్నూ, తాళంచెవి నంబరూ మార్చిమార్చి చూస్తుంటే ఏమరీ అంత జాగ్రత్త దేనికి? అన్నాడు బాలుడు.

సినిమాకెళ్తూ దారంట, జరిగిందంతా చెప్పేసరికి పకపకా నవ్వాడు. నువ్వో ఇంటర్నేషనల్ స్మగ్లింగ్ ముఠా పెడితే బాగుంటుందిరా, అని వ్యాఖ్యానించాడు.

స్మగ్లింగ్ మాట దేవుడెరుగు, నేనిప్పటికీ బస్సెక్కినా, రైలెక్కినా ప్రయాణం ముగిసే వరకు సీటు నంబర్ చూసుకుంటూనే ఉంటాను. ప్రపంచంలో ఎప్పటికైనా ఈ నంబర్ల పద్ధతి పోవాలని నేనో సిద్ధాంతం రూపొందించాను. సరే, దాన్నెవరు పట్టించుకుంటారు ?





చిచ్చర పిడుగు



'స్పెల్లింగ్' పోటీలో పెద్దలనే సవాలు చేస్తున్న బాలమేధావి

హూస్టన్: రోహన్ వరవడేకర్ అనే ఒక 'ప్రి కిండర్ గార్టెన్' విద్యార్థి అకస్మాత్తుగా వార్తలలోకి వచ్చాడు. ఈ హ్యూస్టన్ (టెక్సాస్) బాలుడిని పెక్కు దినపత్రికలు ఇంటర్వ్యూ చేశాయి, స్థానిక, జాతీయ కార్యక్రమాలలో పాల్గొన వలసిందిగా టెలివిజన్ కేంద్రాలు అతడిని ఆహ్వానించాయి.

అసలు ఇదంతా ఎలా జరిగింది? అతడిలో వున్న ప్రత్యేకత ఏమిటి?

రోహన్ వయసు కేవలం నాలుగేళ్లే అయినప్పటికీ చిచ్చర పిడుగులాంటి ఈ చిన్నారి బాలుడు తన వయసుకు రెండింతలు పెద్ద వయసుగల పిల్లల కంటే, ఇంకా మాట్లాడితే పలువురు పెద్దలకంటే కూడా బాగా 'స్పెల్లింగులు' చెప్పగలుగుతున్నాడు.

తన పాఠశాలలో ఏర్పాటైన 'స్పెల్లింగుల' పోటీలో ఇటీవల రోహన్ పాల్గొన్నాడు. ఈ పసివాడు ఒకటి, రెండు రౌండ్లకు మించి ఈపోటీలో నిలబడతాడని ఎవరూ ఊహించలేదు. అయితే అందరి అంచనాలను తల్లక్రిందులు చేస్తూ ఈచిచ్చర పిడుగు ఆరవ రౌండును కూడా దాటిపోయాడు. మొత్తం 200 మంది ఈ పోటీలో పాల్గొంటే, ఆరవ రౌండు ముగిసే సరికి ముగ్గురు మాత్రం అందులోనిలబడగా మిగతా వారు ఓడిపోయి తొలగిపోయారు. ఆరవ రౌండు పూర్తయ్యాక మిగిలిన ముగ్గురిలో రోహన్ ఒకడు కావడమేకాక అతడు పోటీలో గట్టిగా నిలిచి, పూర్తి విజయావకాశాలున్నట్టు కనిపించాడు. ఆ పోటీలో గెలిచివుంటే రోహన్‌కు నగర స్థాయిలో జరిగే హ్యూస్టన్ స్పెల్లింగ్ పోటీలోను, ఆ తర్వాత వాషింగ్టన్‌లో జరిగే జాతీయ స్పెల్లింగ్ పోటీలోను పాల్గొనే అవకాశం లభించి వుండేది.

అయితే రోహన్ అదృష్టం వేరుగా వుంది. నిబంధనల ప్రకారం స్పెల్లింగ్ పోటీలో పాల్గొనే విద్యార్థి కనీసం 'కిండర్ గార్డెన్' స్థాయిలోదాని, లేదా అయిదేళ్ళ వయసులోగాని వుండి తీరాలి. రోహన్‌కి అయిదేళ్ళ వయసు లేదు. అతడింకా "ప్రి-కిండర్ గార్డెన్" స్థాయిలోనే వున్నాడు. ఇది గమనించిన స్కూలు అధికారులు రోహన్‌ను ఏడవ రౌండ్‌నుంచి తొలగించారు. పోటీలో గెలుపొందే బాలుడు నగరస్థాయి పోటీలో పాల్గొనే అర్హతకూడా కలిగి వుండాలనే అభిప్రాయంతో వారీనిర్ణయం తీసుకున్నారు.

"నాలుగేళ్ళ వయసు మాత్రమే వున్నదనే కారణంతో రోహన్‌కి బహుమతి నివ్వకుండా ఎగనామం పెట్టారు" అని ఎన్‌బిసి ప్రతినిధి ఒకరన్నారు. ఎన్‌బిసి ఆధ్వర్యంలోని అత్యధిక ప్రజాదరణగల డేవిడ్ లెట్టర్‌మన్ టెలివిజన్ ప్రదర్శనలో రోహన్ పాల్గొన్నాడు. ఆ టి.వి. ప్రదర్శనలో టి.వి. తార రోహన్‌తో మాట్లాడుతూ "నీదొక ప్రత్యేకమైన "ఫెనామినన్"లాగా వుంది. ఇప్పుడు ఫెనామినన్ స్పెల్లింగు మాకు వినిపించు" అని అడిగారు. వెంటనే రోహన్ ఆ స్పెల్లింగును లోపరహితంగా చెప్పాడు. స్క్రిప్షన్, కన్‌ఫెట్టీ లాంటి క్లిష్టమైన పదాల స్పెల్లింగ్‌లనుకూడా ఈ నాలుగేళ్ళ బాలుడు "పొల్లు" పోకుండా చెప్పేశాడు.

రోహన్‌కి రకరకాల అంకెలుకూడా బాగా గుర్తుంటాయి. రోహన్ తన తల్లిదండ్రులకు ఒక "నడిచే టెలిఫోన్ డైరెక్టరీ" లాగా ఉపయోగ పడుతున్నాడు. 50 అమెరికన్ రాష్ట్రాలు, వాటి రాజధానీ నగరాల పేర్లనుకూడా రోహన్ గడగడ చెప్పెయ్యగలడు.

ఈ నెల అత్యుత్తమ అబద్ధం పోటీ

మొదటి అత్యుత్తమ అబద్ధం

రూ॥ 100/-

"రాష్ట్రంలో టెలిగ్రాంలు '12' గంటల వ్యవధి లోపే గమ్యాన్ని చేరుతున్నాయ్" అని ఆంధ్రప్రదేశ్ టెలికమ్యూనికేషన్స్ జనరల్ మేనేజర్ డి.ఎ.నందా చెప్పారు. (ఆంధ్రభూమి 7-5-1987)

కాకా శ్రీనివాస్
ద్రాక్షారామ

రెండవ అత్యుత్తమ అబద్ధం

రూ॥ 75/-

"2000 సం॥ నాటికి అందరికీ ఆరోగ్యం"
కార్యదర్శి-ఆరోగ్య, వైద్య. కుటుంబ సంక్షేమ శాఖ - ఆంధ్రప్రదేశ్
(ఆంధ్రజ్యోతి 19-4-87)

కె. మధుసూధన్
హైదరాబాద్

మూడవ అత్యుత్తమ అబద్ధం

రూ॥ 50/-


"మేం మీ స్నేహితులం అవసరమైనపుడు మా సహాయం తీసుకోండి"
(హైదరాబాద్ లోని ఒక పోలీస్ స్టేషన్ ముందు బోర్డు.)

సి. భాస్కర్ నత్యాజీ
హైదరాబాద్.

ఇతర ఉత్తమ అబద్ధాలు

"ఉగ్రవాదుల ఆట కట్టిస్తాం" - వసంత
(ఆంధ్రజ్యోతి డైలీ ఏప్రిల్ 14, 87)

అన్నపురెడ్డి గంగాధర రెడ్డి
తెనాలి



"ఇళ్ళలో కరెంట్‌కు కోతలేదు" విద్యుత్ కోతపై మంత్రి వివరణ
(ఆంధ్రజ్యోతి : 20-4-87)

వి.వి. సుబ్బారావు
గుంటూరు

"మహిళలను అసభ్యంగా, తక్కువగా చూపించే వాణిజ్య ప్రకటనలు ఇకపై దూరదర్శన్ లో కనిపించవు." (11-5-87 ఆంధ్రజ్యోతి)

గుత్తుల సుభాష్
ద్రాక్షారామం

"ఆర్టీసీ కింద వున్న దాదాపు పదివేల బస్‌లు రోజుకు 29 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ, మొత్తం 55 లక్షల మంది ప్రయాణీకులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి" (ఈనాడు 11-4-87)

సి.వి. నరసింహదాసు
విజయనగరం

లాకప్ మరణాలకు పోలీసులు బాధ్యత ఉన్నట్లు రుజువైన చోట వారిని రక్షించేందుకు ప్రయత్నించటం జరుగదని పోలీసు డైరెక్టర్ జనరల్ శ్రీ పి.యస్. రామమోహనరావు బుధవారం విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు.
(ఉదయం 16-4-87 గురువారం)

కృష్ణశ్రీ
తెనాలి

"గ్రామాల అభివృద్ధే 'దేశం' ధ్యేయం" అని 21-4-87వ తేది ఈనాడు దినపత్రికలో పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ యర్రానారాయణస్వామి ఉద్ఘాటించారు.

డా॥ యం. శ్రీరామప్రసాద్
భీమవరం

తోటకూర ఆశాలత



డెత్‌ట్రాప్

“మహానాడు” దినపత్రిక మేనేజింగు డైరెక్టర్ మధు అలవాటు ప్రకారం ఉదయం అయిదు గంటలకే టెన్నిస్ కోర్టు చేరుకున్నాడు. తెల్లని పాల నురగవంటి హాఫ్ ప్యాంటీ, ట్రౌజర్, కాళ్ళకు కాన్వాసు బూట్లు ధరించాడు.

స్టేట్స్‌నుంచి తిరిగి వచ్చిన మధుకి నూటికి తొంభయి మంచి లక్షణాలున్నాయి. అయితే ఆ పదిశాతం చెడ్డలక్షణాలు అతి దారుణమయినవి. ఆ పదిదాలు మిగిలిన తొంభై శాతం మంచిని నాశనం చేయడానికి. ఉదయానే లేచి ఆఫీసర్స్ క్లబ్బుకి వెళ్ళడంలోని అంతర్యం కేవలం ఆరోగ్య జాగ్రత్తకాదు, అధికారులతో పరిచయాలు పెంపొందించుకోవడంకూడా! ఆ అధికారులతో పరిచయం మధుకి ఎంత అవసరమో, ఒక ప్రముఖ దినపత్రిక మేనేజింగు డైరెక్టర్‌తో సన్నిహిత సంబంధాలుండడం వారికీ అంత అవసరం. దాదాపుగా అయిదున్నర గంటల వరకు టెన్నిస్ ఆడి అలసిపోయిన మధు, సబ్‌కలెక్టర్ మల్హోత్రా ఆ రోజుకి ఆట ముగించి కోర్టు బయటకు వచ్చారు. స్నానం చేసినట్లున్నాయి వారి శరీరాలు. కూడా తెచ్చుకున్న టర్కీటవల్‌తో ముఖం, చేతులూ తుడుచుకుని కేఫిటేరియావైపు నడిచారు. అప్పటికే వేరే కోర్టులో టెన్నిస్ ఆడి వచ్చిన కలెక్టర్ రెడ్డి లెమన్‌జ్యూస్ తాగుతూ ఆరోజు ఉదయం వచ్చిన దినపత్రికలలోని హెడ్‌లైన్స్ చూస్తున్నాడు. “మహానాడు” దినపత్రిక మొదటి పేజీలో ఫోటోతోసహా వచ్చిన వార్తను చూసి కలవర చెందాడు. వెంటనే, “మిస్టర్ మధూ...” అంటూ పిలిచాడు.

“హలో, గుడ్‌మార్నింగ్ మిస్టర్ రెడ్డి...” అంటూ ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు మధు.

“గుడ్‌మార్నింగ్ సార్...” అంటూ వెళ్ళి ప్రక్కనేవున్న మరొక కుర్చీలో కూర్చున్నాడు సబ్ కలెక్టర్ మల్హోత్రా.

“డిడ్‌యూ సీ దిస్ న్యూస్...” అంటూ ‘మహానాడు’ దినపత్రిక వారి ముందుంచాడు.

అది రిటైర్డ్ డి.ఎస్.పి. రామచంద్రుడి కూతుర్ని మానభంగం చేసి హత్య చేసినవార్త.

ఆవార్త అప్పుడే చూసినవాడిలా ఒక ఎక్స్‌ప్రెషన్ ఇచ్చి “అరె రిటైర్డ్ డి.ఎస్.పి. రామచంద్రుడిగారి అమ్మాయిని వారిఇంట్లోనే రేప్‌చేసి మర్డర్ చేశారట - వాటీజ్ దిస్ - నో, ఐకాంట్ బిలీవ్‌ఇట్, రంజిత్ వుండగా అదీ ఒక డి.ఎస్.పి. కూతుర్ని రేప్ చేసి మర్డర్ చేయడమా?” అన్నాడు మధు.

“సీ మధూ - దటీజ్ యువర్ పేపర్. ఆర్ యూ డినయింగ్ యువర్ రిపోర్టర్స్ రిపోర్ట్” అడిగాడు సబ్ కలెక్టర్.

జరిగినకథ:-

స్పెషల్ మెజిస్టీరియల్ పవర్స్‌తో పట్టణంలో శాంతిభద్రతల్ని పునరుద్ధరించడానికి ఎస్.పి. రంజిత్ నియమించ బడతాడు. పట్టపగలు కాలేజీ విద్యార్థినిని అపహరించుకుపోయి మానభంగంచేసి హత్యచేస్తారు. యు.ఎస్. ఆర్గనైజర్ వెంకట్ బంద్‌కి పిలుపు ఇస్తాడు. వెంకట్ శత్రువు అయిన కుమార్ ప్రశాంతంగాసాగే ఊరేగింపులో అరాచకం సృష్టిస్తాడు. “మహానాడు” దినపత్రిక రిపోర్టర్ మిస్ కపిల ఆ ఘోరాన్ని ఫోటోలతోసహా ప్రచురిస్తుంది. రిటైర్డ్ డి.ఎస్.పి. రామచంద్రుడుడి కూతుర్ని ఆమె ఇంట్లోనే మానభంగం చేసి హత్యచేస్తారు. ఈ ఘోరాలు చేస్తున్నది వెంకట్ అని అభిప్రాయపడిన రంజిత్ వెంకట్‌ని అరెస్ట్ చేయడానికి వెళ్తాడు. తనపై అంతటి ఆరోపణ చేసిన రంజిత్‌ని హతమార్చడానికి వెళ్తాడు వెంకట్.

ఆ తర్వాత—

"డిసిప్లిన్‌కి మారుపేరు రంజిత్. అతడి పేరు చెబితే గూండాలు మకాం మారుస్తారంటారు. ఈ టౌన్లో శాంతి భద్రతలు కాపాడటానికి ముఖ్యమంత్రి స్పెషల్ ఆర్డినెన్స్ తీసుకొచ్చి మెజిస్టీరియల్ పవర్స్‌తో రంజిత్‌ని నియమించాడు. పైపెచ్చు ఈ సిటీని స్పెషల్ డిస్ట్రిక్ట్ పవర్స్‌తో రంజిత్‌ని నియమించాడు. పైపెచ్చు ఈ సిటీని స్పెషల్ డిస్ట్రిక్ట్‌గా అనౌన్స్ చేశాడు. అలాటి రంజిత్ వుండగా ఈ రేప్‌లు, మర్డర్లు ఏమిటి?" అనడిగాడు మధు.

"అదే ముఖ్యమంత్రి చేస్తున్న పొరపాటు. ఒక్క ఎస్.పి. వల్ల ఏమీకాదు. బీటు కానిస్టేబుల్ దగ్గర్నుంచి డి.ఎస్.పి. వరకు ప్రతివాడూ డెడికేటెడ్‌గా పనిచేయాలి. ఏ పేటలో ఏ గూండా వున్నాడో, ఏ కేడీగాడు ఎవడిజేబు కొట్టాడో హెడ్ కానిస్టేబుల్‌కి తెలుస్తుందిగాని ఎస్.పి.కి కాదు. ఆ విషయం ముఖ్యమంత్రికి తెలియదు. ఈ రంజిత్‌ని తలమీద పెట్టుకుని పూజిస్తున్నాడు, పర్యవసానం బూకారుగా - పట్టపగలు అందరూ చూస్తుండగా ఒక కాలేజీ విద్యార్థిని కిడ్‌నాప్‌చేసి మానభంగం చేసి చంపారు. మరుసటి రోజున ఒక ముసలమ్మను చెట్టుకి ఉరి తీశారు. ఆ తర్వాత పెట్రోల్ బంకులు తగలబెట్టారు. ఇప్పుడు ఒక రిటైర్డ్ డి.ఎస్.పి. కూతుర్ని ఇంట్లోనే రేప్‌చేసి మర్డర్ చేశారు, రేపు ఎస్.పి. రంజిత్ బంగ్లాపైనే దాడిచేస్తారు. ఇహ అప్పుడు ప్రారంభమవుతుంది అసలుకథ. శాంతి భద్రతల పునరుద్ధరణలో ప్రభుత్వం విఫలమయిందని హోంమంత్రి రాజీనామా చేయాలని కొందరు ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని మరికొందరు డిమాండ్ చేస్తారు. రాష్ట్రమంతటా నిరసన ప్రదర్శనలు, ఊరేగింపులు మొదలవుతాయి. అప్పుడు ప్రజల కన్నీళ్ళు తుడవడానికి - తాత్కాలికంగా ప్రతిపక్షాల గొడవ సద్దుమణగడానికి హోంమంత్రిచేత రాజీనామా చేయిస్తాడు ముఖ్యమంత్రి. అదీ జరగబోయేది ..." అంటూ తన ఆవేదనని వెళ్ళగక్కాడు కలెక్టర్ రెడ్డి.

"రెడ్డిగారూ! ఈ ముఖ్యమంత్రి హయాంలో మీ రాయల సీమకు చాలా అన్యాయం జరుగుతోందిగదా, చదువు కున్నవారు మీరైనా ఉద్యమించకపోతే ఎలా? ఎలాగూ ప్రజలకు రాజకీయ నాయకులపై నమ్మకం పోయింది. మీలాటివారు రంగంలోకి దిగితేనే రాజకీయంగా ముఖ్యమంత్రిని ఎదుర్కొన గలిగేది. లేకుంటే మరో పదేళ్ళ వరకు తప్పదు మనకీపాలన" అగ్నిలో ఆజ్యం పోశాడు 'మహానాడు' దిన పత్రిక మేనేజింగ్ డైరెక్టర్ మధు.

"ఎరక్కపోయి వచ్చి ఇరుక్కుపోయాన్రా ..." అస్పష్టంగా అసహనంగా నవ్వలేక - ఏడ్వలేక చూస్తున్నాడు సబ్ కలెక్టర్. అయితే వారి సంభాషణను వినవలసిన వ్యక్తే విన్నాడు. అతడు సి.ఐ. సింహాచలం!

ఎస్.పి. రంజిత్ కులపోడు!!

కలెక్టర్, సబ్ కలెక్టర్ వద్ద సెలవు తీసుకున్న 'మధు' మహదానందపడి పోతున్నాడు: 'మహానాడు' అందించిన వార్త ఐ.ఏ.యస్. ఆఫీసర్లలోనే అంతటి సంచల




నాన్ని సృష్టిస్తే ఇహ సామాన్య ప్రజానీకంలో ఎంతటి సంచలనాన్ని సృష్టిస్తుందో! ప్రజలలో 'మహానాడు' సృష్టిస్తున్న సంచలనాన్ని చూడాలన్న కోరికను చంపుకోలేకపోయాడు. స్టీరింగ్ ముందు కూర్చున్న అతడు అప్రయత్నంగా ఇంటివైపు వెళ్ళకుండా మెయిన్ బజార్‌వైపు మళ్ళించాడు.

రిటైర్డ్ డి.ఎస్.పి. రామచంద్రుడు ఆ పట్టణంలోనే ఉద్యోగం చేసి రిటైరయ్యాడు; ఆ పట్టణంలో తరచుగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో అతడు ముఖ్య అతిథిగా పాల్గొంటాడు. అంతకుమించి ఆ పట్టణంలో ఎవరు ఏ మంచి కార్యక్రమం తలపెట్టినా ముందుగా విరాళమిచ్చేది ఆయనే!

అటువంటి రామచంద్రుడి ఇంట్లోకి ప్రవేశించి ఆయన కూతుర్ని రేప్ చేసి చంపారన్న వార్త వెలువడటంతో పట్టణమంతా అట్టుడికినట్టు ఉడికిపోతోంది. ఆ వార్తను ఫోటోతోసహా అందించిన ఏకైక పత్రిక 'మహానాడు' దిన పత్రిక 'మహానాడు' ఏ స్టాలులో చూసినా మిగిలిన పత్రికలన్నీ తోరణాలవలె వ్రేలాడు తున్నాయి గాని 'మహానాడు' దిన పత్రిక మాత్రం కనిపించడంలేదు. ఒకరి చేతిలో 'మహానాడు' దిన పత్రిక వుంటేచాలు; పదిమంది అతడి చుట్టూ చేరుతున్నారు. అదృశ్యాన్ని చూసిన మధు హృదయం ఆనందంతో ఉప్పొంగి పోయింది. తన పత్రిక అత్యధిక సర్క్యులేషన్‌గల దినపత్రిక కావడం ఖాయం అనుకున్నాడు. ఆఫీసుకి వెళ్ళగానే కపిలని పిలిచి అభినందించాలనుకున్నాడు.

కాని, ఆఫీసుకి వెళ్ళగానే ముందుగా కలెక్టర్ రెడ్డి చెప్పిన విషయాన్ని ఆచరణలో పెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఎడిటర్‌ని పిలిచి రైలు ప్రమాదం జరిగినందుకు నైతిక బాధ్యత వహిస్తూ ఏ మంత్రి రాజీనామా చేసిందీ, పరీక్షా పత్రాలు వెల్లడయినందున ఏ రాష్ట్ర మంత్రి రాజీనామా చేసిందీ, ఆర్టీసీ బస్సుల జాతీయకరణలో కోర్టు తీర్పు తనకు వ్యతిరేకంగా వచ్చినందున ఏ ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేసిందీ వివరాలు అడిగి తెలుసుకున్నాడు. ఎడిటర్‌ని పంపించి తాను రాయదలుచుకుంది రాయడం ప్రారంభించాడు.



తర్వాత కపిలకోసం కబురంపాడు. ఆమెను చూస్తూనే అభినందనలందజేసి "కపిలా! రోజూ 'మహానాడు' దినపత్రిక ఏదోఒక సంచలనవార్త అందజేయాలి - అందజేస్తుంది. అంతే" అన్నాడు.


విషయం బోధపడక "ఆదెలాసార్" అనడిగింది కపిల. "ఇలా..." అంటూ తాను రాసిన కాగితాల్ని ఆమె ముందుంచాడు. నగరంలో జరిగిన అత్యాచారాలకు మారణకాండకు నైతిక బాధ్యత వహిస్తూ హోం మంత్రి రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేస్తూ రాసిన సంపాదకీయమది. "కపిలా... మీవలె నేను స్పష్టమయిన తెలుగుభాష రాయలేను. భాష సరిదిద్దు. రేపటి పేపర్లో మొదటిపేజీలో నా సంతకంతో ఈ ఆర్టికల్ వస్తుంది. దీనితో హోం మంత్రి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు, ప్రజలు గొడవ చేస్తాయి. ఒకరకంగా ఈ గొడవకి మనమే నాయకత్వం వహిస్తాం. హోంమంత్రి రాజీనామా అయినా చేస్తాడు లేదా ప్రతిపక్షాలు, ప్రజలు నిరాహారదీక్ష అయినా చేస్తారు. ఏది జరిగినా మన పత్రికకే లాభం. ఏమంటావు?" అనడిగాడు.

అతడి ఆలోచనా సరళిని అభినందించకుండా వుండలేక పోయింది. అప్రయత్నంగా "కంగ్రాచ్యులేషన్స్‌సార్..." అంటూ చేయి అందించింది. ఆమె చేతిని వదిలిపెట్టకుండా అలాగే పట్టుకుని, మృదువుగా నొక్కుతూ, "కపిలా! జర్నలిజంలో నాకు ఇన్‌స్పిరేషన్ నీవే... ఐ లైక్‌యూ, ఐ ఎడోర్‌యూ" అంటూ సన్నగా గొణిగాడు.

ఆరడుగుల అందగాడు అలా ఆమె చేతిని పట్టుకుని అభినందిస్తుంటే అఫె స్థానంలోనున్న ఏ ఆడపిల్ల హృదయం లయ తప్పకుండా వుంటుంది?

(సశేషం)

పద వ్యూహం ⑦



చిరునామా: ______________________

____

ఆధారాలు

అడ్డం :

1. పెద్ద ఉసిరికి పూజ చేసే రోజు 6. ఎవరు చేయుపనులకు వారి మనసే. 7. చిలుక 9. పేదవాడిపనికిచ్చే వేతనం 11. తండ్రి పిల్లల్లో వచ్చిన కలహం 13. ఇక్కడ కూడా ఏక వచనప్రయోగం చేస్తారు. 15. ప్రపంచ పోటీలో బహుమతి పొందిన తెలుగు కథ 16. విజయవాడకు మద్రాసుకు మధ్య ఒక రైలు స్టేషను 17. దీన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుంది.

పోల్కంపల్లి శాంతాదేవి సీరియల్

నవత - యువత

"మొద్దునా? పిల్లనా?" ఉడుక్కుని దెబ్బలాటకి సిద్ధపడుతున్నట్టుగా అంది శాలిని.

"లేకపోతే ఏమిటండీ? ఒకసారి డైలాగులు నా దగ్గర విని పిల్లలకి - నేర్పుతానన్నారు! ఆ సంగతేదో చూసుకోక సినిమాలకు ఎందుకు పోలేదని సలహా ఇస్తారా?"

"మీ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ మీకెంత ఉందో, నా అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ నా కంతే ఉంటుంది."

"ఏం లేకపోయినా ఈ స్వతంత్ర పోరాటం ఒకటీ మీ ఆడవాళ్ళకు!"

"ఏం తక్కువుందని మీ అభిప్రాయం?" ఇప్పుడు నిజంగా యుద్ధానికి సిద్ధమైపోయింది శాలిని,

"ఏం తక్కువ లేదు. డాలు, కత్తి, శిరస్త్రాణం. కంచు కవచం - అన్ని

ఉన్నాయి. ఏమీ లేని నిరాయుధులం మేమే."

"అదిగో! మళ్ళీ వెటకారం! మీకు స్త్రీల పట్ల చాలా తేలిక భావం ఉన్నట్టుంది!"

"మీకు పురుషుల పట్ల చాలా వైరభావం ఉన్నట్టుంది."

"నాకేం లేదు."

"నాకూ ఏం లేదు."

ఇద్దరి మధ్య ఒక నిమిషం మౌనం రాజ్యం చేశాక శర్మ అన్నాడు ఉదాసీనంగా "మనం ఈ విషయం మీద పోట్లాడుకుందుకు భార్యా భర్తలం కాదు. కనీసం ప్రేయసీప్రియులం అయినా కాదు.....ఇహ మనం అస్సలు విషయంలోకి వద్దామా?"

"మంచిది." అంది శాలిని సీరియస్‌గా.

ఈవిధంగా యుద్ధం మొదలయ్యే కాకముందే సంధి జరగడం అసంతృప్తి అనిపించింది శాలినికి. ఇంకాసేపు మాటల బాణాలు విసురుకుంటే బాగుండేది.

శర్మ డైలాగులు చెప్పసాగాడు.

శాలిని వింటూంది.

నాటకం పేరు 'కుక్కకాటుకి చెప్పుదెబ్బ!'

షావుకారు రాజయ్య ఓ పేద కాపుకు ఓ పదిహేనురూపాయలు వడ్డీకిస్తాడు. వడ్డీ చక్రవడ్డీ, బారువడ్డీ కట్టి పదిహేనురూపాయలను 100 రూపాయలు చేస్తాడు. వంద రూపాయల అప్పు క్రిందికి వందరూపాయల విలువ చేసే గొర్రెను పేదకాపునుండి వసూలు చేస్తాడు రాజయ్య. గొర్రెను వెంటబెట్టుకుని ఇంటికి వెడుతుంటాడు రాజయ్య.

ఆఊళ్ళో ముగ్గురు తెలివైన వాళ్ళు ఉంటారు. మోసం, అక్రమం, అన్యాయం ఎక్కడ ఉన్నా బుద్ధిచెప్పేవాళ్ళు. పదిహేనురూపాయల అప్పు క్రిందికి వంద రూపాయల విలువ చేసే గొర్రెను పేదరైతు నుండి కాజేశాడని తెలిసి, ముగ్గురూ షావుకారికి బుద్ధి చెప్పడానికి బయల్దేరుతారు.

> **జరిగినకథ:**
>
> వనజాక్షికి పెళ్ళి చూపులు జరుగుతాయి. ఆమె స్నేహితురాళ్ళు ఆ పెళ్ళి అంటే ఇష్టపడరు. సుధకు విలేజ్‌వర్కర్‌గా వనపర్తిలో పోస్టింగ్ వస్తుంది. ఆమెను ఒంటరిగా పంపడానికి ఇంట్లో ఒప్పుకోరు. శాలినికి కూడా వనపర్తి దగ్గర పల్లెటూర్లో టీచర్ ఉద్యోగం వస్తుంది. సుధ విలేజ్ వర్కర్‌గా జాయిన్ అవుతుంది. ఊళ్ళోకి పెళ్ళిన సుధకు ఆ వాతావరణం, రొచ్చు వాసనలు ఇబ్బంది కల్గిస్తాయి. అయినా ఓర్చుకొని తన కార్యక్రమం ప్రారంభిస్తుంది.
>
> శాలిని తన స్కూల్లో పని చేస్తున్న లెక్కల టీచర్ శర్మను ప్రేమిస్తూంటుంది. కాని, ఆ విషయం అతను గమనించడు. సుధ అతనిగురించి పూర్తిగా వివరాలు సేకరిస్తుంది. ఆమె ఊళ్ళోని స్త్రీలతో బలవంతంగా మహిళా మండలి పెట్టిస్తుంది.
>
> —ఇక చదవండి

"ఏం, రాజయ్యా? కుక్క మెడకు తాడుకట్టి లాక్కువెడుతున్నావు?" అంటాడు మొదటివాడు.

"కుక్క! నీ కళ్ళకి కుక్కగా కనిపిస్తుందేమిటిరా? వంద రూపాయలు పోసి కొన్న గొర్రెరా ఇది! కోపంగా అంటాడు షావుకారు రాజయ్య.

"కుక్కని గొర్రెని చెప్పి నిన్ను తేలిగ్గా మోసం చేశాడు ఎవడో!" అని వెళ్ళిపోతాడు మొదటివాడు.

రెండోవాడు వస్తాడు, వాడూ కుక్క అంటాడు. మూడో వాడు కూడా వచ్చి 'కుక్క' అని గట్టిగా దబాయించే సరికి, నిజంగా మోసపోయినట్టున్నాను! ఛీ ఛీ! కుక్కను వెంటబెట్టుకు వెళ్ళడమేమిటి?' అనుకొని, గొర్రె మెడలో తాడు విప్పి రెండు దెబ్బలు వేసి తరిమి వేస్తాడు రాజయ్య.

గొర్రెపిల్లను పేదరైతుకు తెచ్చి అప్పగిస్తారు ఆ ముగ్గురూ.

డైలాగులు హాస్యయుతంగా ఉండడంవల్ల శాలిని డైలాగు పలికినప్పుడల్లా ఒకటే నవ్వడం మొదలుపెట్టింది.

"నవ్వితే ఎలా? ఆ డైలాగ్ సీరియస్‌గా అనాలి!"

"నవ్వొస్తూంది మరి!"

"మీకు నేర్పడంకంటే ఆ పిల్లలకి చెప్పడమే నయమనిపిస్తూంది! శర్మ విసుగ్గా అని వెళ్ళబోయాడు.

"ఆగండాగండి! ఇహ నవ్వను! సీరియస్‌గా, మీరెలాఅంటే అలా అంటాను! మక్కీకి మక్కీ! మీరే ఆశ్చర్యపడతారు నా టాలెంట్ చూసి."

"మక్కీకిమక్కీ టాలెంట్ అంటారా? స్వయం ప్రతిభ, అంటే తనదైన ఒక బాణీని టాలెంట్ అంటారు!"

"తనను ఉత్తేజ పరిచినవాళ్ళను అనుకరించడం ప్రతీ ఆర్టిస్ట్ జీవితం ప్రారంభించినప్పుడు తప్పదనుకొంటాను! తరువాతరువాత తనదైన బాణీ అదే ఏర్పడుతుందని నా అభిప్రాయం!"

"సరే! ఈ డైలాగ్ ఒక్కసారి అనండి! డైలాగ్‌లోని చమత్కారం ప్రేక్షకుడిని నవ్వించడానికేగాని పాత్రధారిని నవ్వించడానికి కాదని గుర్తుపెట్టుకోవాలి!"

తరువాత పదిహేను నిమిషాలు చాలా బుద్ధిగా రిహార్సల్ చేసింది శాలిని.

హిస్టరీ టీచర్ హరగోపాల్ వచ్చాడు. "శాలిని టీచర్, మీకు పాటలేమైనా వస్తే పిల్లలకి నేర్పకూడదూ?"

"మనం నేర్పితే తను నేర్చుకొని తరువాత పిల్లలకి నేర్పుతానంటుందిలెండి!" శర్మ అన్నాడు.

"పాటల సంగతి ఎత్తితే నేనే మీ గురువునవుతానండోయ్!" అంది శాలిని సగర్వంగా.

"అహా?! ఏదీ ఒక పాట!"

"శ్రీరామా చంద్రునికీ నిత్యా జయా మంగళం ..." రాగయుక్తంగా పాడి, ఇది మా అమ్మమ్మ ఎంతబాగా పాడేదనుకొన్నారు? ఏ పేరంటం, ప్రయోజనం అయినా టకీమని ఈ పాటే అందుకొనేది మా అమ్మమ్మ!"

"ఆడపిల్లలకి ఈ పాట నేర్పి పాడిస్తే ప్రేక్షకులు స్టేజీకి, స్టేజీమీదున్నవాళ్ళకి మంగళం పాడేస్తారు తల్లీ రాళ్ళతో!" అన్నాడు హరగోపాల్, శాలిని పాటకు బెదిరి పోయి!

"మరి ఏం పాడమంటారు?"

"హాస్యం చాలుగాని మీ గొంతు బాగుంది! దేశభక్తిగీతం ఏదైనా వస్తే పిల్లలకి నేర్పండి!" అన్నాడు శర్మ.

"నిజంగా నా టోన్ బాగుందా?" శాలిని సంతోషం దాచుకోలేనట్టుగా అడిగింది.


"ఆఁ కోయిల కుహూఁ అన్నంత మధురంగా!"

"అబ్బ! ఒక్కదాంట్లోనైనా మెచ్చుకొన్నారు. అయిదో తరగతి చదివే పిల్లను మందలించినట్టుగా మందలిస్తూంటే ఏడుపు ఒక్కటే తక్కువైంది నాకు!"

"అయిదో తరగతి విద్యార్థినికి మించిన జ్ఞానం ఉన్నట్టు నాకేం కనిపించలేదు మరి!"

"బి.ఏ. డిస్టింక్షన్‌తో, బి.ఇడి. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యానండీ! ఎవరి రికమెండేషన్, నయాపైస ముడుపు లేకుండా నా మెరిట్‌తో సంపాదించుకొన్నానండీ ఈ ఉద్యోగం! నాకు అయిదో తరగతి స్టూడెంట్‌ని మించిన జ్ఞానం లేదా?" శాలిని దెబ్బలాటకి సిద్ధమై పోయింది.

"ఆడపిల్లలు అధిక సంఖ్యలో డిస్టింక్షన్‌లతో, ఫస్ట్‌క్లాసులతో పాసవుతున్న మాట నిజమేకాని, నకల్ చీటీలకు మీ పమిటలూ, రవికలూ చాలా సహాయకారిగా ఉంటాయని నా నమ్మకం" శర్మ కవ్వింపుగా అన్నాడు.



"ఎంతటి హేయమైన అభాండం ఆడపిల్లలమీద! ఛీ!" ఒళ్ళంతా భగ్గుమన్నట్టుగా అయింది శాలినికి. "పట్టి సంకుచితులు! ఆడదాని అభ్యుదయాన్ని ఒప్పుకోని కుశ్చితులు! మీ పెళ్ళి ఏ పల్లెటూరి గబ్బిలంతోనో ఊరగాలి తప్ప కాస్త చదువుకొన్నదీ, ఆలోచించగలిగిందీ అయితే అది అడుగడుగునా మీ కుశ్చితంతో, కుచేష్టలతో అవమానింపబడి, ఆత్మహత్య చేసుకు చావాలి!" కసికొద్దీ అంది.

"గొప్ప అభిప్రాయం! బంగారం లాంటిది! ఫ్రేం కట్టించి దాచుకొంటాను!" శర్మ తొణక్కుండా చిరునవ్వుతో అన్నాడు.

ఆ చిరునవ్వుకు ఇంకా కంపరమెత్తింది శాలినికి.

"తర తరాలుగా ఆడదాన్ని అవిద్యలో, అంధకారంలో ఉంచి ఆమెని ఒక కట్టుబానిసనుచేసి అధిపత్యం చెలాయించారండీ మీ మగవాళ్ళు! ఆమెను ఎంత దారుణంగా అణచివేశారంటే మగడు పుటుక్కున చస్తే, మగడులేని జీవితం ఓజీవితమేనా అని, అతడితోపాటు చితిలోపడి తగలబడి పోతే సతి జన్మ తరిస్తుంది అనుకొనేంతగా అణచివేశారు. ఇప్పుడిప్పుడే ఆ చీకటి తెరలు చీల్చుకొని బయటికి వచ్చేస్తూంది! ఇదేమిటని అడుగడుగునా మిమ్మల్ని ప్రశ్నిస్తూంది! నిలవేస్తూంది చైతన్యపు వెల్లువతో ఆదిశక్తిలా విరుచుకు పడుతున్న ఆమెను చూసి మీ కోట బీటలు వారుతున్నదని బెంబేలు అయిపోతున్నారు. ఆమె మేధస్సునూ, తెలివి తేటలనూ, చదువు సంధ్యలనూ ఒప్పుకోవడానికి ఇష్టంలేదు! అందుకే ఈ సంకుచితమైన విమర్శలు."

పెద్ద చప్పట్లవర్షం కురిసింది.

ఆవేశంతో తనను తను మరిచి, కంఠ స్వరం హెచ్చింది మాట్లాడుతున్న శాలిని చప్పట్ల చప్పుడికి ఉలికిపడి చూసింది.

స్టాఫ్ రూం అంతా టీచర్సుతో నిండిపోయిఉంది.

"శాలిని దీదరు కానా గరమ్ అయిపోయినార్ ఏమ్టి?" అన్నాడు పి.టి.సారు ఖాదర్‌ఖాన్.

"ఆడపిల్లలు రవికల చాటున, కొంగులచాటున చీటీలు పెట్టుకువచ్చి పరీక్షల్లో నకల్ నడుపుతారని అన్నారు శర్మ సార్. ఇంకేముంది? యుద్ధభేరి మ్రోగింది. ధనధనా బాణ వర్షం కురిపించేసింది. బాణవర్షమా అది! బాంబుల వర్షం!" చమత్కారంగా చెప్పాడు హరిగోపాల్.

అందరూ ముసిముసిగా నవ్వారు తప్ప ఎవరూ ఎవరిని సైడ్ చేయలేదు.


శర్మ అంటే చెప్పలేనంత కోపం నింపుకొంది శాలిని.

ఇంటికి వచ్చాక సుధతో అంది. "మనిషి ఎంత అందంగా, హుందాగా ఉంటే ఏం? మనసు పట్టి సంకుచితం, పైమెరుగులు చూసి భ్రమిశాను, ఇవాళ నా భ్రమ తొలగి పోయింది."

"ఎవరి సంగతి నువ్వు మాట్లాడేది?"

"ఇంకెవరు? ఆశర్మగాడే."

"బాబోయ్! ఒక్కసారే అతడు 'గాడ్' ఎలా అయ్యాడు?"



"గాడ్ కాదు 'గాడు' కసిగా ఒత్తి పలికింది గాడును."

"ఆటగాడు వేటగాడు పాటగాడన్నట్టు శర్మగాడన్నమాట."

"హాస్యం చేయకు. నాకిప్పటికే ఒళ్ళు మండి పోతూంది."

"ఏదీ ? ఎక్కడ ? ఒకనిప్పురవ్వగాని, చిసరంత పొగగానీ కనిపించడం లేదు." శాలిని ఒంట్లో వెతుకుతున్నట్టుగా, చేతుల్తో తడమ సాగింది.

"నిన్ను తంతాను."

"ఇంతకీ ఏం జరిగింది, భామామణీ !"

"ఈ సంగతి విన్నావంటే ఇప్పుడే నువ్వు యుద్ధానికి తయారై పోతావు. మన ఆడవాళ్ళందరికీ పరువు నష్టం కలిగించే మాటన్నాడు." శర్మ ఏమన్నాడో చెప్పింది.

"అంతమాటన్నాడా నీ హీరో ? అయితే అతడి పని పట్టాల్సిందే. వదల కూడదు. నాలుగు రోజుల్లో ఆ ఊరు టూర్ ప్రోగ్రాం వేసుకు వస్తాను, ఇద్దరం కలసి అతడిని ఒక పట్టు పడదాం ఏం ?" సుధ చిటిక వేస్తూ అంది.

◆ ◆ ◆ ◆ ◆

తనని చూడగానే ముఖంలో అదోలాంటి మెరుపు నిండిపోగా చిరునవ్వుతో విష్ చేసే శాలిని నిన్నటి సంఘటన తరువాత కోపం, ఏవగింపులాంటి భావం కళ్ళలో కన్పుమన్నట్టుకాగా, విసురుగా ముఖం త్రిప్పేసుకొంటుంటే శర్మ మనసు చివుక్కుమంది. సరదాకి అంటే అవిడంత సీరియస్‌గా తీసుకొంటుందనుకోలేదు !

క్లాస్‌లో పాఠం చెబుతున్నా మనసు శాలిని కోపాన్నే గుర్తు తెచ్చుకొని క్రుంగి పోతూంది ! "ఊహూఁ" లాభంలేదు ! అవిడకు సారీ చెప్పి అవిడ ప్రసన్న వదనం చూసేదాకా ఈ చింత దూరంకాదు ! అనుకొన్నాడు.

సాయంత్రం దాకా శాలినిని ఒంటరిగా కలుసుకొనేందుకు వీలుకాలేదు.

లాస్ట్ పీరియడ్‌లో ఫిఫ్త్ క్లాస్ పిల్లలకు పాట నేర్పుతూ కనిపించింది.

"మతం వద్దు ! కులం వద్దు ! మనమంతా ఒక్కటేరా !"

శాలిని గొంతు నిజంగా చాలా బాగుంది. అవిడ మాట్లాడుతుంటేనే చాలా మధురంగా, అవిడ మాటలు వింటూ ఎంతసేపైనా ఉండి పోవచ్చు నన్నట్టు మాట్లాడు

తుంది. పాట మాటకన్నా బాగుంది.

"పాటంతా ఒకసారి వినిపిస్తాను !" అంటూ పాడి ముగించగానే చప్పట్లు కొడుతూ ముందుకు వచ్చాడు శర్మ.

"చాలా బాగా పాడతారు, శాలినిగారూ ! ఇంత బాగా పాడగలరని నిజంగా అనుకోలేదు ; ఇంత బాగా పాడగలిగి 'శ్రీరామచంద్రునికి' అంటూ మీ అమ్మమ్మ పాట పాడి అదర గొట్టేశారెందుకు ?" అడిగాడు చనువుగా.

నిప్పు రవ్వ భగ్గుమన్నట్టుగా చూసి ముఖం మరో వైపుకు త్రిప్పుకొంది శాలిని.

"సారీ శాలినిగారూ ! నిన్న నా మాట వెనక్కి తీసుకొంటున్నాను" వినీ వినిపించనట్టుగా ఇంగ్లీష్‌లో అన్నాడు. "అసలు సరదాగా అన్నమాట మీరింత సీరియస్‌గా తీసుకొంటారనుకోలేదు."

"మాట వెనక్కి తీసుకొంటారు నిజమే ! కాని, మీ సంకుచితాన్ని ఎక్కడ దాచుకొంటారు ?"

"దాచుకోను ; మీ స్నేహంతో దాన్ని క్షాళితం చేసుకొంటాను."

అతని కంటి చివరినుండి ప్రణయ భావతరంగం ఒకటి ఒక మెరుపులా వెలువడి సూటిగా శాలిని హృదయంలోకి చొచ్చుకుపోయి, గిలిగింతలు పెట్టింది. క్షణ కాలం మాత్రమే ! వెంటనే క్రోధంతో ముఖం ఎర్రజేసుకొంది. "స్త్రీ పట్ల గౌరవ భావం లేని మీతో నాకు స్నేహం ఏమిటి, శర్మగారూ ?" అంది కరుగ్గా.

"స్త్రీలపట్ల నాకు గౌరవభావం లేదని ఎలా అనగలరు, శాలినిగారూ ?"

"నిన్న మీరు వేసిన సిల్లీ జోక్‌నుబట్టి !"

"సిల్లీ జోక్ కాదు ! సరదాజోక్ ; ఒక్క మాటమీద మొత్తం వ్యక్తిత్వాన్ని అంచనా వేయడం పొరపాటు శాలినిగారూ ; ఈ ప్రపంచ జనాభాలో సగం తామై మిగతా సగానికి నవమాసాలు మోసి జన్మనిస్తున్న స్త్రీలంటే నాకు చెప్పలేనంత గౌరవం ! ఏ కొమ్ములు తిరిగిన మగవాడైనా తల్లి ఆలనా, పాలనా, ఆమె ప్రేమా, వాత్సల్యం లేకుండా పరిపూర్ణ మానవుడు కాలేడుకదా ? పెరిగి పెద్దయ్యాక మరో స్త్రీ సాహచర్యం, ఆమె ఆరాధనా, లాలనా లేకుండా అతడి జీవితానికి పరిపూర్ణత రాదుకదా ? ఎలా చూసినా స్త్రీచుట్టూ తిరుగుతూ, ఆమెతో తన జీవితాన్ని ముడివేసుకొన్న పురుషుడు ఆమెను చులకన చేస్తాడంటే, అగౌరవ పరుస్తాడంటే నేనొప్పుకోను."

"ఒప్పుకోను అన్నంత మాత్రాన సరా ? పురుషుడి వల్ల స్త్రీకి జరుగుతున్నది మాత్రం అదే ! ఒక స్త్రీ పురుషుడు పవిత్రమైన వివాహ బంధంలో జంటగా జీవించడానికి వరకట్నం పేరుతో ఆమె నుండి పురుషుడు డబ్బు వసూలు చేయడం స్త్రీని అగౌరవ పర్చడం కాదా ? తను పోయాక ఆమెను వితంతు చిహ్నాలతో బ్రతికేట్టు చేయడం అగౌరవపర్చడం కాదా ? సరిసమంగా బాధ్యతలు వహించే సంసారంలో ప్రతి ముఖ్యమైన విషయానికి రాజముద్ర తన చేతిలోనే పురుషుడు ఉంచుకోవడం ఆమెను అవమానపరచడం కాదా ? ఫలానా డాక్టరు గారి భార్యను, జడ్జిగారి భార్యను

హెడ్‌మాస్టరు గారి భార్యను అని సగర్వంగా చెప్పుకొంటుంది ఆడది. ఫలానా డాక్టరు గారి భర్తను, ఫలానా వరలక్ష్మిగారి భర్తను అని గర్వంగా, గౌరవంగా అతడు ఎందుకు చెప్పుకోలేక పోతున్నాడు? నవమాసాలు మోసి కనిపెంచి పిల్లల జీవితంలో ప్రధాన పాత్ర వహించేది తల్లి. కాని, పిల్లలు తండ్రి పేరుతోనే చలామణి కావడం ఎంత దారుణం! ఇంట్లో, వీధిలో ఎక్కడ చూసినా మగవాడి డామినేషన్. వీటన్నిటికీ కారణం ఆడది ఒక మనిషి అనుకోకపోవడం వల్లేకదా? 'ఆ(ఆడది!' అన్న చులకన భావం ఉండడం వల్లనేకదా

మీరు హక్కుల గురించి గౌరవ మర్యాదల గురించి పురుషుడిని ప్రశ్నించే ముందు మీ ఆడవాళ్ళు ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని నామనవి. మగవాడంటే అపర ప్రమీలారాణుల్లా ఈసడించే మీ ఆడవాళ్ళు ఎంతమంది, మగవాడితో అవసరం లేకుండా, అతడిమీద ఆధారపడకుండా బ్రతక గలుగు తున్నారు? ఎంత మంది తమ కాళ్ళమీద తాము నిలబడగలుగుతున్నారు? అలా బ్రతికే వాళ్ళది చాలా తక్కువ పర్సెంట్ వస్తుంది కదా? మగవాడి సంపాదన మీద ఆధారపడి, అతడి దయ మీద ఆధారపడినప్పుడు అతడి డామినేషన్ ఆమె మీద తప్పకుండా ఉంటుందికదా?"

"సంపాదించుకుని, ఆర్థికస్వాతంత్రం కలిగి వున్న ఆడవాళ్ళ మీద కూడా పురుషుడి డామినేషన్ తప్పడం లేదు కదా? వెయ్యి రూపాయలు సంపాదించుకొనే ఆడది కూడా మగడు ఓ. కే. అంటేనే తనకిష్టమైన చీర కొనగల స్థితిలో ఉందికదా? కని పెంచి ఇంతదాన్ని చేసిన తల్లిదండ్రులకు ఓ పదిరూపాయలు సాయం చేయాలన్నా అతడి అనుమతి కావాలి కదా?"

"ఎందుకంటే, అతడి ఆధిపత్యాన్ని తిరస్కరించగల వ్యక్తిత్వం సంతరించుకోలేదంటాను. డబ్బు అవసరం లేకపోవచ్చు! మానసిక పరిణతి లేకపోవడం వల్ల కూడా అతడిమీద ఆధారపడడం జరుగుతుంది. శారీరక బలహీనత, స్త్రీ శీలానికి సంబంధించిన కొన్ని హద్దులు కూడా పురుషుడి మీద ఆధారపడేట్టు చేస్తాయి! తను అతడిమీద ఆధారపడిన సంగతి మరిచిపోయి, అతడు తనమీద ఆధిపత్యం చలాయిస్తున్నాడని కారాలు మిరియాలు నూరడం అది మీ ఆడవాళ్ళ అజ్ఞానం తప్ప మరేం కాదు."

"ఎంత పక్షపాతంతో వాదిస్తున్నారు మీరు." బాధతో అంది శాలిని. "ఆర్థికంగా మగవాళ్ళ మీద ఆధారపడిన ఆడవాళ్ళను అంత హీనభావంతో చూడక్కరలేదంటాను, ఎందుకంటే, అతడికి పిల్లల్ని కని, సంసారానికి సర్వచాకిరీ చేస్తుంది. కాబట్టి! గృహిణి రోజుకు పదహారుగంటలు శ్రమిస్తుందని అంచనా! ....

"కొన్నిమెస్సు నడుస్తుందని అంచనా! ఆమె శ్రమకు కొన్ని వేలు కట్టివ్వాలని మీడిమాండ్. అవునా! మీ ఆడవాళ్ళ ఆలోచనలు ఇలా ఉంటాయి కాబట్టే మగవాడు మిమ్మల్ని బానిసగా చూస్తున్నాడంటాను. అతడికి పిల్లల్ని కని....అన్నారు. అంటే ఏమిటి అర్థం! అతడికి ఉంపుడు కత్తె అనా అర్థం? భార్య భర్తకి పిల్లల్ని కనక ఇంకెవరికి కంటుంది? ఇంకెవరివల్ల మాతృత్వాన్ని పొందాలను కొంటుంది? తనకూ, తన పిల్లలకూ తన భర్తకూ చాకిరీ చేస్తూ, దానికి విలువ కట్టాలనడం - తనకు తను దాసినీ, ఉంపుడు కత్తెనూ చేసుకోవడమే కదా? మిమ్మల్ని మీరే అగౌరవపరుచుకొంటూ మగవాడు అగౌరవపరుస్తున్నాడని ఎందుకు అనుకోవడం?"

"భలే తమాషాగా మాట్లాడతారే! ఆడది మగవాడి సంపాదనమీద పడి తింటున్నందుకు అతడి చేత చులకన చేయబడుతుందని ఇందాక మీరే అన్నారు. ఊరికే తినడం లేదు. ఇంట్లో ఆమె చేసే చాకిరీకి విలువలేదా అని అడిగాను. దానికి మీరు ఎంత అసహ్యకరమైన అర్థాలు తీశారు. మగవాడి మీద మాటపడకుండా లాజిక్‌తో వాదించగలరు. వట్టి పురుషపక్షపాతులు! మీకు స్త్రీలంటే ఎక్కడ గౌరవముంటుంది?" చురుగ్గా అడిగింది శాలిని.

"ఇక్కడ!" తన గుండెల మీద తట్టి చూపి చిరునవ్వు నవ్వాడు శర్మ.

"అక్కడ స్త్రీలంటే ఎందుకూ పనికిరాని వాళ్ళన్న తేలిక భావం తప్ప ఇంకేం లేదు!" శాలిని విసురుగా లేచింది.


"మళ్ళీ అంటున్నానని కోప్పడకండి, శాలిని గారూ! మీరు, అంటే మీస్త్రీలు అటు సాంప్రదాయాలనుండి పూర్తిగా బయటపడనూ లేకుండా ఉన్నారు. ఇటు పూర్తిగా అభ్యుదయం వైపూ ఉండలేక పోతున్నారు. ప్రస్తుతం మీది కొట్టు మిట్టాడుతున్న పరిస్థితి. ఎవరో రచయిత్రి చెప్పినట్టు పల్లెటూరి స్త్రీని తెచ్చి మహానగరం మధ్య వదిలిపెట్టిన స్థితి. మగవాడి ఆధిపత్యం సహించని దశకు చేరుకోగలరే గాని మగవాడు, అంటే ఇక్కడ మగడిని అర్థం చెప్పుకొందాం. మీకంటే ఎక్కువ చదివినవాడుండాలి. మీకంటే కొంచెం పెద్ద ఉద్యోగం చేస్తూండాలి. ఆర్థికంగా మీకంటే ఓ మెట్టు పైనుండాలి. మీకంటే ఓజానెడు పొడువు, దృఢమైన వాడూ ఉండాలి. పురుషుడు అన్నిటా-మీకంటే ఓ మెట్టు పైనుండాలని, అధికుడు కావాలని కోరుకొంటూ, అతడి ఆధిపత్యాన్నిమాత్రం ఎందుకు సాహసించలేక పోతున్నారో నాకు చచ్చినా అర్థం కావడంలేదు!"

"తనకంటే ఓ మెట్టు పైనుండే ఆడది భార్య అయితే మీ మగవాళ్ళే ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో తన్నుకు చస్తారుకదా?" ఒళ్ళు మండినట్టుగా అడిగింది శాలిని.

"ప్రకృతే సృష్టించింది పురుషుడిని ఒక మెట్టుపైన స్త్రీకంటే. దాన్ని తలకిందులు చేయాలంటే ఇలాంటి వివరాలు తప్పవు మరి."

శర్మ మాటకే జయం అన్నట్టుగా బడి గంట కొట్టేశారు గణగణ మంటూ.

(సశేషం)



యువరచయితలకు కథగురించి...!

కాళీపట్నం రామారావు



కథల మాస్టారు కాళీపట్నం రామారావు మాస్టారు చివరగా రాసిన కథ 'కుట్ర' - 1972లో. మళ్ళీ యింత కాలానికి కలం పట్టారు. తెలుగు కథా సాహిత్యంతో తమకున్న 44 ఏళ్ళ అనుబంధాన్ని, అనుభవాన్ని రంగరించి 'కథల గురించి' నాలుగు విశ్లేషణాత్మక వ్యాసాలు రాస్తున్నారు. ఈ వ్యాసాలు యువరచయితలకేనని మాస్టారు అంటారు, కాని, అవి అందరు రచయితలకీ, పాఠకులకీ, సాహిత్యకారులకీ, ఉపయుక్తం కాగలవని మేము అనుకుంటూన్నాం. పూర్తయిన మొదటి వ్యాసాన్ని మొదటిసారిగా ప్రచురించ గలుగుతున్నందుకు జ్యోతి మహాద్భాగ్యంగా భావించి, గర్విస్తోంది.

కథను గూర్చిన జిజ్ఞాస నాకు యీనాటిది కాదు, దానిని గూర్చి ఒక అభిప్రాయానికి రావడానికి నాకు చాలా ఏళ్ళు పట్టింది.

కథమీద తెలుగులో దొరికేవి రెండే రెండు వ్యాస సంకలనాలు, చెదురు మదురుగా మరి కొన్ని వ్యాసాలు. ఇవి సొంతం చదివినా వీటినుండి నాకు కావలసిన భోగట్టా అంతా నేను తెలుసుకోలేకపోయాను. అవి ఆధారంగా, అవి కాక తెలిసిన వారివల్ల అప్పుడప్పుడూ తెలుసుకుంటూ వచ్చిన అభిప్రాయాలతో పాటు సుప్రసిద్ధమైన కథలను పదేపదే మననం చేసుకోవడం వల్ల కథను గూర్చిన నా సందేహాలు కొంతలో కొంత తీరుతున్నట్టనిపించింది-తదుపరి నాకు కొంత తెలిసినట్టనిపించింది.

కథంటే ఏమిటన్న ప్రశ్నపై ఇది యీనాటి నా అవగాహన.

నా అవగాహనలో గుణ దోష లోపాలను ఇతర పెద్దల సహాయంతో విశ్లేషించుకుని సరియైన అవగాహనకు రావలసిన పూచీ పాఠకులదేనని సవినయంగా మనవి.

ఇది నా అవగాహనే కాని నా సిద్ధాంతం కాదని యువ రచయితలు గుర్తుంచుకోవాలి.

* * *

ముప్ఫై మూడేళ్ళనాటి పాత ఆంధ్ర పత్రిక తెరిస్తే ఓ పేజీలో ఎడంవైపు పైభాగాన చిన్న అక్షరాల్లో 'కథ' అనీ, దాని క్రిందుగా పెద్ద అక్షరాల్లో రచన పేరూ, ఆ క్రింద రచయిత పేరూ కనిపించాయి అనుకుందాం.

మాట వరసకి రచనపేరు 'జరీఅంచు తెల్లచీర' - రచయిత పేరు రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారు.

ఆ పేర్లక్రింద మూడు నాలుగు పేజీలలో కొన్ని పేరాలుగా విడిపోయి చాలా చాలా విరామ చిహ్నాలమధ్య వేలకొద్దీ అచ్చక్షరాల సమూహం కనిపిస్తుంది.

ఆదేనా రావిశాస్త్రిగారి జరీఅంచు తెల్లచీర కథ!

స్థూలంగా వ్యవహరించేటప్పుడు దానిని అలానే వ్యవహరిస్తారు. నిజానికి ఆ స్థూలరూపం వెనక ఉండే ఇంకేదో దాన్ని అలా అనాలికదా?

ఎందుకనంటే - గురజాడ అన్న నాలుగు అక్షరాలు గురజాడ అప్పారావు పంతులుగారు కాదు.

కన్యాశుల్కం రాసిన, తెలుగు కథకు శ్రీకారం చుట్టిన, ముత్యాల సరాలు అందించిన మహాకవిని మన కళ్ళముందుంచడానికి ప్రయోక్త వాడిన సంకేతాలు - ఆ నాలుగు అక్షరాలూ.

అదేవిధంగా పై చెప్పిన అక్షర సముదాయం లేదా పదవాక్య సముదాయం మన మనోలోకంలో, కొన్ని బొమ్మల్నీ, ఆ బొమ్మల్లో కొన్ని బొమ్మలు పలికే పలుకుల్నీ, కొన్నింటినుంచి వచ్చే శబ్దాలనూ, కనిపించి వినిపించడానికి ఏర్పడిన సంకేత సమూహం. అంతేకాని ఆ సంకేత సమూహమే కథకాదు.

తద్వారా కనిపించే బొమ్మల్లో కొన్ని ఆ రచనలో పాత్రలు. మరికొన్ని ఆ పాత్రలమధ్య జరిగే సంఘటనలు, లేదా

ఏర్పడ్డ సన్నివేశాలు. ఇంకొన్ని ఆ సంఘటనలూ సన్నివేశాల చుట్టూ ఆ పాత్రల చుట్టూ ఉండే వాతావరణానికి భూమికకూ పాత్రల ఛహరాలకూ, చర్యలకూ సంబంధించినవి.

వినిపించే శబ్దాలలో కొన్ని స్థలాన్నీ, కాలాన్నీ, మరికొన్ని వాతావరణాన్నీ, పాత్రల కదలికల్నీ ప్రస్ఫుటం చేస్తాయి.

పాత్రలు పలికిన పలుకులు కూడా కొన్ని, వాటి మనోగత భావాలను మాత్రమే ధ్వనిస్తాయి. మరికొన్ని ఆ భావాలతోపాటు అప్పటి ఆ పాత్రల మనస్థితినీ లేదా ఆవేశాలనూ తెలియజేస్తాయి. కొన్నైతే వాటి స్వభావాన్నీ వాటిసంస్కారాన్నీ తెలియజేస్తాయి. ఇంకాకొన్ని పలుకులు పాత్రలకూ, సంఘటనలకూ సంబంధించిన వర్తమానంతోపాటు వాటి గతాన్నీ, భవిష్యత్తునూ అర్థం చేసుకోడానికి సాయపడతాయి.

వీటన్నింటినీ - ఎలా అర్థం చేసుకోవలసినవాటిని అలా అర్థం చేసుకుంటూ, అర్థం చేసుకున్న వాటిని వేటిస్థానంలో వాటిని అమర్చుకుంటూ, వ్యక్తమైన సమస్తాన్నీ క్రమ పరచుకోవడంవల్ల పాఠకుడికొక వృత్తాంతం తెలుస్తుంది.

ఆ వృత్తాంతాన్నే చాలామంది కథగా భావిస్తారు.

అయితే ఆ వృత్తాంతమేకథా?

అవునూ కాదూ అనుకునేముందు అలాంటి సందేహం ఎందుకు రావాలో చూద్దాం.

పట్టపగలు నగర మధ్యంలో ఓ రోడ్ ప్రమాదం జరిగింది. ఆ జరిగిందాన్ని మొదటినుండి తుదిదాకా చూసినవాళ్లు పది మంది ఉన్నారనుకుందాం.

దానికి సంబంధించిన మనోదృశ్యాలూ, వారి అవగాహనా అందుమీద వారి అభిప్రాయాలూ - యీ పదిమందివీ సరిపోలిస్తే ఫోటో కాపీలులా ఒక్కలాగే ఉంటాయా?

ఎందు కుండవూ?

ఇంద్రియ గ్రహణ శక్తుల్లో తరతమ భేదాల వల్లా తత్కాల మనస్థితుల్లో వారి వారి మధ్య ఉండే తేడాల వల్లా ఇంకా ఇతర కారణాలవల్లా ఒకరికి కనిపించినంతా యింకొకరికి కనిపించదు. లేదా వినిపించినంతే ఇంకొకరికి వినపించదు.

చూసిన దానినీ. విన్న దానినీ సమాచారంగా అనువదించుకోడంలోనూ అర్థం చేసుకోడంలోనూ తేడాలుంటాయి.

వారివారి స్వభావాలూ, లోకానుభవం, సంస్కారానికి సంబంధించిన విలువలూ, వాటివల్ల ఏర్పడే పాక్షికతలూ కారణంగా కూడా ఏకాభిప్రాయత ఏర్పడదు.

ఆటోవాడు కుడిపక్కగా తప్పుకోవడం వల్ల ఎదరగా వస్తున్న బస్సు డ్రైవరు వాడి కుడివైపుకి కొయ్యవలసి వచ్చిందని ఒకరనవచ్చు. అది కాదు ముందు బస్సుడ్రైవరు ఎటుగా వస్తున్నాడో తెలీకుండా రోడ్డుకి సెంటర్ చేసి స్పీడుగా వచ్చేస్తుంటే ఆటో వాడిస్థానంలో ఎవరున్నా తడబడతారని ఇంకొకరనవచ్చు.

గుద్దుకున్న బళ్ళవేగాల గురించీ, రోడ్ మీద స్థిరచరస్థితిలో ఉన్న ఇతర వాహనాల ప్రభావం గురించీ ఎవరెవరి ధోరణుల్లో వారు ఎంతకీ ఏకాభిప్రాయానికి రాలేరు.

ఈవిధంగా పదిమంది కళ్ళెదుట జరిగిన ఒక సంఘటన గురించి ఆయా కారణాల వల్ల పదిమందీ పలు విధాలుగా అభిప్రాయ పడ్డట్టే అచ్చులో ఉన్న జరీ అంచుపెల్లి చీరను చదివిన వారందరూ దానిని ఒకే విధంగా గ్రహించరు, వారి వారి పునర్నిర్మాణశక్తిని బట్టీ, వారి అవగాహన బట్టి వారి వారికి తెలియ వచ్చిన వృత్తాంతాలు, వాటిమధ్య తేడాలు ఎంత ఎక్కువ ఉందో అంతగానూ విభేదించవచ్చు.

కథల జాగుల గురించీ, వాటివల్ల వ్యక్తమయ్యే అంశాలమీదా మిత్రుల గోష్ఠుల్లోనూ అభిప్రాయవేదికలూ చర్చావ్యాసాల్లోనూ వాదోపవాదాలు చూడండి. అందరి ముఖాల్లోనూ లేదా గొంతుల్లోనూ వారివారి చిత్తశుద్ధి వ్యక్తమయ్యేచోట కూడా వారి మధ్య తీవ్రమైన భేదాభిప్రాయం చూస్తాం.

అయినప్పుడు అలా పాఠకులు చేసుకున్న పునర్నిర్మాణాలవల్ల వారి వారికి తెలియ వచ్చిన వృత్తాంతాలుగాని, ఆ పునర్నిర్మాణాలేకాని - వాటిల్లో ఏ ఒక్కటైనా అసలుకథ కాగలదా?

కానప్పుడు మరేది?

ముందుకుపోయి రచన అక్షరరూపం ధరించకముందు ఆకృతి చెందిన క్రమాన్ని పరిశీలిద్దాము.

చాలామంది పాఠకులు - లోగడే చెప్పినట్టు-కొందరు కొత్త రచయితలూ ఏమనుకుంటారంటే రచయితలందరూ ఎప్పుడో ఎక్కడో జరిగిన దానినే కాస్త అలా ఇలా మార్చి మంచి కథకు కావలసిన రూపులు దిద్ది కథగా రాస్తారనుకుంటారు.

ఈ ఊహ నిరాధారమైనది కాదు. అలా



అని పూర్తిగా నిజమూ కాదు.

వారాఊహకు రావడానికి వారు చదివిన కొందరు మంచి రచయితల రచనలు జీవితమంత సహజంగానూ కనిపించడం ఒక కారణం. వారెరిగిన స్థానిక రచయితలు వారికికూడా తెలిసిన సంఘటనల్నే లేదా వ్యక్తుల గురించే ఏదోవిధంగా కథలుగా రాసేయడం యింకోకారణం.

కానీ గొప్ప రచయితలెవ్వరూ జరిగిన సంఘటనలు తీసుకొని, ఎరిగిన వ్యక్తుల్ని పట్టుకొని కథలల్లరు. కథలో సన్నివేశాలకూ పాత్రలకూ రూపకల్పన చేసేటప్పుడు చూసిన సంఘటనల్నీ, ఎరిగిన వ్యక్తుల్నీ నమూనాలుగానో, ముడి సరుకుగానో ఉపయోగించుకోవచ్చుగాక! యథాతథంగా తీసుకొనిమాత్రం కథలు రాయరు.

కళకు సంబంధించి కావచ్చు, శాస్త్రానికో, వ్యక్తిగత విజయాలకో సంబంధించి కావచ్చు - ఇలా ఏదో ఒక లక్ష్యం ఉన్న ప్రతివారికీ ఈ భౌతిక ప్రపంచాన్నీ ఇక్కడ జీవితాన్నీ అర్థం చేసుకోవలసిన అగత్యం ఉంటుంది. ప్రయత్నపూర్వకంగానూ అప్రయత్నంగానూ కూడా తమ

చుట్టూ వుండే మనుష్యులూ పశుపక్ష్యాదులతోసహా ఆ చుట్టూ వుండే పరిసరాలనూ అక్కడ జరిగే సమస్త జీవవ్యాపారాన్నీ గమనించడం అలవాటవుతుంది.

జీవితాన్ని అర్థం చేసుకోవాలనే అర్థమైనదాన్నీ, అనుభూతులనూ ఇతరులతో పంచుకోవాలనీ కలం పట్టిన రచయితలు తక్కిన వారిమీద మరింత సునిశితంగాన్నూ పరిశీలనాత్మకంగానూ, వీటైనంత నిష్పక్షపాతంగానూ ఆరకం పరిశీలనకు అలవాటు పడతారు.

ఆ పరిశీలనలో, వారి హృదయాన్ని గాఢంగా తాకిన సన్నివేశాలూ, సంఘటనలూతోపాటు స్పృశించి జారిపోయినవీ, జీవితంలో దగ్గరగానూ దూరంగానూ తారసిల్లిన విశిష్ట వ్యక్తిత్వాలతోపాటు అంతగా పట్టించుకోనక్కరలేనివీ, వారి వారి జీవిత గాథలూ, ప్రవర్తనలూ ప్రత్యేకతలూ, ఏ చరిత్రలూ ప్రత్యేకతలూ లేని జనాలూ, జనారణ్యాలూ, నిర్జనారణ్యాలతో ప్రకృతీ, ప్రకృతీ మానవ లోకం భయంకరంగానూ, బీభత్సంగానూ మారినప్పటి దృశ్యాలూ, అవి ప్రశాంతంగానూ, ఆహ్లాదకరంగానూ దర్శనమిచ్చేటప్పటి వాటి సౌందర్యం, ప్రకృతిలోనూ, జీవితంలోనూ, మానవ సమాజాలలోనూ వచ్చిన, వస్తూ వున్న మార్పులూ – ఇలా ఎన్నింటివో ముద్రలు వాళ్ళ జ్ఞాపకాలలోకి చేరుకొని పేరుకొని ఉంటాయి.

ఎక్కడో ఏదో సన్నివేశం లేదా ఒక సంఘటన ఒక వ్యక్తి లేదా ఒక వ్యక్తిత్వం ఒక కాంక్ష లేదా ఒక ఆంక్ష – (ఇలాంటి దేదో ఒకటి) రచయితని ఆవేశ పరచినప్పుడు అతడు చప్పున సావధానుడవుతాడు.

అసావధాన స్థితిలో అతనిని ఆవేశపరచిన అంశం కేంద్రంగా అతని తలపోత ఆరంభమవుతుంది.

అప్పుడా అంశానికి సంబంధించి అతనిలో పేరుకొని ఉన్న జ్ఞాపకాలు, సమాచారాలు ఒకటొకటే కదిలి, అంశాన్ని సాంగోపాంగంగా ఆవరించి, దానిని సాకల్యంగా పరిశీలించేందుకు ఉపయోగపడతాయి.

అలా తలపోత కొచ్చిన విషయం నుండి మనిషి నైజానికో, సామాజిక జీవితానికో, సృష్టిస్వభావానికో, ప్రకృతి నిర్మితాలూ, మానవ నిర్మితాలూ అయిన వ్యవస్థలకో – ఇలా దేనికో ఒకదానికి సంబంధించిన ఒక నూతన సత్యం లేదా వాస్తవం రచయితకు వ్యక్తమయితే ఆ తలపోత సఫలమై తత్ఫలితంగా ఒక రచనకు తొలిరూపు ఏర్పడుతుంది. కాకపోతే ఆతలపోత అందుకు సంబంధించిన సమస్తం ఘనీభవించి మళ్ళా జ్ఞాపకాల్లోకి చేరిపోవడమో లేదా వాని నుండి జారిపోవడమో జరుగుతుంది.

తలపోతను సఫలం చేయగలిగిన వాస్తవం ఇంతకు ముందు ఇతరులెవ్వరూ చెప్పని నూతన వాస్తవమే కానక్కరలేదు. రచయితకు కొత్తదైతే చాలు – దానిని అతడు నూతన వాస్తవంగానే గ్రహిస్తాడు.

ఆవాస్తవాన్ని గుర్తించి గ్రహించడానికి రచయితలు చేసే తలపోత కొందరిలో కొన్ని గంటలనుండి కొన్ని రోజులూ, నెలలూ, సంవత్సరాల వరకూ సాగవచ్చు. మరికొంతమంది తలపోతకు కొద్ది నిమిషాలే సరిపోవచ్చు.


జీవితంనుండేకాక ఇతరుల రచనల నుండి కూడా ఒకప్పుడు ప్రేరకం ప్రేరణ పొందవచ్చు. రాసినవారు తమకన్న పెద్దలో, సమలో లేదా చిన్నలైనా కావచ్చు. వారు ఎవరైనా – వారిది ఒక పాత్రో దాని ప్రవర్తనో, ఒక సంఘటనను వారు నిర్వహించిన తీరో లేక నిర్వహించలేక పోయినతీరో లేదా రచయిత చేసిన ఒక (సు)భాషితమో – ఇలా ఆ రచననుండి ఏదో ఒక అంశం దానిని చదివిన రచయితకు ప్రేరణ కావచ్చు.

ప్రేరణ సహజమైనా కృత్రిమమైనా ఒక వాస్తవం ఏర్పడితే అది ఒక రచనకు దారి తీస్తుంది. రచయిత నేర్చిన మేరకు అది కథో, కవితో, నవలో నాటకమో అవుతుంది.

అదికథే అయితే ప్రేరకమైన అంశం ఆ కథకు బీజం. జ్ఞాపకాలలో నిక్షిప్తమై, అది కలిగించిన సంవేదనవల్ల ప్రేరితమైన తత్సంబంధిత అంశాలు దానికి ఆకృతి ఇవ్వబోయే ప్రమేయాలు. ఈ అతర్క్యపూర్వ ప్రమేయాల సంయోగాన్ని నిర్వహించి పర్యవసాయిగా ఒకవాస్తవం ఆవిష్కరణకు కారణభూతమైన వేదన దాని చైతన్యం. పర్యవసాయియైన వాస్తవం దాని అంతఃచేతన/వ్యక్తిత్వం.


అలా సర్వాంగీణమైన సజీవమైన కథ అంతరంగంలో పొడసూపగానే రచయిత ఒక అపూర్వమైన ఉద్వేగానికి గురి అవుతాడు. సృజనకు సంబంధించిన అతని శక్తులు మరింత వ్యగ్రమవుతాయి.

ఆదిన ఆవేశపరచిన ప్రమేయం నుండిగాని – వాస్తవాన్ని గుర్తించడంలో



ఉపయోగపడిన సంఘటనలూ, అందలి వ్యక్తులనుండిగాని కొన్ని పాత్రలతో కూడిన ఒక చిన్న సంఘటన కథయొక్క తొలిరూపం కనిపిస్తుంది. కథకు కారణభూతమైన ఆవేదననూ, దాని పర్యవసాయిమైన వాస్తవాన్ని సొంతంగానూ, సాకల్యంగానూ ఆవిష్కరించగల స్థితికి కథ వృద్ధిపొందాలి.

జాగృతమైన సృజనశక్తుల ప్రభావం వల్ల తన జ్ఞాపకాలలో పదిలపడి ఉన్న వ్యక్తులూ, సంఘటనలూ సన్నివేశాల నుండి కథ అవసరానికి అనువైన పాత్రలూ, సంఘటనలూ బయటపడి కథను చేరి పరిపుష్టం చేస్తుంటే సాక్షీభూతుడుగా ఉండే రచయితలో యీచర్య ఆనందోత్సాహాలను కలిగిస్తుంది. చేరిన రసపదార్థాలనుండి పుట్టగల రసానుభూతుల తొలి స్పర్శలు అతనిని మరింత ఉద్వేగిని చేస్తాయి. రచయిత యొక్క సృజనశక్తుల పరిమితులకు లోబడి ఆ కథా పరిణామం బలంగానో, దుర్బలంగానో, నిర్దుష్టంగానో, కొన్ని లోపాలతోనో తొందరగానో ఆలస్యంగానో ఒక



ముగింపుకి వస్తుంది.

ఆ తరవాత మాత్రమే కథతో రచయిత ప్రత్యక్ష ప్రమేయం ఆరంభ మవుతుంది!

ఆ ప్రమేయం ముందుగా కథాబలాన్నీ సామర్థ్యాన్నీ ప్రశ్నించుకోడంతో మొదలవుతుంది. లోపాలున్నట్టు కనిపిస్తే పాత్రల్లోనూ, సంఘటనల్లోనూ అవసరమైన మార్పులూ, చేర్పులూ, తొలగింపులూ చేసి రచయితే దానిని చక్కబరచుకొంటాడు. కొత్తవారూ, ఆత్మవిశ్వాసం చాలనివారూ యితరుల సహాయం తీసుకోవచ్చు.

రచయిత తన మనో ప్రపంచంలో ఆ విధంగా స్థిరపడ్డ కథకు ఆ తరవాత అక్షరరూపం ఇవ్వడానికి కూర్చుంటాడు.

ఎన్నుకొన్న పాత్రలకు స్వభావానుగుణ్యమైన రూపురేఖలూ, నామకరణాలూ ఏర్పడగా నిర్ణీత స్థలకాలాల్లో ఏర్పాటైన సన్నివేశాలలో, సంఘటనల్లో ప్రవేశిస్తూ ఆ పాత్రలు ఈ దశలో జీవం పొంది తమ కార్యకలాపాలు ఆరంభిస్తాయి. అవి చేసే చేష్టలనూ, చర్యలనూ, పరస్పరం ఘర్షించే తీరునీ, అప్పటి వాటి సంభాషణల్నీ, ఆవేశాల - పరిణామాలనీ - గమనిస్తూనే నేరొకవంక, సహజమైనదే కాక నిర్దిష్టమైన ఒక ముగింపుకేసి వాటి కదలికలను పర్యవేక్షిస్తుంటాడు రచయిత. అదే సమయంలో మొత్తం కథను అక్షర సంకేతాలుగా రాసుకుంటాడు.

అంతవరకూ ద్రవస్థితిలో ఉన్నకథ ఆ విధంగా ఘనీభవిస్తుంది.

శిల్పి శిలనుండి శిల్పం కానిదంతా తొలగించినట్టు ఆ ఘనాకృతినుండి కథ కానిదంతా విడిచి పెట్టి సాకల్యమూ, సర్వాంగీణమైన కథను మాత్రమే చూస్తూ రచయిత, అందలి దృశ్యాలనూ, శబ్దాలనూ, అవి కలిగించగల అనుభూతులనూ తానెరిగిన భాషలో పలుకులుగా అనువదించి, ఆ అనువదితాలను అక్షర సంకేతాలుగా శుద్ధప్రతిలో ఉంచుతాడు.

కథ పుట్టి యీ విధంగా నాలుగు దశలలో అక్షర రూపానికి మారుతుంది.

రచయిత మనోలోకంలో అప్పుడప్పుడే ప్రాణం పోసుకొని అతనిని ఉద్వేగపరచిన అంకుర మాత్ర రూపం కథ యొక్క తొలిదశ.

ఉద్వేగితాలైన అతని సృజన శక్తులనూ, అతని జ్ఞాపక భాండాగారంలోని జీవిత సామగ్రినీ వినియోగించుకొని సాకారతకూ, సాకల్యతకూ అభివృద్ధి చెందినది కథయొక్క రెండవదశ.

ఆకారం చెందిన కథ అక్షరరూపంలో ఘనీభవించగా ఏర్పడ్డ మూర్తి కథ యొక్క మూడవదశ.

అందుండి పాఠకులకోసం సిద్ధంచేసిన శుద్ధప్రతిలో కథ దాని నాల్గవదశ.

పాఠకులు తమ అవగాహన మేరకు శక్తి మేరకు పునర్నిర్మించుకున్నప్పటి పరిసుగార్చి లోగడే చెప్పుకున్నాం.

ఈ ఐదు దశలలో అసలు కథ ఏది?

అంటే పరిశీలకులు ఏ దశలో కథను ప్రధానమైన దానిగా తీసుకోవాలి ?

నాకు బాగా గుర్తులేదు.

చదువుసరోజుల్లో 'అహం' (గర్వం వంటిది కాదు, నేను. శ్రీశ్రీగారి 'ఐ') గురించి కాదోలు చెపుతూ (లేదా ఆత్మ) మా మాస్టారు దానిని దాదాపు ఇలా వివరించారు.

నేను అన్నది నే వేసుకున్న యీ ఖద్దరు లాల్చీ, ఖాదీ పంచె, కాళ్ళ చెప్పులూనా ? మీ ఇంగ్లీషు మాస్టార్లా నేనూ సూటూ, బూటూ తొడిగి వచ్చాననుకోండి. నేను కాకుండా పోతానా ? తెలుగులోకాక ఇంగ్లీషులో మాట్లాడినా నేను నేనే.

అంటే - నా వేషభాషలు నేనుకాదు.

అలానే యీ చామనచాయ తోలూ, నల్లజుత్తూ, మొహం కోలన, శరీరం పలచనా నేను కాదు. బొల్లిరోగం వచ్చి చర్మం రంగూ, పైత్యం ప్రకోపించి జుత్తు రంగూ మారిపోవచ్చు. తత్వం ఫిరాయించి ఊరపందిలా బలిసిపోతే అర్నెల్లయ్యేసరికి నన్నుకన్న నాతల్లే నన్ను పోల్చుకోలేక పోవచ్చు. మారింది నా రూపు కాని నేను కాను.

అంటే నా రూపం, నా చహరా నేను కాదు.

మరి యీ ఎముకలూ, మాంసాలతో కూడుకున్న - కాళ్లూ, చేతులూ, కన్నూ, ముక్కూ అంగాలుగా కలిగిన ఈ శరీరమా నేను ? ప్రమాదానికి గురి అయ్యో, శస్త్రచికిత్స అవసరమయ్యో,



అంగాలలో కొన్నిగాని, అన్నిగాని తొలగిపోయినా నేను నేనే. ఈ రక్తం తోడేసి (ఈ వాక్యం ఒక్కటీ మా గురువుగారిది కాదు) ఇంకొకరి రక్తం నా శరీరంలో ప్రవహింప జేసినా నా శరీరంలో కండరాలూ, గుండెకాయా, కిడ్నీలు ఇతరుల వాటితో మార్చినా, ఎముకల స్థానంలో స్టీలు నమూనాలు అమర్చినా నేను నేనే.

కాబట్టి నా శరీరాంగాలు నేనుకాదు.

నేనీ రాత్రికి రాత్రీ మీకళ్ళకు కనబడకండా పోయాననుకోండి. అదే - నాశరీరం - పంచత్వం - పంచభూతాలలో కలిసిందనుకోండి. రేపు నాగురించి నా మంచి-చెడ్డల గురించి మాట్లాడరా ? నేను మీపైనెరపిన, నెరపుతున్నదుష్ప్రభావమో, సత్ప్రభావమో కొనసాగదా ? మీరు చెప్పుకునేది యీనా శరీరం గురించా ? ఈ శరీర ధారినైన నాగురించా ? ప్రభావంనెరపేది ఈశరీరమా ? శరీరధారా ?

కాబట్టి ఈశరీరం కూడా నేను కాదు.

ఇది నేను యొక్క నాశరీరం. ఇవి నేను యొక్క నా శరీరాంగాలు. ఇది నా రూపు. ఇది నా వేషం. ఇది నా భాష, ఇందులో ఏ ఒక్కటీ గాని అన్నీ గాని,



కానటువంటి - వీటన్నింటినీ కలిగున్నటు వంటి - ఆనేను - అదీ అహం !

—అంటూ అహం అనో, అత్మ అనో దాని గురించి ఇంకా ఏవో చాలా చాలా చెప్పేరు.

దాని గురించి కాదుగాని, అసలు కథ ఏదీ అన్న వెతుకులాటలో పైపద్ధతి నను సరించి అసికాని దేదో తేల్చుకుంటే అదే దో తెలియ వచ్చు అనిపించి పైదంతా చెప్పేను.

లోగడే చెప్పుకున్నాం - పాఠకుడు పునర్నిర్మించుకున్న కథ అసలు కథ కాలేదు. నాల్గవ దశలో రచయిత అందించిన కథకు అదిప్రతిబింబం. ప్రతిబింబం మాత్రమే.

నాల్గవ దశలో కథ మూడవ దశ కథకు మెరుగు పెట్టగా ఏర్పడ్డది. అది మెరుగైన రూపాంతరం.

మూడవ దశలో కథైనా రెండవ దశలో కథను వాక్యాలుగా పదబంధాలుగా అనువదించి భాషా వాహనం ద్వారా పాఠకునికి అందించే ప్రయత్నంగా తయారైనది. ఉక్తి వైచిత్రి, దేశుడికారం, శబ్దమాధుర్యం వంటి అలంకారాలూ తొడుగులతో దర్శన మిచ్చేది. వాటిని పరిహరించి చూడవచ్చు. అయినా అది అనువదిత రూపం. మూలం ఉండగా అనువదితం అసలు కాలేదు.

అలా అయితే రెండవ దశలో కథ అసలు కథ కావాలి.

కాని అదైనా తొలిదశలో అంకుర రూపంలో కనిపించిన కథ సవివరంగా పెరిగి ధరించిన స్థూలరూపం. పైగా బద పదశలో కథ పాఠకుని పరిమితులకు లోబడి రూపుదాల్చినట్టు, రెండవ దశలో కథ పాఠకుని సృజన శక్తులూ, జీవితానుభవాలపై ఆధారపడి రూపొందుతుంది.

అందుచేత తొలిదశలో అంకురరూపంలో రచయితకు కనిపించిన కథే అసలు కథ అవుతుంది.

అది సూత్రం తదితరమైన దేనితోనూ సంబంధంలేని ఎవరికీ చెందని విడిగా అస్తిత్వం కల ప్రమేయమా ?

రచయితని అపేక్షించని కథ అంకురరూపంలోనైనా ఉండలేదు. కాని తక్కిన దశలలో కథతో పోలిస్తే దాని లో రచయిత ప్రమేయం ఉన్నంతగా దీనిలో ఉండదు.

రచయితకు ప్రేరణ నిచ్చే అంశం బాహ్యప్రపంచం నుండి వస్తుంది. ప్రేరణ వల్ల సంచలితమయ్యే ప్రమేయం కూడా బాహ్యప్రపంచానికి చెంది రచయిత అంత రంగంలో పదిల పడినజ్ఞానం. ఈ రెండిటి సంయోగాన్ని నిర్వహించిన వేదనా, అందుండి ఏర్పడే వాత్సల్యం కూడా అతనికే పరిమితమైనవి కావు. కావు కాబట్టే వానిని పంచుకోడానికి కథ పుట్టడం, తద్వారా పంచుకోగలగడం.

కథాసృష్టిలో తొలిదశ/ కథగురించీ, దాని విశిష్టతగురించీ, ఆయాదశల్లో దాని పరిణామం గురించీ తెలియవలసినంత తెలియకపోవడంవల్లే లేదా వాటిపట్ల ఉంచవలసినంత శ్రద్ధ ఉంచకపోవడంవల్లే మంచి కథలు సగంలో ఆగిపోవడం, రాయగలవారినుండికూడా మంచి కథలు రాకుండా పోవడం, కథల అభాసలు కథలై మంచి కథలు కథలు కాకుండా పోవడం వంటి నష్టాలు చూస్తాము.


జీవమున్న ప్రతి కథలోనూ జీవ సహజమైన పెనుగులాట ఏదో ఒకస్థాయిలో ఉంటుంది. ఆ పెనకువ దేని గురించి ? ఎవరెవరిమధ్య లేదా ఏ ఏ శక్తులమధ్య ? ఒకే వ్యక్తిలో అయితే ఏ ఆశయాలు, ఏ కోరికలమధ్య ? ఏ స్వభావాలు, ఏ ఆదర్శాలమధ్య ? రెండూ కోరికలే అయితే ఏ ఏ కోరికలమధ్య ఏ లక్ష్యం కోసం ? ఇలా ఓ కథ పుట్టుకకూ, దాని పెంపునకూ, పర్యవసానంగా ముగింపుకీ కారణాలయ్యే వైరుధ్యాలు అంకురరూపం లో కథ ఏర్పడినప్పుడే అందులో ఇమిడి ఉంటాయి. ఆ దశలోనే ఆయావైరుధ్యా



లను గుర్తించవచ్చని ఎరిగితే, కనీసం రెండోదశలోనైనా గుర్తించ గలిగితే, కథస్పష్టంగా, నిర్దుష్టంగా తయారవడంలో రచయితవల్ల పొరపాట్లు జరగవు.

మంచి కథలు రాసేవారందరూ ఈ విషయాలను తెలిసుంటారు. విశ్లేషణవల్ల కాకపోయిన సద్యస్స్ఫురణ లేదా ఇంట్యూషన్ వల్ల వారా ఎరుకను కలిగుంటారు.

ఈ విధంగా సర్వ జీవరాసుల పుట్టుకా ఏ క్రమంలో సాగుతుందో అదేక్రమంలో ఒక కథకూడా పుట్టినప్పుడు, ఆ సజీవ కథనే సృజనాత్మక కథ అనవచ్చనీ, అంటారనీ నేననుకుంటాను. *



యుగాంతపు శంఖం

సీరియల్

1990 సంవత్సరం

1990 సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించినంత వరకూ చారిత్రాత్మకమయిన సంవత్సరంగా పేర్కొనవచ్చు

రెండు ప్రాంతీయ పార్టీలు పోటీకి తలపడి, జాతీయ పార్టీని నన్నటిని కనుచూపు మేరలో లేకుండా తరిమి కొట్టినయ్.

తెలుగుదేశం, తెలుగుభారతి పార్టీలు ఆ ఎన్నికలను చావు బ్రతుకుల సమస్యగా భావించి చాల పెద్ద ఎత్తున పోరాటం సాగించినయ్.

బ్రాంది, విస్కీ, కల్లు, సారాలు ఆంధ్రప్రదేశ్ అంతటా మహానదుల్లా ప్రవహించినవి. వీధివీధికీ ఎన్.టి.ఆర్. సినిమాలు, కృష్ణమోహన్ సినిమాలు - నడిరోడ్డున ప్రదర్శించారు, వాళ్ళ ఉపన్యాసాలున్న కాసెట్స్‌ని ఇంటింటికీ పంచారు. హరిజనులనూ, ఇతర వెనుక బడిన కులాలనూ రెండు పార్టీలవారూ నెత్తిన పెట్టుకుని ఊరేగించారు. వాళ్ళకి అప్పటికప్పుడు ఇళ్ళు కట్టించారు. బోర్‌వెల్ తవ్వించారు. అంటరానితనం అనేది ఆరోజుల్లో కనిపించకుండా పోయింది.

ఈ రెండు పార్టీల హోరులో చాలామంది కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీని వదిలివేసి ఏదో ఒక ప్రాంతీయ పార్టీలో చేరిపోయారు.

ఈ పరిస్థితి సిద్ధార్థకు భయం కలిగించింది. తను కాంగ్రెస్ పార్టీని పెట్టుకు వేలాడటం మంచిదా, కాదా అని రాత్రింబగళ్ళు ఆలోచించసాగాడతను.

జరిగినకథ:-

సిద్ధార్థ నీతిని నమ్ముకున్న రాజకీయ నాయకుని కొడుకు. తండ్రిలా కాక అవినీతి ద్వారానయినా సరే ముఖ్యమంత్రి అవాలన్న ఆశయంతో జీవితం ప్రారంభించాడు.

రాజకీయ వర్గాల్లో విపరీతమయిన పలుకుబడిగల భారతీదేవి తన కంటె చిన్న వయసులో ఉన్న సిద్ధార్థ వేపు ఆకర్షితురాలయి సర్వం సమర్పించుకుంది. అతని ధ్యేయానికి తోడ్పడాలని నిర్ణయించుకుంది.

జమిందారు వంశంలో పుట్టిన గజపతిరాజా, తండ్రిని ఎన్నికల రంగం నుంచి విరమింప జేసి తను కాంగ్రెస్ పార్టీలో చేరి పోయాడు.

అతను మోసం చేద్దామనుకున్న పూర్ణ అతని మెడకు గుదిబండయింది. ముఖ్యమంత్రి అవాలన్న అతని కోరికకు పరిపూర్ణ సహకారం అందిస్తూన్న పూర్ణకు మరో వ్యక్తితో సంబంధం ఉందని తెలిసి ఆమెను పుట్టింటికి గెంటి వేశాడు.

1977 ఎన్నికలు అతనికి నిరుత్సాహాన్ని కలిగించినయ్.

మరోవేపు 'ఆంధ్రదేశం' దినపత్రిక రామవర్మ తన పత్రికను నిజాయితీగా నడిపితే నిలబడదని కష్టమని బ్లాక్ మెయిలింగ్ మొదలు పెట్టాడు. అదిచాలా లాభదాయకంగా పరిణమించి చివరకు పార్లమెంట్ మెంబర్‌గా అయ్యాడు. తన స్నేహితుడితో కలసి అనుభవిస్తున్న అమ్మాయినే భార్యగా చేసుకోవాల్సి వచ్చిందతనికి!

జయలక్ష్మి తెలంగాణా పోరాటంలో తండ్రినీ, తల్లినీ పోగొట్టుకుని కమ్యూనిస్ట్ పార్టీతరపున రాజకీయాల్లోకి దిగింది. డాక్టర్ విష్ణు ఆమెను పెళ్ళి చేసుకున్నాడుగాని ఓ వింత కోరిక కోరాడు.

గజపతిరాజాకు కాబరే డాన్సర్ "ప్రమోద"తో పరిచయమయ్యింది. ఆమెను కోరగా తిరస్కరించి బెదిరించింది. సిద్ధార్థ మంత్రి అయ్యాడు. ఎన్నికలలో గజపతిరాజా తనకు పోటీ అభ్యర్థిని హత్య చేయించి ఎన్నిక వాయిదా వేయిస్తాడు.

ఎన్నికలలో తెలుగు దేశం ఘనవిజయం సాధించింది. సిద్ధార్థ తన కొడుకును రాజకీయాలలో చేర్చాలని నిర్ణయించుకొంటాడు. భారతీదేవి చెప్పినట్లు ఎన్టీఆర్ గద్దెదిగి, నాదెండ్ల ముఖ్యమంత్రి అయ్యాడు. మధ్యంతర ఎన్నికలు జరిగాయి ఈ సారి సిద్ధార్థ గెలిచాడు.

రామవర్మ పత్రిక 'ఆంధ్రదేశం' తెలుగుదేశం ప్రభుత్వానికి మద్దతుగా ప్రచారం చేస్తుంది. ఆ పార్టీ విజయం సాధించడంతో అతనికి పట్టపగ్గాలు లేకుండాపోయి, తన కార్యక్రమాలు ప్రారంభించాడు. అతని భార్య డ్రగ్స్‌కు అలవాటు పడింది. ఆమెకు పుట్టినింటికి ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సివచ్చింది. పోలీస్ ఎన్‌కౌంటర్‌లో డాక్టర్ విష్ణు మరణించాడు.

ప్రముఖ సినీనటుడు కృష్ణమోహన్. జయలక్ష్మి కలసి తెలుగుభారతి పార్టీ స్థాపిస్తారు. ఇంద్రకాంత్‌ను తిరిగిపిలిపిస్తుంది జయలక్ష్మి. గజపతిరాజా ప్రమోదను పెండ్లాడతాడు. అతను ప్ర.తె.దే. లో చేరి డిపాజిట్ కోల్పోయి మరీ ఓడిపోతాడు.

-ఇక చదవండి

రాబందుల రెక్కల చప్పుడు

భారతీదేవికూడా ఎటూ మాట్లాడలేని పరిస్థితిలో పడిపోయింది. ఆమెకు ఆ రాజకీయాలు ఊహకందకుండాపోయాయ్.

కాంగ్రెస్ పార్టీ మూడో స్థానానికి నెట్టివేయబడే సూచనలు కన్పిస్తోన్న కొద్దీ సిద్ధార్థలో ఆశలు దిగజారిపోసాగాయ్.

ఆ రోజు ఎన్నికల ప్రచారం నుంచి తిరిగి వచ్చేసరికి రాత్రి పన్నెండయిపోయింది. వైదేహి అతని కోసం ఎదురు చూస్తూ కూర్చునిఉంది.

ఇద్దరూ కలసి భోజనం చేయసాగారు.

"మీ కోసం భారతీదేవి ఫోన్ చేసింది - "అందామె.

"ఏమయినా న్యూస్ ఉందా ?"

"ఏమీ చెప్పలేదు. మీరురాగానే డయల్ చేయమంది -"

భోజనం ముగించాక సిద్ధార్థ ఆమెకు రింగ్ చేశాడు.

"హలో సిద్ధార్థా" ఆమె గొంతులో ఆత్రుత ధ్వనించింది.

"ఏమిటి - అర్జంటుగా మాట్లాడమన్నారట -"

"నువ్ మాట్లాడి రెండురోజులయేసరికి, చాలా లోన్లీగా అనిపించింది. నిన్న మొన్న ఎందుకు ఫోన్ చేయలేదు ?"

"ఇక్కడ పరిస్థితులేమీ బావుండలేదు భారతీ! నిన్న ఉన్న ట్రెండ్ ఇవాళ కనిపించటంలేదు. ఏటూ ఊహించడానికి వీల్లేకుండా ఉంది-" నిరాశగా అన్నాడతను. అతని గొంతులో చిందుతోన్న విషాదాన్ని గమనించిందామె. తనేదయినా భరించగలదుగానీ అతని ఓటమిని మాత్రం భరించలేదు. అతని ఓటమి తనకుకూడా ఓటమే! తను ఎంతోమందిని మంత్రులను చేసింది. మరెంతోమందికి మంత్రి పదవి దొరకకుండా చేసింది. తనవల్ల ఒకవ్యక్తి ముఖ్యమంత్రికూడా అయాడు. ఇంత చరిత్ర ఉండికూడా సిద్ధార్థ విషయంలో తను దారుణంగా విఫలమవుతోంది! ఎందుకని? మారిపోతున్న రాజకీయాలా ? జారిపోతూన్న విలువలా ?


"సిద్ధార్థా ! నువ్ నిరుత్సాహ పడకు ! ఈసారి నీకున్న అవకాశాలు మరెవరికీ లేవనిపిస్తోంది నాకు -"

"నాకానమ్మకం పోయింది భారతీ ! నేను గెలుస్తే గెలవ్వచ్చేమోగాని - పార్టీ గెలిచే నమ్మకం కనిపించటంలేదు. అంటే మరో అయిదేళ్ళు మామూలు ఎమ్మెల్యేగా జీవితం గడపాలన్నమాట - అయామ్ వెరీమచ్ డిప్రెస్డ్ భారతీ!! నాకేంచేయాలో అర్థం కావటంలేదు-"

భారతీదేవికి అతనిమీద విపరీతమయిన జాలి కలిగింది.

"ఇదే ఆఖరి ఎలక్షన్ అన్నట్లు మాట్లాడుతున్నావేమిటి ?" అడిగిందామె తెచ్చిపెట్టుకున్న నవ్వుతో.

"అవును భారతీ! నాకలాగే అనిపిస్తోంది. నలభై అయిదు సంవత్సరాల వయసయిపోయింది. మళ్ళీ ఎలక్షన్ అంటే యాభయ్యేళ్ళు-ఇప్పటి ఆసక్తీ, ఉత్సాహం



అన్నీ రాన్రాను తగ్గిపోవటంలేదూ ?"

ఆమె కొద్దిక్షణాలు మాట్లాడలేక పోయింది.

"సిద్ధార్థా ! నేను ఎన్నికలయేవరకూ నీతోనే ఉండటం మంచిదనుకుంటాను. లేపోతే నువ్వు రాజకీయ వైరాగ్యం పొందేట్లున్నావ్ -"

"నిజంగా వస్తారా ?" ఉత్సాహంగా అడిగాడతను.

"నువ్ రమ్మంటే !"

"మీరెప్పటికీ అతి సమీపంగా ఉండాలనిపిస్తుంది నాకు"

"థాంక్స్ ! రేపు మార్నింగ్‌కల్లా అతి సమీపంగా ఉంటాను. సరేనా ?" నవ్వుతూ అడిగిందామె.

"ఫ్లైట్లో వస్తున్నారా ?"

"ఊహు ! కార్లోనే !"

"అయితే ఇంటి దగ్గరే మీ కోసం వెయిట్ చేస్తూంటాను -" ఫోన్ డిస్కనెక్ట్ చేశాడతను.

మర్నాడు ఉదయం ఆమె వస్తున్న విషయం వైదేహితో చెప్పాడతను.

"ఆమె వస్తే మీకూ కొంత ప్రెజర్ తగ్గుతుందిలెండి -" అందామె. భారతీదేవి వస్తూనే ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేయించింది. రాత్రింబగళ్లుసిద్ధార్థతో పాటు తనూ ప్రచారానికి తిరగసాగింది.

ప్రచారం ఆఖరి రోజున డబ్బుతో ఓట్లుకొనే కార్యక్రమం ప్రారంభమయింది. బలహీనవర్గాల వాళ్ళుండే ఏరియాలను టోకున కొనడానికి అన్ని పార్టీలవాళ్ళూ ప్రయత్నాలు చేస్తున్నారు. అంచేత వాళ్ళ ధర పెరిగిపోయింది. వెయ్యి ఓట్లున్న లేబర్ కాలనీకి లక్ష రూపాయలు అడుగుతున్నారు. అదిగాక ఎన్నికల ముందురోజున ఆడా, మగా అందరికీ మేకలు సప్లయ్ చేయాలి.

వాళ్ళడిగినంత డబ్బు వెదజల్లి తిరిగి ఇంటి మొఖం పట్టేసరికి రాత్రి రెండు గంటలయింది.

"వాళ్ళు అన్ని పార్టీల దగ్గరా డబ్బు తీసుకుంటున్నారు - ఓట్లు ఎవరికేస్తారో తెలీదు - రాన్రాను మన పొలిటికల్ సిస్టమ్ ఇంకెంత అధోగతికి దిగజారిపోతోందో తెలీటంలేదు." నిస్పృహతో అన్నాడు సిద్ధార్థ,

"మన దేశంలోని డెమొక్రసీని "బెస్ట్ జోక్ ఆఫ్ ది వరల్డ్" గా చెప్పుకో వచ్చు. నిరక్షరాస్యత అక్షరాస్యతను పరిపాలిస్తుంది. పలభై శాతం ఓట్లు అరవై శాతం ఓట్లను పరిపాలిస్తాయ్ - అంచేత ఏంజరిగినా ఆశ్చర్య పోనక్ఖర్లేదు-" అంది భారతీదేవి,

ఇల్లు చేరుకున్నాక ఆమెతోపాటు మేడమీదకు నడిచాడతను. వైదేహి గాఢ నిద్రలో వుంది.

పిల్లలతోనూ, పగలంతా కోర్టు కేసులతోనూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే సమయం దొరకటం లేదామెకి !

"ఇంక రేపు నేను వెళ్ళిపోతాను " అంది భారతీదేవి ఫ్రిజ్‌లోనుంచి రెండు కూల్‌డ్రింక్స్ తీసి అతనికొకటి అందిస్తూ.

"మీరొచ్చాక టైమెలా గడచిపోయిందో తెలీనేలేదు-" అన్నాడతను.

"ఇలా-" అందామె అతని మెడచుట్టూ చేతులువేసి పెదాలమీద ముద్దుపెట్టు కుంటూ.

"ఇది మొదటిసారి - మనం ఇంత దగ్గరుండికూడా దూరంగా గడపటం -" అన్నాడతను ఆమెను పూర్తిగా తనకేసి హత్తుకుంటూ.

కొద్దిక్షణాల్లో ఇద్దరూ పూర్తి శారీరక మత్తులోకి విసిరేయబడ్డారు.

అడుపు తప్పుతోన్న అతని ఆవేశాన్ని గమనించి ఆతని కౌగిలి విడివడిందామె.

"మనం హాల్లో నుంచున్నామన్న విషయం మర్చిపోతున్నాం" అంది మృదువుగా.

అతను ఆమెను అమాంతం రెండుచేతుల్లో ఎత్తుకుని ఆమె గదిలోకి తీసుకెళ్ళాడతను.


"వైదేహి లేస్తుందేమో-" అనుమానంగా అందామె.

"ఊహు ! చాలా సౌండ్‌స్లీప్‌లో ఉంది -" అన్నాడు ఆమెలో ఐక్యం అయిపోతూ.

తెల్లారుజామున నాలుగున్నరకు అతనామె గదిలోనుంచి బయటికొస్తూంటే తన బెడ్‌రూమ్‌లోనుంచి లైటు వెలగటం కనిపించిందతనికి. కొద్దిక్షణాలు నిశ్చేష్టుడయి నిలబడి పోయాడక్కడే. గుండె వేగంగా కొట్టుకోసాగింది.

వైదేహికి నిద్ర మెలకువ వచ్చిందా ? తను గదిలో లేకపోవటం గమనించిందా? భారతీదేవి గది దగ్గరకొచ్చి తమ గుసగుసలు విందా ?

తమ ప్రణయం ఏదోకరోజు వైదేహికి తెలీక తప్పదని తెలుసుగానీ - ఇంత



త్వరగా బయట పడుతుందనుకోలేదు. ఇప్పుడు వైదేహినెలా ఫేస్ చేయటం?

తమ గదివేపు తడబడుతున్న అడుగులతో నడిచాడతను.

వైదేహి కుర్చీలో కూర్చుని 'లా' పుస్తకాలు చదువుతోంది. అతనికి అర్థమయి పోయింది. ఆమెకు అంతా తెలిసిపోయే వుంటుంది. ఇప్పుడిక ఆ విషయం మాట్లాడటం తప్ప మార్గంలేదు.

"నిద్రపోలేదా వైదేహీ ?" అడిగాడతను బట్టలు మార్చుకుంటూ.

"ఇంతకుముందే మెలకువ వచ్చింది. ఇంక నిద్రపట్టక బుక్స్ రిఫర్ చేస్తున్నాను -" అతనివంక చూడకుండానే సమాధానం ఇచ్చిందామె.

"నేను ఇంటికి రావటం నీకు తెలుసా ?" అడిగాడతను.

"నిద్రపోండి ! ఈ వారంరోజుల్నుంచీ బొత్తిగా నిద్రలేదుమీకు -" అందామె.

సిద్ధార్థ ఇంకేమీ మాట్లాడేందుకు అవకాశం దొరకలేదు.

నిశ్శబ్దంగా మంచంమీద పడుకున్నాడు. ఆమెకు తమ రహస్యం తెలిసిపోయింది. అందుకే తన ప్రశ్నకు సమాధానం ఇవ్వటంలేదు. ఆ విషయం చర్చించటం ఆమెకు ఇష్టం లేదన్నమాట.

తిరిగి మెలకువ వచ్చేసరికి ఉదయం తొమ్మిదయిపోయింది. మొఖం కడుక్కుని డైనింగ్ టేబుల్ దగ్గరకెళ్ళేసరికి వైదేహి ఫలహారం చేస్తోంది.

"భారతీదేవి ఇప్పుడే హైద్రాబాద్ వెళ్ళిపోయింది. మిమ్మల్ని నిద్రలేపవద్దని చెప్పింది-" అందామె చాలా మామూలుగా.

మర్నాడు ఉదయమే అతనితోపాటు పోలింగ్ పర్యవేక్షించడానికి బయల్దేరిందామె.

రిజల్ట్స్ అధికారపూర్వకంగా డిక్లేర్ చేసేసరికి ఉదయం ఆరు గంటలయింది. అప్పటికప్పుడే ఊరేగింపు ప్రారంభమయింది. అంతవరకూ రాష్ట్రంలోని మిగతా నియోజక వర్గాల ఫలితాల పట్ల ఆసక్తి చూపని సిద్దార్థ తన అనుచరులను అంతవరకూ వివిధ పార్టీలకు లభించిన స్థానాల గురించి అడిగాడు. వెంటనే వివరాలం

దించారువాళ్ళు.

తెలుగుదేశం : 107

తెలుగు భారతి : 90

కాంగ్రెస్ :78

మిగతా పార్టీల స్థానాలు రెండు సంఖ్యలు దేనికి రాలేదు.

సిద్ధార్థ మనసు ఆనందంతో పొంగి పోయింది. ఇప్పుడు కోయిలేషన్ ప్రభుత్వం ఏర్పడక తప్పదు. కాంగ్రెస్ పార్టీకి తనే నాయకత్వం వహించేందుకు కావలసిన ఏర్పాట్లన్నీ భారతీదేవి ముందే చేసేసింది. కనుక ఇదే తనకు అద్భుతమయిన అవకాశం! ముఖ్యమంత్రి అయేందుకు ఇంతకు మించిన అవకాశంరాదు. ఊరేగింపు పూర్తవకముందే భారతీదేవిని ఫోన్ మెసేజ్‌ని వైదేహి స్వయంగా తీసుకొచ్చింది కారు దగ్గరకు.

"మిమ్మల్ని ఉన్నపళాన హైద్రాబాద్ రమ్మంటోందామె. చాలా అత్యవసరమయిన సమావేశం ఉందిట." అప్పటి కప్పుడే హైద్రాబాద్ బయల్దేరాడు. మధ్యాహ్నం మూడుగంటలకల్లా భారతీదేవి ఇంటికి చేరుకున్నాడతను.

మేడమీద తన ఎ.సి. రూమ్‌లో కూర్చుని ఫోన్లో మాట్లాడుతోందామె అప్పుడు.

అమాంతం ఆమెను కౌగిలించుని ఫోన్లో మాట్లాడనీకుండా పెదాలమీద ముద్దు పెట్టుకున్నాడతను. ఆమె మొఖంలో చిరుకోపం కనిపించింది. పెనుగులాడి అతని తలను దూరంగా నెట్టిందామె.

"సిల్లీఫెలో - అవతల నేను హైకమాండ్‌తో మాట్లాడుతుంటే ఏమిటి మధ్యలో"అంది గాబరాగా.

"నువ్వు మీ హైకమాండ్‌తో మాట్లాడుతోంటే నేను నా హైకమాండ్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను తప్పేముంది ?" నవ్వుతూ అన్నాడతను.

ఆమె అతని నోటిని తనచేత్తో మూసివేసి మళ్ళీ మాట్లాడసాగింది.

ఆమె మాట్లాడుతూంటేనే విషయం అతనికి అర్థమయి పోయింది. తెలుగు భారతి పార్టీతో చేతులు కలిపి మంత్రివర్గం ఏర్పరచటానికి హైకమాండ్ అంగీకరించింది.

ఫోన్ డిస్కనెక్ట్ చేస్తూనే ఆమె శరీరమంతా ముద్దులతో ముంచెత్తాడతను.


"ఇవాళ రాత్రికి తెలుగు భారతి పార్టీ ప్రెసిడెంట్‌తోనూ, జయలక్ష్మితోనూ చర్చలు జరపాల్సి ఉందిమనం -" అందామె.

"అంటే వాళ్ళు మనతో కలవడానికి వప్పుకుంటున్నారా ?"

"ఆల్‌మోస్టాల్ వప్పుకున్నట్లే -"

"తెలుగుదేశం పార్టీకి బద్ధవిరోధిపార్టీ తెలుగు భారతి అని తెలుసుగానీ విరోధత్వంవల్ల వాళ్ళు మనవేపు మొగ్గుతారనుకోలేదు -"

"నీకింకో తమాషా తెలుసో తెలీదో - తెలుగుదేశం వాళ్ళుకూడా యింతకు



ముందే మన కేంద్ర పార్టీ ప్రెసిడెంట్‌తో మాట్లాడారట - మనతో చేతులు కలపడానికి సిద్ధంగా ఉన్నామని -"

"రియల్లీ వండర్‌ఫుల్ న్యూస్" అన్నాడు సిద్ధార్థ.

"ఇక్కడే మనం జాగ్రత్తగా మన కార్డ్స్ ఆడాల్సిఉంది. మన పార్టీకి ముఖ్యమంత్రి పదవి ఎవరిస్తామంటే వాళ్ళతోనే కలుస్తాం! లేకపోతే -" అంది భారతీదేవి.

రాత్రి ఎనిమిది గంటలకల్లా సమావేశానికి బయల్దేరారు వాళ్ళు.

సిద్ధార్థకు మనసంతా ఎగ్జయిమెంట్‌తో నిండిపోయింది. ఎంతో కాలం తర్వాత, ఎన్నో నిరాశ, నిస్పృహల తర్వాత ఇప్పుడు తనకలలు నిజమయే అవకాశం వస్తోంది. ఈ అవకాశాన్ని జారవిడుకుంటే మళ్ళో అవకాశం వస్తుందనే నమ్మకంలేదు. ఎంతో జాగ్రత్తగా డీల్ చేయాలి ఈ సమావేశాన్ని.

రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అప్పటికే మరి కొంత మంది సభ్యులతో సమావేశానికి చేరుకున్నాడు.

మరి కాసేపట్లో తెలుగుభారతి పార్టీకి చెందినకార్లు ఆరడజను వచ్చి కాంపౌండ్‌లో ఆగాయ్.

* * * *

గజపతిరాజు కారు దిగాడు. అతను కాంగ్రెస్ టికెట్ దొరక్కపోవడంతో తెలుగు భారతి టికెట్ మీద ఎన్నికయాడు.

ఆ సమావేశంలో ఏం జరుగబోతోందో అతనికి ముందే తెలుసు. జయలక్ష్మి ముఖ్యమంత్రి అయేందుకు కాంగ్రెస్ పార్టీ-వప్పుకుంటేనే వాళ్ళతో పొత్తు కుదుర్చుకుంటుందామె. కానీ జయలక్ష్మికి తెలీదు. తను తెలుగుభారతి పార్టీ తరఫున ఎన్నికయిన ఎమ్మెల్యేలు చాలామందిని కొనేశాడన్న విషయం. ఆ విషయం ఇప్పుడే బయట పెట్టటం తన కిష్టంలేదు. కాంగ్రెస్‌తో ఒక అంగీకారానికొచ్చాక అప్పుడు జయలక్ష్మి నెలా దెబ్బతీయాలో పథకం రూపొందించుకున్నాడు. లేకపోతే మొదటికే మోసం వచ్చే అవకాశం ఉంది.

రెండో కార్లోనుంచి జయలక్ష్మి, కృష్ణమోహన్ దిగారు. అందరికీ పరిచయాలు జరిగాక సమావేశం ప్రారంభమయింది.

తెలుగుభారతి, కాంగ్రెస్ పార్టీల్లో తెలుగుభారతి పార్టీ సంఖ్యాపరంగా పెద్దది గనుక తమ పార్టీతరపు నాయకుడే ముఖ్యమంత్రి అవటం సమంజసం అంటూ మాట్లాడాడు తెలుగుభారతి పార్టీ అధ్యక్షుడు కృష్ణమోహన్.

వెంటనే కాంగ్రెస్ పార్టీ తరపున సిద్ధార్థ మాట్లాడాడు.

ప్రస్తుతం తమరెండు పార్టీల ధ్యేయం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకుండా చూడటమేతప్ప, కనుక ముఖ్యమంత్రి ఏ పార్టీ వ్యక్తి ఉండాలా అనే విషయంలో ఎవరూ పట్టుదలలు చూపకూడదని వాదించాడతను.

సిద్ధార్థను చూస్తూనే గజపతిరాజా ఉలిక్కిపడ్డాడు.

సిద్ధార్థ కాంగ్రెస్‌లో ఒక వ్యక్తి మాత్రమే అనుకున్నాడుగానీ అతనే ఆ పార్టీకి నాయకుడయ్యాడన్న విషయం తనకు తెలీదు. ఇప్పుడసలు అతను ముఖ్యమంత్రి పదవిని తమ పార్టీకి వదులుతాడా లేదా అనే విషయంకూడా సందేహమే !

పూరా రెండు గంటలసేపు ముఖ్యమంత్రి పదవికోసం వాదోపవాదాలు జరిగాక సమావేశం ఏటూ తేలకుండా వాయిదా పడింది.

సిద్ధార్థ ఆలస్యం చేయలేదు. వాయిదాపడ్డ కాసేపట్లోనే తెలుగుదేశం పార్టీ నాయకత్వంతో ఫోన్లో సంభాషణ ప్రారంభించాడు. రెండు పార్టీల నాయకులూ రాత్రి గంటలకు సమావేశం జరపాలని నిర్ణయించుకున్నాడు. వెంటనే ఈవార్త తెలుగుభారతి నాయకులకు తన మనుష్యులద్వారా తెలిపే ఏర్పాట్లు చేశాడతను. ఆ వార్త తెలీటంతోనే జయలక్ష్మి, కృష్ణమోహన్ కలవరపడ్డారు.


"పోనీ ముఖ్యమంత్రి పదవి వదిలేద్దాం !" అంది జయలక్ష్మి.

గజపతిరాజా వెంటనే లేచి నిలబడి అందుకు తన అభ్యంతరం తెలియజేశాడు. ఎలాగయినా, ఎన్ని షరతులకయినా ఒప్పుకోవచ్చుగానీ ముఖ్యమంత్రి పదవిమాత్రం వదలటానికి వీల్లేదని పట్టుపట్టాడు. అప్పుడు తెలిసింది జయలక్ష్మికి తన పార్టీలోనే తనకు ప్రత్యర్థి ఉన్నాడని. అంతవరకూ ఆమెలోఉన్న ఉత్సాహం, ఆశలు అన్నీ దిగజారిపోయినయ్. అందరూ తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల సంభాషణల ఫలితాల కోసం వేచియున్నారు.

ఉదయం ఆరుగంటలయింది.

అంతవరకూ నిద్రలేకుండా సంభాషణలతోనే గడిచిపోయింది సిద్ధార్థకు. ఫలితంమాత్రం శూన్యం ! ముఖ్యమంత్రి పదవి విషయంలోనే చిక్కొచ్చిపడుతోంది అన్ని ప్లానులకూ. సిద్ధార్థలో అంతవరకూ ఉన్న ఆశలన్నీ అడియాసలయిపోయినయ్. తప్పకుండా తనది అనుకున్న ఈ అవకాశం చూస్తుండగానే చేజారిపోవటం భరించలేక పోతున్నాడతను.

లేచి నిర్లిప్తంగా ఫోన్‌దగ్గరకు నడిచాడు. భారతీదేవికూడా అతని పక్కనే



నిలబడివుంది. తెలుగుభారతి పార్టీ నాయకురాలు జయలక్ష్మికి ఫోన్ చేశాడతను. పాలిపోయిన మొఖంతో ఫోన్ అందుకుంది జయలక్ష్మి "హలో -" అంది చిరాకుగా.

"గుడ్‌మాణింగ్ జయలక్ష్మిగారూ-" అన్నాడు సిద్ధార్థ తన గొంతులో విషాదం కనిపించనీకుండా. "గుడ్‌మాణింగ్ !" అందామె పొడిగ్గా - ఆమెకు తెలుసు - అతను చెప్పబోయే విషయమేమిటో.

"తెలుగుదేశంతో కాంగ్రెస్ పార్టీకి పొత్తు కుదిరిందని చెప్తాడు."

ఆమె మనసంతా వ్యాకులతతో నిండిపోయింది. తనకిక ముఖ్యమంత్రి పదవి దొరకటం వల్ల పోనీ తను ఆపదవి వదులుకుని సిద్ధార్థకే అవకాశం ఇస్తే ?

అలాచేస్తే కనీసం తన పార్టీ అధికారంతో ఉంటుంది.

క్షణంలో నిర్ణయం తీసుకుందామె - ముఖ్యమంత్రి పదవి కాంగ్రెస్‌కే ఇవ్వాలని ఆమె నిర్ణయం చెప్పబోతుండగానే సిద్ధార్థ గొంతు వినిపించింది.

"జయలక్ష్మిగారూ ! ముఖ్యమంత్రి పదవి మీకే వదిలేస్తున్నాను. మిగతా వివరాలు కూడా మాట్లాడుకుంటే రేపే మీరు మంత్రి వర్గం ఏర్పాటు చేయవచ్చు -"

కొద్ది క్షణాలు ఆమె నోటి వెంబడి మాట రాలేదు. అది కలో నిజమో తెలీని పరిస్థితి.

"జయలక్ష్మిగారూ !" మళ్ళీ పిలిచాడతను.

అప్పుడు స్పృహలోకొచ్చిందామె. అమిత మయిన ఆనందంతో గుండె వేగంగా కొట్టుకుంది. ఇంత ఆకస్మాత్తుగా, అన్ని ప్రయత్నాలూ విఫల మయాయనుకున్న సమయంలో ఈ విజయం తనను వరిస్తుందనుకోలేదు.

"థాంక్యూ సిద్ధార్థగారూ !" అందామె.

ఆ క్షణంనుంచీ సంఘటనలు అతివేగంగా జరిగాయ్. మంత్రి వర్గం లిస్ట్ తయారు చేయటం, గవర్నర్‌ని కలుసుకోవటం, తనపార్టీ సభ్యులతో సమావేశం జరపటం - ఊపిరి పీల్చుకునేంత సమయం కూడా దొరకటంలేదామెకి. సిద్ధార్థ హోమ్ మినిస్టర్‌గానూ, గజపతిరాజా ఆర్థిక మంత్రిగానూ నిర్ణయించిందామె. లాల్

బహుదూర్ స్టేడియమ్‌లోనే ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు జరిగాయ్. పబ్లిక్ గార్డెన్ లోనూ, అసెంబ్లీ భవనం దగ్గరా, సెక్రటేరియట్ దగ్గరా - ఏ రోడ్ మీద చూసినా క్లోజ్‌డ్ సర్క్యూట్ టి.వి. లు ఏర్పాటు చేశారు.

జనసమూహంతో నిండి పోయాయ్. జయలక్ష్మికున్న కమ్యూనిస్ట్ బాక్‌గ్రౌండు వల్ల కూలినాలి చేసుకునే జనం వరదల్లా వచ్చిపడ్డారు.

తమ కోసం జయలక్ష్మి ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాలన్నీ ఆరోజు అధికారపూర్వకంగా ప్రకటనలు చేస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారందరూ.

జయలక్ష్మి ఉపన్యసించటం ప్రారంభమయింది.

"నా ప్రియాతి ప్రియమయిన తెలుగు ప్రజలకు నమస్సులు.

ఎన్నో సంవత్సరాల నుంచీ తెలుగు ప్రజలకు జరుగుతోన్న అన్యాయపు అధ్యాయం ఈ రోజుతో ముగిసింది. మాది సిసలయిన ప్రజల పార్టీ గనుక కేవలం ప్రజలకు మేలు కలిగే కార్యక్రమాలే చేపట్టటం జరుగుతుందని మనవి చేస్తున్నాను మాకు మానవత్వమే ముఖ్యం గనుక ప్రస్తుతం జంతువులా బ్రతుకుతున్న మనిషి ఇకనుంచి మనిషిలా బ్రతికేందుకు కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్నాను. ఆరునెల్లలోపల ప్రతి రోజూ కావలసినంత మంచి నీరు తెలుగు ప్రజలందరకూ అందిస్తామని సగర్వంగా వాగ్దానం చేస్తున్నాను -"


ఆ మాటతో ప్రజల్లో పెద్ద ఎత్తున కరతాళ ధ్వనులు మార్మోగాయ్.

ఒక్కొక్క వాగ్దానం చేస్తూంటే ప్రజలు ఆనందోత్సాహాలతో ఉవ్వెత్తున పొంగిపోతున్నారు.

"అయితే ఇందుకు ప్రతిఫలంగా నేను ప్రజలనుంచి కొన్ని త్యాగాలుకూడా ఆశిస్తున్నాను" అందామె అఖర్లో.

అంతా నిశ్శబ్దమైపోయారు.

"మనదేశంలో ఇన్ని సంవత్సరాలుగా నడుస్తోన్న గుడ్డి పరిపాలనను నేను గుడ్డిగా అనుకరించ దల్చుకోలేదు. ప్రజలకూ, ప్రభుత్వానికీ, రాజకీయ నాయకులకూ అందరికీ తెలుసు - మన దేశాన్ని పట్టి పీడిస్తోన్న దరిద్రానికి ముఖ్య కారణమేమిటో! అది అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతూన్న జనాభా! రోడ్డుమీద అడుక్కుంటూ తిరిగేవాడిక్కూడా అరడజనుమంది పిల్లలుండడం మనందరికీ కనిపించే దృశ్యమే! వందమందికి ఇళ్ళు కట్టివ్వాలని ప్రభుత్వం నిశ్చయించుకుని, కట్టటం ప్రారంభించే సమయానికే ఆ వందమందికాస్తా వెయ్యిమంది అయిపోతున్నారు. పదిలక్షలమందికోసం మంచినీళ్ళ పథకం ఏర్పాటుచేస్తే, అది పూర్తయేనాటికి జనాభా ఇరవై లక్షలు అయిపోతోంది. కనుక ఇద్దరు పిల్లలున్న కుటుంబానికి కొన్ని రాయితీలు నేను ప్రకటిస్తున్నాను. ఆ కుటుంబానికి కిలోబియ్యం ఒక్కరూపాయకే దొరుకుతాయ్! ఆ పిల్లలిద్దరికీ ఉచితంగా చదువు చెప్పిస్తుంది ప్రభుత్వం! ఆ పిల్లలకు బట్టలు కుట్టిస్తుంది. ఆ పిల్లలకు ఉచిత వైద్య సదుపాయం ఏర్పాటు చేస్తుంది. ఉచిత ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాటు



చేస్తుంది. ఇవన్నీ కాక స్టయిఫెండ్‌కూడా ఇస్తుంది. కాని ఇవన్నీ మూడోపాప పుట్టకపోతేనే, ఎవరయినా మూడోపాపను కన్నారంటే, ఆ మరుక్షణమే వాళ్ళకున్న ఈ రాయితీలన్నీ రద్దవుతాయ్. అంతేకాదు! మూడోపాపమీద ప్రత్యేకమయిన టాక్సు కూడా విధించబడుతుంది "

గజపతిరాజా ఎంతో ఆనందంగా వింటున్నాడామె మాటలు. ఆమె చెప్పినవన్నీ చేస్తే తన మార్గం మరింత సుగమమవుతుంది. ఈ ఫామిలీప్లానింగ్ విషయంలో, మతంపిచ్చి ఉన్నవాళ్ళను రెచ్చగొట్టి, ఆందోళనలు లేవదీయించి ఆమె పాప్యులారిటీని నాశనం చేయవచ్చు.

రాత్రింబగళ్ళు తను చేస్తున్న వాగ్దానాలను తు.చ. తప్పకుండా అమలు జరిగేట్లు శ్రమించసాగిందామె. విద్యాధికుల్లోనూ, అట్టడుగు వర్గాల్లోనూ జయలక్ష్మికి విపరీతమయిన ఆదరణ లభిస్తోంది. ఇంచుమించుగా ప్రతిరోజూ ఓ కొత్త నిబంధన ప్రవేశపెడుతోందామె. అధికారంలోకొచ్చిన మొదటివారంలో ఒక్క ఆదివారం మినహాయించి మిగతా శెలవులన్నీ రద్దుచేసిందామె. పండగలకుమాత్రం ఆ మతంవాళ్ళు రెస్ట్రిక్టెడ్ హాలీడే తీసుకోవచ్చు. ఆ తరువాతి వారంలో బ్రాందీషాప్‌లు, వైన్‌షాపులు. సారాదుకాణాలు ఒకేఒక్క కలం గీతతో మూసివేయబడ్డాయ్. తాగదల్చుకున్నవారు ఎవరిళ్ళల్లో వాళ్ళు తాగాలన్న ఆదేశాలొచ్చినయ్.

ఆ తరువాత రోజునే మరో ఆర్డినెన్స్‌ద్వారా కేబరే డాన్సులు చూపే హోటళ్ళు, హార్స్‌రేస్‌లు, పేకాటలు అన్నీ నిషేధించబడినయ్.

అదేరోజు నిరుద్యోగ భృతిని ఎనౌన్స్ చేసిందామె. రాష్ట్రంలో ఏ వ్యక్తికయినా ఉద్యోగం చూపలేకపోతే ప్రభుత్వం ఆ వ్యక్తి అర్హతలననుసరించి నిరుద్యోగభృతి ఇస్తుంది.

గజపతిరాజా అసహనంగా గమనించసాగాడామె చర్యలు. ఆమె పాప్యులారిటీని మొగ్గలోనే త్రుంచకపోతే - తరువాత తన భవిష్యత్తు చీకటయిపోతుంది. ఇంక తను ముఖ్యమంత్రి అవటం కల్ల. అయితే ఆమెను గద్దెదించే కార్యక్రమం కేవలం

తనొక్కడివల్లా కాదు. కాంగ్రెస్ నాయకులనుకూడా కలుపుకుంటేగానీ సాధ్యంకాని విషయం.

ఆ రాత్రికే సిద్ధార్థకు ఫోన్‌చేశాడతను.

"మనం అర్జంటుగా కొన్ని విషయాలు మాట్లాడాల్సివుంది! ఎప్పుడు కలుసుకుందామంటారు ?" అడిగాడతను.

సిద్ధార్థ ఆ సాయంత్రమే అతనిని తనింటికి రమ్మని ఆహ్వానించాడు.

సాయంత్రం ఆరింటికి ఇద్దరూ కలుసుకున్నారు. కాఫీలయాక అసలువిషయంలో కొచ్చాడు గజపతిరాజా.

"జయలక్ష్మి చేస్తున్న తిక్క పనులన్నీ మీరు చూస్తున్నారుకదా! ఇంకొంతకాలం మనమిలాగే ఊరుకుంటే మన ఆస్తులన్నీ లాక్కోవటం, మన పత్రికలనూ, జర్నలిస్టులనూ కంట్రోల్ చెయటం లాంటివికూడా మొదలు పెడుతుంది కనుక ఈ సమయంలో మనం ఆమెను గద్దె దింపకపోతే తరువాత మన చేతిలో ఏమీ ఉండదిక"

సిద్ధార్థ చాలా వేగంగా ఆలోచించాడు.

జయలక్ష్మి చేసేవన్నీ మంచి పనులని తనకూ తెలుసు. కానీ ఆమెనలా కొనసాగనిస్తే ఆమె ప్రజాబలాన్ని సమీకరించుకొని జీవితాంతం ముఖ్యమంత్రిగానే ఉండిపోయే అవకాశం ఉంది. కనుక ముందు ఆమెను పదవీచ్యుతురాలిని చేయటం తనకూ అవసరమే.

అప్పటికప్పుడే భారతీదేవితో మాట్లాడాడతను. ఆమె హైకమాండ్‌తో మాట్లాడి నిమిషాల్లో గ్రీన్ సిగ్నల్ అందజేసింది.

అయితే ఈ విషయం ముందుగానే జయలక్ష్మికి తెలియటంతో కలవర పడిందామె. వెంటనే ఇంద్రకాంత్‌ని పిలిపించింది.


"నువ్వు మంచి మంచి సంస్కరణలన్నీ ఇంత త్వరగా అమలు చేయటం నీదేతప్పు! ఎంత మంచి పని నయినాసరే నెమ్మదిగా ప్రజల్లోకి ఇంజెక్ట్ చేయాలి !" అన్నాడతను. "మన దేశ ప్రజలు నలభై ఏళ్ళనుంచీ మత్తులో మునిగి ఉన్నారు. ఇప్పుడు హఠాత్తుగా ఆ మత్తు తొలగిస్తే నీకేహాని చేస్తారు వాళ్ళు"

జయలక్ష్మి నవ్వింది.

"ప్రజలను నేను మోసం చేస్తూ చాలా కాలం పరిపాలించటం కన్నా వారికి మంచి చేస్తూ నాలుగురోజులు పరిపాలించటం న్యాయమని అనుకుంటున్నాను-"

ఇంద్రకాంత్ ఇంక మాట్లాడలేదు.

ఆ తరువాత కొద్దిరోజులకే ప్రజల్లో ఆందోళన ప్రారంభమయింది; రాష్ట్రమంతా ఆ ఆందోళనకు గజపతిరాజా, కాంగ్రెస్ నాయకులు వత్తాసు పలికారు. సినీనటుడు పార్టీ ప్రెసిడెంట్ కృష్ణమోహన్ రంగంలోకి దిగాడు. అయినా ఇరుపక్షాలకూ రాజీ కుదర్చలేక పోవటంచేత ఏమీ ఉపయోగం లేకపోయింది. తన పార్టీ రెండు ముక్కలవటం తప్పదని తెలిసే సరికి కృష్ణమోహన్‌కి రాజకీయాల మీదే విరక్తి



కలిగింది.

ఆ తరువాత వారంలోనే వచ్చింది రెండో ఉపద్రవం.

మాలిని గాస్ స్టౌ ప్రమాదంలో చనిపోయిందన్న వార్త అన్ని పత్రికల్లోనూ ప్రచురింపబడింది. అయితే రెండోరోజు ఓ చిన్న పత్రికలో ఓ జర్నలిస్ట్ రాసిన స్టోరి ఆ సంఘటనను హఠాత్తుగా పెంచి పెద్దజేసేసింది.

"మాలిని ఎప్పుడూ - డ్రగ్ తీసుకుంటుందనీ, యూనివర్శిటీ హాస్టల్లోనే ఆమె యూనివర్శిటీ విద్యార్థులతో పాటు గడుపుతోందనీ, ఆమెకూ భానుచంద్ అనే విద్యార్థికీ అక్రమ సంబంధం ఉన్నట్లూ - ఈ విషయాలన్నీ తెలీటంవల్లే తన పరువు ప్రతిష్టలు కాపాడుకోవటం కోసం - ఆమెను రామవర్మ చంపినట్లూ" వివరంగా రాసి ఉందందులో.

ఆ వార్తకిందే హాస్టల్లో కొంతమంది విద్యార్థులమధ్య అర్ధనగ్నంగా కూర్చుని సిగరెట్ తాగుతూన్న ఆమె ఫోటో పబ్లిష్ చేయబడక పోయినట్లయితే ఆ వార్తకంత ప్రాముఖ్యత లభించేదికాదు. మర్నాడు అన్ని పేపర్లూ వివిధ కోణాలలో ఆ వార్తను మరింత పెంచి పెద్దజేసినయ్.

సిద్ధార్థ ఆ వార్త చదివాడుగానీ ఆ విషయంలో ఏమాత్రం ఆసక్తి కనపరచలేదు.

తీరా అసెంబ్లీకెళ్ళేసరికి సెక్రటరీ చెప్పాడు కమ్యూనిస్ట్ సభ్యుడొకతను అడ్జర్న్‌మెంట్ మోషన్‌కి నోటీస్ ఇచ్చాడని.

"దేన్నిగురించి ?" అడిగాడు సిద్ధార్థ కుతూహలంగా.

"ఆంధ్రదేశం ప్రొప్రయిటర్ రామవర్మ భార్య హత్యగావించబడిందనీ, పోలీసులు దానిని ప్రమాదవశాత్తూ మరణించినట్లుగా చిత్రీకరిస్తున్నారనీ రాశాడు నోటీస్‌లో" అంటూ మినిష్టర్ కాపీ అతనికిచ్చాడు.

సిద్ధార్థ అది తీసుకుని తన రూమ్‌లోకి నడిచాడు.

అడ్జర్న్‌మెంట్ మోషన్ అనేది ఏ మినిష్టరుకయినా తలనొప్పి వ్యవహారమే! సరిగ్గా గంట వ్యవధిలో దానికి స్టేట్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుంది. గంటసేపట్లో ఒకోసారి వివరాలు సేకరించటమే కుదరదు.

అదే స్టాట్యుటరీ మోషన్స్‌గానీ, క్వొశ్చన్స్‌గానీ అయితే ఆ సమస్య ఉండదు. కనీసం పదిరోజులు వ్యవధి ఉంటుంది.

వెంటనే హోమ్‌సెక్రటరీకి ఆ మోషన్ తాలూకు వివరాలు అందజేయమని ఆదేశాలిచ్చాడతను. కానీ ఆ వివరాలు అంత తేలికగా లభించేవి కావని అతనికి తెలుసు. అందుకే స్పీకర్‌ని కలుసుకున్నాడతను

"ఆ అడ్జర్న్ మోషన్ గురించి వివరాలందేప్పటికి ఆలస్యం అవుతుందనుకుంటాను. కనుక మీరు అది ఎలాగోలా తిరస్కరిస్తే నాకు కొంత వ్యవధి దొరుకుతుంది." స్పీకర్ నవ్వాడు. అతనికి సిద్ధార్థమీద ప్రత్యేకమయిన అభిమానం ఉంది. సిద్ధార్థలోని 'సిన్సియారిటీ' అతనికెంతో నచ్చింది. అతను అవినీతికి పాల్పడినాకూడా అందులో సిన్సియారిటీ ఉంటుంది.

క్వొశ్చన్ అవర్ అయిపోయింది.

లిస్ట్‌ఆఫ్ బిజినెస్ మొదలవబోతోంది.

అప్పుడు పిలిచాడు స్పీకర్ ఆ మెంబర్‌ని. కమ్యూనిస్ట్ మెంబర్ లేచి తన స్థానంలో నిలబడి తన తీర్మానం చదివాడు.

"ఇందులో 'అర్జంట్' విషయం ఏమీ లేదుకాబట్టి ఈ అడ్జర్న్‌మెంట్ మోషన్‌ని తిరస్కరిస్తున్నాను. కావాలంటే దీనిని క్వొశ్చన్‌గా సెక్రటరీకివ్వవచ్చు!" అన్నాడతను.

"ఇది అర్జెంట్ పబ్లిక్ ఇంపార్టెన్స్ ఉన్న విషయంగానే నేను భావిస్తున్నాను ఎందుకంటే హత్యను ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది పోలీస్ డిపార్ట్‌మెంట్ -" అన్నాడాసభ్యుడు వాదిస్తూ.


"ఈ విషయంమీద వాదనలు అనవసరం! రూల్ 63 కింద నేను మీ అడ్జర్న్‌మెంట్ మోషన్‌ని తిరస్కరిస్తున్నాను" అన్నాడు స్పీకర్.

ఆ సభ్యుడింకేమీ మాట్లాడలేక పోయాడు.

ఆ సాయంత్రం పూర్తి వివరాలందాయ్ సిద్ధార్థకు. పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్‌లో కొత్తవిషయం బయటపడింది. మాలిని చనిపోయిన తర్వాతే ఆమె శరీరం గ్యాస్ ప్రేలుడులో గాయపడిందని ఆ రిపోర్ట్ సారాంశం.

అప్పటికప్పుడే ఆకేస్‌ని హత్యానేరంగా మార్చి రామవర్మను అరెస్ట్ చేయమని ఆదేశించాడు సిద్ధార్థ.

రామవర్మను అరెస్ట్ చేయడానికి పోలీసులు వెళ్ళకముందే వారికి ముఖ్యమంత్రి జయలక్ష్మి నుంచి ఆదేశాలు అందాయ్ - రామవర్మ కేస్‌ను డ్రాప్ చేయమని ఆవార్త వింటూనే సిద్ధార్థకు ఎంతో ఉడికిపోయాడు. అప్పటికప్పుడే ముఖ్యమంత్రి ఇంటికి



చేరుకున్నాడు.

"అయామ్ సారీ సిద్ధార్థగారూ! దయచేసి రామవర్మ కేస్ గురించి పట్టించుకోకండి మీరు -"

"ఎందుకని?"

"అతను గజపతిరాజుకు కావలసిన వ్యక్తి అట - అంచేత మనలో మనకు అభిప్రాయభేదాలు కలుగకముందే సార్ట్ అవుట్ చేసుకోవటం మంచిది"

"కానీ న్యూస్ పేపర్స్‌లో ఇంత గొడవయ్యాక ఇప్పుడు రామవర్మకు సపోర్ట్ చేస్తే వ్యక్తిగతంగా నాకు చాలా హాని కలుగుతుంది."

"నాకావిషయం తెలుసు సిద్ధార్థగారూ - కానీ ఇప్పుడేం చేయాలో తెలీని పరిస్థితిలో పడిపోయాను," అశాంతిగా అందామె.

"ఇందులో తెలీకపోడానికేముంది? రామవర్మను రక్షించడం సాధ్యం కాదని గజపతిరాజుతో చెప్పేయండి."

ఆమెకొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయింది.

"ఊహ! ఇది కుదరదు-"

"ఎందుకని?"

"అతనే నన్ను బెదిరిస్తున్నాడు - రాజీనామా చేస్తానని-"

"చేస్తేచేయనీయండి! ఏమిటీ నష్టం?"

"అతని గ్రూప్‌లో అరవైమంది ఎమ్మెల్యేలున్నారు. అతనేది చెప్తే అదేవేదం వారికి-"

సిద్ధార్థకు పరిస్థితి అర్థమయింది.

"ఆల్‌రైట్. అయితే నేనే రిజైన్ చేస్తాను-" అనేసి లేచిబయటకు నడిచాడు. అమర్నాడే అతని రాజీనామాను గవర్నర్ ఆమోదించటం జరిగిపోయింది. న్యూస్ పేపర్స్ ఊహాగానాలు మరింత పెద్దఎత్తున గాలి దుమారంలాలేచినయ్ అతని రాజీనామాకూ, రామవర్మ కేస్‌కి సంబంధం ఉందన్న వదంతులు వ్యాపించినయ్.

తనే హోమ్‌శాఖ తీసుకోక తప్పలేదు జయలక్ష్మికి. ఆ సమయంలోనే తన పథకం అమలు జరపాలని నిర్ణయించుకున్నాడు గజపతిరాజా! ఆ రాత్రికిరాత్రే కొన్ని లక్షలు వెచ్చించి ఆందోళనను ఉధృతం చేయించాడు. రాష్ట్రమంతటా ఊరేగింపులు ధర్నాలు, అరెస్టులు జరిగాయ్. ఆ మర్నాడు చాలామంది గూండాలు చాలాచోట్ల బస్‌ల మీదా, రైళ్ళమీదా రాళ్ళు రువ్వడం, బస్సులను తగలబెట్టటం చేశారు. కొన్నిచోట్ల తనే స్వయంగా దగ్గరుండి ప్రభుత్వ ఆస్తులు దగ్ధం చేయించాడు గజపతిరాజా! సిద్ధార్థకూడా ఆమె ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు తన ప్రయత్నం తను చేశాడు. ఆమెకు కేంద్రంనుంచీ వర్తమానం వచ్చింది. వెంటనే ప్రధాన మంత్రిని లా అండ్ ఆర్డర్ విషయంలో కలుసుకుని చర్చించ వలసిందని.

ఢిల్లీకి బయల్దేరేప్పుడు గజపతిరాజా ఆమెకు ఎయిర్ పోర్ట్‌లో వీడ్కోలు ఇచ్చాడు. ఆమె ఢిల్లీలో దిగేసరికే ఆమె ప్రభుత్వాన్ని గవర్నర్ బర్తరఫ్ చేసినట్లు వర్తమానం అందిందామెకి.

మొదటిసారిగా పట్టరాని కోపం వచ్చింది జయలక్ష్మికి. ప్రధానమంత్రిని కలుసుకోకుండానే హైద్రాబాద్‌కు తిరిగి వచ్చేసింది. గవర్నర్ చర్యకు వ్యతిరేకంగా తనే ఆందోళనను చేపట్టిందామె. వార్తాపత్రికలద్వారా ఆమె పిలుపునందుకున్న ప్రజలు కొన్ని వేలమంది రాజ్‌భవన్‌కు ఊరేగింపుగా వెళ్ళారు. ప్రశాంతంగా రాజ్‌భవన్‌కు చేరుకున్న ఆ వూరేగింపుపైన ఎలాంటి కారణం లేకుండానే పోలీసులు కాల్పులు జరిపారు. దాంతో జనం చెల్లాచెదురవటం, ఆ త్రొక్కిసలాటలో కొంతమంది స్త్రీలు, పిల్లలు చనిపోవటం జయలక్ష్మిని కదల్చివేసింది. ఆ రెండోరోజు పోలీసు కాల్పులకు నిరసనగా మరింత పెద్దయెత్తున ప్రదర్శనలు జరిగాయ్ రాష్ట్రమంతా! మళ్ళీ పోలీస్ కాల్పులు జరిగాయ్. ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని చేయిస్తున్న అరాజకత్వం అన్న విషయం అర్థమయిందామెకి.


ఆరోజు కాల్పుల్లో ఎనిమిదిమంది చనిపోయేసరికి ఆమెకు విరక్తి కలిగింది వృత్తిమీద. తను ఆందోళనను ఉధృతం చేసినకొద్దీ అమాయకులయిన ప్రజలు చనిపోవటం తప్ప మరో ఉపయోగం లేదని అర్థమయిందామెకి. వెంటనే తన ఆందోళనను విరమించుకుంటున్నట్లు ప్రకటించిందామె.

ఆ సాయంత్రమే ఇంద్రకాంత్ వచ్చాడామెకోసం.

"అందుకే నేనెప్పుడూ చెప్తుంటాను - ప్రజాస్వామ్యాన్ని నమ్ముకోవద్దని -' అన్నాడతను ఆమె మాట్లాడలేదు. రాత్రి పొద్దుపోయే వరకూ టెర్రేస్‌మీద మౌనంగా కూర్చుని ఆలోచనలతో గడిపిందామె.

"జయా! పన్నెండయిపోయింది - ఇంక నిద్రపోదాం" అన్నాడు ఇంద్రకాంత్ ఆమె భుజాలు పట్టుకుని లేవదీస్తూ.

ఆమె అతని కౌగిట్లోకి వదిగిపోయింది నిస్సత్తువగా. మర్నాడు ఉదయమే గజపతిరాజాను మంత్రివర్గం ఏర్పాటు చేయమని ఆహ్వానించాడు గవర్నర్.



అంతకు ముందు మరెప్పుడూ జరగనంత ఆర్భాటంగా జరిగింది గజపతిరాజా ప్రమాణస్వీకారోత్సవం.

• • • •

రాష్ట్రంలో అన్నిచోట్లా బీదలకు అన్నవస్త్రదానాలు జరిగాయ్. మొదటి రోజునే జయలక్ష్మి ప్రవేశపెట్టిన నూతన సంస్కరణలన్నీ రద్దుచేస్తున్నట్లు ప్రకటించాడతను. కొత్తప్రభుత్వం అధికారంలోకొచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని జయలక్ష్మికి వ్యతిరేకంగా ఆందోళలు జరిపి ప్రభుత్వ ఆస్తులను ధగ్ధం చేసిన గూండాలు, దోపిడీదారులందరిని జైలునుంచి విడుదల చేయించాడు.

ఆ తరువాత ఆరునెలల్లో ఎన్నోకొత్త ఆర్డినెన్స్‌లు ప్రవేశపెట్టాడతను. ప్రభుత్వకార్పొరేషన్స్‌తో అత్యధికమయిన ధరలకు భూములు కొనిపించటం! నిబంధనలకు వ్యతిరేకంగా కంట్రాక్టులు ఇవ్వటం, విదేశాల ఏజంట్ల దగ్గర లంచాలు తీసుకుని విదేశీ మిషనరి దిగుమతి చేసుకోవటం, ఎంతోమంది వ్యాపారస్తులకూ, కోటీశ్వరులకూ మరిన్ని లాభాలు సమకూరే నిర్ణయాలు తీసుకుని అందుకు ప్రతిఫలంగా ప్రమోదకు ప్లాట్లు, నగలు, బహుమతిగా లభించటం, మెడికల్ కాలేజీ సీట్లు, ఇంజనీరింగ్ కాలేజీ సీట్లు అమ్మటం, సారా, కల్లు కంట్రాక్టుల్లో కోట్లురంబాలుగా ఇచ్చిన వారినే నియమించటం. ఇలా అతని అవినీతి కార్యకలాపాలకు అంతంలేకుండా పోయింది. దాంతో ప్రతిపక్షాలు అతని మీదా, అతని పార్టీ మీదా పెద్దఎత్తున విరుచుకు పడ్డాయ్. తన అవినీతి కార్యకలాపాలు కొన్ని ఋజువులతో బయటపెట్టటానికి ప్రయత్నించిన ఇద్దరు ప్రతిపక్ష సభ్యులు, నలుగురు జర్నలిస్టులను అతిదారుణంగా రకరకాల ప్రమాదాల్లో చంపించాడతను. జర్నలిస్ట్‌లు వెళ్తోన్న స్కూటర్స్‌ని కారుఢీకొంటే, ప్రతిపక్షసభ్యులు వెళ్తోన్న కార్లను లారీలు ఢీకొన్నాయ్. అక్కడితో అన్నిగొడవలూ సమసి పోతాయనుకున్నాడు గానీ - సిద్ధార్థ రంగంలోకి దిగేసరికి అతనికేం చేయాలో అర్థంకాలేదు. సిద్ధార్థను చంపిస్తే కాంగ్రెస్ తనకు మద్దతు ఉపసంహరించుకుంటుంది. దాంతో తన పార్టీమైనారిటీ అయిపోతుంది. ఎన్ని రోజులు ఆలోచిం

చినా అతనికి ఒకేఒక్క పరిష్కారం కనబడుతుంది. అదేమిటంటే సిద్దార్థను ఎవరికీ అనుమానం కలగించకుండా అంతం చేయటం. అలా చేయగలిగితే అతని పార్టీ మద్దతుని కోల్పోయే ప్రమాదం ఉండదు.

అతి వేగంగా ప్లానింగ్ జరిగిపోయింది.

* * * * *

ఇది జరిగిన వారం రోజులకు ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశాడు సిద్ధార్థ.

గజపతిరాజా రెండో భార్య ప్రమోధ ఇటీవల ఒక విదేశీ బ్యాంక్‌లో దాచుకున్న రెండు కోట్ల రూపాయల మొత్తానికి ఋజువు తన దగ్గరుందనీ, అంచేత గజపతిరాజా వెంటనే రాజీనామా చేయాలనీ పత్రికా విలేఖరులకు చెప్పాడతను.

ఆ వార్త రాష్ట్రమంతా పాకి పోయింది.

గజపతిరాజా ఆ వార్త చూస్తూనే నివ్వెర పోయాడు. వెంటనే ప్రమోద గదిలోకి వెళ్ళాడు ప్రమోద అప్పుడే మేకప్ చేసుకుంటుంది.

తన చేతిలోని న్యూస్ పేపర్ ఆమెమీద విసిరేశాడతను.

"ఏమిటిది - నిజమేనా ?" అడిగాడు కోపంగా.

ఆమె ఆ వార్త చూసింది. పేపర్ నిర్లక్ష్యంగా అవతల పడేస్తూ "నిజమే-" అంది మళ్ళీ అద్దంలో చూసుకుంటూ.

"ఎక్కడిదాడబ్బు నీకు ?"

"ముఖ్యమంత్రి భార్యగా ఆ మాత్రం సంపాదించుకునే హక్కు నాకులేదా !"

"విదేశీబాంక్‌లో వేయమన్న సలహా ఎవరిచ్చారు నీకు ?"

"మా బావ ! మీకు ముందే చెప్పాను కదా! నా విషయలన్నిటిలోనూ మా అక్కా, బావా సలహాలు తీసుకుంటానని -"

"ఈ రోజునుంచీ మీ అక్కా, భావా మనింటికి రాకూడదు. నువ్ వాళ్ళను కలుసు కోకూడదు -"

ఆమె నవ్వింది.

"అనిమీరంటున్నారు."

"అంతే-"

"నన్ను చిన్నప్పటినుంచీ ఇంత వరకూ ఎవరూ అదుపులో పెట్టటానికి ప్రయత్నించలేదు. ప్రయత్నించిన ఒకరిద్దరు పశ్చాత్తాప పడ్డారు-"

గజపతిరాజాకు కోపం ఆగలేదు. ఆమె చెంపమీద లాగికొట్టాడు. ఆమెలో ఎలాంటి మార్పూ రాలేదు. ఏమీ జరగనట్లే అద్దంలో చూసుకుని జుట్టు సరిజేసుకోసాగింది. క్షణంలో గజపతిరాజా నిర్ణయం తీసుకున్నాడు. ఇంక ప్రమోదను అంతం చేయటమే తనకు మార్గం!

అప్పుడు మోగింది ఫోన్

ఆత్రుతగా వెళ్ళి ఫోన్ అందుకున్నాడు

"హలో ! గజపతిరాజా"

"గుడ్ మార్నింగ్ ! నేను సిద్దార్థను మాట్లాడుతున్నాను-"

"గుడ్‌మార్నింగ్-"

"మా పార్టీ మీకు సపోర్ట్ విత్‌డ్రా చేయాలని నిర్ణయించుకుంది. ఈ విషయం గవర్నర్‌కు ఇంతకు ముందే తెలియజేశాము-"

గజపతిరాజా మొఖం పాలిపోయింది.

"సిద్దార్థా ! ప్లీజ్ అంతత్వరగా నిర్ణయం తీసుకోకండి !-మనం వెంటనే కలుసుకుని ఓసారి మాట్లాడుకుందాం-"

"సంభాషణల పేరుతో పిలచి బాంబ్ ప్రేలుడు ఏర్పాటు చేద్దామనా ?" హేళనగా అడిగాడు సిద్దార్థ.

గజపతిరాజా షాక్ తిన్నాడు

"మిస్టర్ సిద్దార్థా ! మీరు లేనిపోని అభాండాలు వేస్తున్నారు-"

"ఓ. కే. అభాండమో, నిజమో తర్వాత తేల్చుకుందాం."

ఫోన్ డిస్కనెక్ట్ చేశాడతను.


మరోగంట సేపటి తర్వాత గవర్నర్ నుంచి వర్తమానం వచ్చిందతనికి.

"మెజారిటీ కోల్పోయినందువల్ల అతని మంత్రివర్గం బర్తరఫ్ చేయబడింది. ప్రత్యామ్నాయఏర్పాట్లు చేసేవరకూ అతను కేర్ టేకర్ ముఖ్యమంత్రిగా వ్యవహరించాల్సి ఉంటుంది-"

* * * *

ఆతరువాత ఎన్నికలు అతిభయంకరమయిన పరిస్తితులో జరిగాయ్

తను మళ్ళీముఖ్యమంత్రి అవకపోతే తన గతేమవుతుందో గజపతిరాజాకు తెలుసు. తను చేసిన అవినీతి కార్యకలాపాలన్నిటినీ కొత్త ప్రభుత్వం బయటపెడు



తుంది. తను ఆక్కొద్ది కాలంలో సంపాదించిన అపారమయిన ఆస్తులన్నీ కరిగించి ఎన్నికల్లో ఖర్చుచేయసాగాడతను. తెలుగుభారతిపార్టీ గెలిచి తీరుతుందన్న నమ్మకం క్రమేపి అందరిలో ప్రబలిపోసాగింది.

సిద్దార్థ అదితన జీవన్మరణ సమస్యగా ఎన్నుకున్నాడు. ప్రజల్లో గజపతిరాజా మీదున్న అయిష్టత ఒక్కటే తన గెలుపుకి ఆధారం కావాలి. మరేవిధంగాను అతనికి తను సమఉజ్జీకాలేడు.

గ్రామాలకు గ్రామాలు అతను డబ్బుతో కొనేస్తున్న విషయం తెలిసే సరికి ఉన్న కొంచెం ఆశకూడా హరించుకు పోయింది.

మరో వారం రోజుల్లో ఎలక్షన్-

ఆరోజు రాత్రి పదకొండుగంటలకు మరో స్త్రీతో వచ్చింది భారతిదేవి.

"ఈమె పేరు త్రిపురసుందరి, రేపు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గజపతిరాజా గురించీ, అతలు చేసిన మోసం గురించి స్టేట్‌మెంట్ ఇవ్వబోతుంది-"

సిద్దార్థకు ప్రాణం లేచివచ్చినట్లయింది. అవిషయం పూర్తిగా మర్చిపోయాడు తను. తనకు ఇదొక్కటే ఆధారం-ఈ ఎన్నికలు గెలువటానికి! అవతలి వ్యక్తిని, పార్టీని దెబ్బకొట్టేందుకు ఇలాంటి పనులు చేయటం తనకు వ్యక్తిగతంగా ఇష్టంలేదుగానీ ఇప్పుడు ఈపరిస్థితుల్లో - గజపతిరాజు అన్నిరకాల అవినీతులకు పాల్పడుతున్న ఈ సమయంలో-తప్పదు-

ఆ రెండో రోజే అన్ని పేపర్లు బాలా త్రిపురసుందరి ఫోటో, ఆమె ఇంటర్వ్యూలు ప్రచురించాయ్.

గజపతిరాజా జీవితంలో ఎన్నడూ తిననంత పెద్దదెబ్బ-ఆ రోజు న్యూస్‌పేపర్స్ చూడటం చాలాసేపు కొయ్యబారి పోయాక-కోలుకుని బాలాత్రిపురసుందరి ఇంటర్వ్యూ అంతా చదివాడతను.

ఆ ఇంటర్వ్యూ అంతా చదివాక తెలుగుప్రజల మనస్తత్వం ఎలామారుతుందో తనకు తెలుసు ముఖ్యంగా స్త్రీ ఓటర్లు-

తనకు తెలుసు! తనీ ఎన్నికల్లో గెలవటం కల్ల! ప్రస్తుతానికి రాజకీయంగా తన చరిత్ర ముగిసినట్లే!


ఏదేమయినా తను అంత తేలిగ్గా ఓడిపోవటం తనకిష్టం లేదు.

తనూ కొన్ని న్యూస్ పేపర్లలోని జర్నలిస్టులనుకొని, ఆ వార్తలను ఖండిస్తూ, స్టేట్‌మెంట్స్ ఇచ్చి పబ్లిష్ అయేలా చూడాలి, బాలత్రిపురసుందరి ఎవరో తనకు తెలీదనీ, తనను అప్రతిష్టపాలు చేయడానికి ఇతర పార్టీలు పన్నినకుట్రే బాలత్రిపురసుందరి అనీ ఎదురు స్టేట్‌మెంట్స్ ఇవ్వాలి.

వెంటనే రామవర్మకు ఫోన్ చేశాడతను.

"హలో! రామవర్మ!" అన్నాడతను

"రామవర్మ! నేను గజపతిరాజాను మాట్లాడుతున్నాను -"



"చెప్పండి! ఏం కావాలి?"

"మీ 'ఆంధ్రదేశం' పత్రికలో కూడా వచ్చింది-నామీద వార్త! దాని విషయం మాట్లాడాలకి ఫోన్ చేశాను -"

రామవర్మ నవ్వాడు.

"ఇంకా మాట్లాడేందుకేముందందులో?"

"దానికి కౌంటర్‌ఎటాక్ ఇవ్వాలి రేపట్నుంచి! అదీ పెద్ద ఎత్తున! మీ ఎడిటోరియల్ కూడా మనకు సహాయంగా ఉండాలి -"

"సారీ గజపతిరాజాగారూ! మా న్యూస్‌ను మేమే ఖండించటం బాగుండదు-"

"రామవర్మా! నేను మీ మాలిని హత్య విషయంలో చేసిన సహాయం సంగతి మర్చిపోయావ్‌కాదు.

"దానికి ఏనాడో యినాం తీర్చేసుకుంది మా పేపరు! మీరు మర్చిపోయారేమో! బినామీ పేర్లతో కంపెనీలు స్థాపించి ప్రభుత్వ ఋణాలు మీరు కట్టేసినప్పుడూ, మీ రెండో భార్య ప్రమోద కంట్రాక్టర్ల దగ్గర, వ్యాపారస్తుల దగ్గర, గవర్నమెంట్ అధికారుల వద్దా పబ్లిగ్గా లంచాలు తీసుకుంటున్నప్పుడూ, సిద్ధార్థను బాంబులతో చంపటానికి ప్రయత్నించినప్పుడూ - ఆ వార్తలు ప్రచురించకుండా చాలా సహాయం చేశాను. కానీ అప్పుడు ఇవన్నీ చేయటానికి కారణం మీరు పదవిలో ఉండటం! ఏ పార్టీ పదవిలో ఉంటే ఆ పార్టీని ఆ పార్టీనాయకులను ఆశ్రయించుకోవటం మా పత్రికలకు చాలా ఆరోగ్యం! మీరు ఇప్పట్లో తిరిగి రాజకీయాల్లో ప్రవేశించే అవకాశమే లేదు గనుక - అయామ్‌సారీ!"

ఫోన్ డిస్కనెక్ట్‌అయింది.

ఎన్నికలరోజు సమీపించే కొద్దీ తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల మధ్యనే ముఖ్యమయిన పోటీ జరిగింది. తెలుగుభారతి మూడోస్థానానికి నెట్టి వేయబడింది.

ఎన్నికలు ముగిశాయి.

ఫలితాల కోసం అందరూ ఆత్రుతగా ఎదురుచూడసాగారు. మొదట్లో గాలి

పాటు తెలుగుదేశం వేపే కనిపించింది. ఓట్ల లెక్కింపు జరుగుతున్న రెండువందల స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులదే పైచేయిగా కనిపించింది. సాయంత్రం అవుతున్న కొద్దీ ట్రెండ్ మారిపోయింది.

తెలుగుదేశం, కాంగ్రెస్‌పార్టీలు సగానికి సగం స్థానాలలో ఆధిక్యత సంపాదించుకున్నాయ్.

మళ్ళీ ఎవరికీ మెజారిటీ రానిస్థితి.

రాత్రి పన్నెండు దాటింది.

సిద్ధార్థ, వైదేహి ఫోన్ దగ్గరే కూర్చున్నారు.

కాంగ్రెస్‌కు 144 స్థానాలు వచ్చాయ్. ఇంకొక్క స్థానం లభిస్తే కాని మెజారిటీ రాని పరిస్థితి. మిగతా స్థానాల ఫలితాలన్నీ ఒక్కొక్కటే తెలుగుదేశం, తెలుగు భారతి, కమ్యూనిస్ట్ పార్టీలకు వెళ్ళిపోతున్నాయ్.

రాత్రి రెండయిపోయింది.

సిద్ధార్థలో ఆశలు సన్నగిల్లి పోతున్నాయ్. వైదేహి అతని కలవరపాటుతో గమనిస్తోంది.

"వైదేహీ! ఈసారి తప్పక విజయం సాధిస్తానని ఆశపడ్డాను! బహుశ అది ఇంక నా జాతకంలో లేదను కుంటాను-" నిరాశగా అన్నాడతను.

అప్పుడే టి. వి. లో స్పెషల్ బులెటిన్ ప్రారంభమయింది.

"ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు అన్నిస్థానాల్లో పూర్తి అయింది. కాంగ్రెస్‌పార్టీ ఒక్కటే ఎక్కువ స్థానాలు సంపాదించినప్పటికీ ఏ పార్టీకీ మెజారిటి రాని పరిస్థితి ఏర్పడింది. మళ్ళీ మిశ్రమపార్టీ ప్రభుత్వం ఏర్పడ వచ్చునని పలువురు పరిశీలకులు భావిస్తున్నారు. వివిధ పార్టీల బలాబలాలు ఈవిధంగా ఉన్నాయ్.

తెలుగుదేశం 110

కాంగ్రెస్ 144"

సిద్ధార్థ టి. వి. ఆఫ్ చేసేశాడు. లేచి తనగది లోకి నడిచాడు. శరత్, మంజు నిద్రకళ్ళతో కూర్చుని ఉన్నారు మంచాల మీద శరత్ తండ్రిని చూస్తూనే ఆత్రుతగా అడిగాడు.

"డాడీ రిజల్ట్స్ అన్నీ వచ్చేశాయా!"

వాడికళ్ళలో కనబడుతోన్న మెరుపుని అవలీలగా గుర్తించాడు సిద్ధార్థ.

తనూ టెన్త్‌క్లాస్ చదివేటప్పుడు అచ్చం ఇలాగే అర్ధరాత్రి లేచి కూర్చునీ ఎన్నికల ఫలితాలు తన తండ్రిని అడిగి తెలుసుకునేవాడు.

పిల్లలిద్దరిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు సిద్ధార్థ.

"మన పార్టీకీ ఎక్కువ స్థానాలే వచ్చాయ్ గానీ మెజారిటీ రాలేదు-"

సరిగ్గా అప్పుడే ఇంటి ముందు కార్లు, వ్యాన్లు ఆగిన చప్పుడయింది. చాలామంది మాట్లాడుతున్న శబ్దాలు.

[illegible] ల్లో [illegible]గాన్నాడు.

[illegible] దగ్గరిలాగట్టు రేకలు మార్మోగినయ్. ఆ ప్రాంతమంతా

[illegible]ప్పుంగా జనం

[illegible]బాద్ -

[illegible]దాబాద్ -

కాంగ్రెస్‌పార్టీ [illegible]ందాబాద్ -

సిద్ధార్థ [illegible] అర్థం కావటం లేదు. ఆఖర్లో తెలిసింది.

టి.వి. లో ఒక స్థానం ఫలితం తప్పుగా ప్రకటించబడింది. రీకౌంటింగ్‌లో కాంగ్రెస్ గెలవటం వల్ల మెజారిటీ లభించింది.

సిద్ధార్థ కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

ఎన్నో సంవత్సరాల నిరీక్షణా, తపస్సుల ఫలితం-

తెల్లారు జామున భారతీదేవి నుంచి ఫోన్ వచ్చింది తనకి.

"సిద్ధార్థా! నా జీవితధ్యేయం కూడా ఇప్పుడు నెరవేరి నట్లనిపిస్తోంది. నీపక్క న ఉండే అదృష్టం లేకపోయినా-నీఆనందాన్ని పూర్తిగా పంచుకుంటున్నాను-ఈరాత్రి ఎంత తన్మయత్వంగా ఉందో మాటల్లో చెప్పలేను-"

"థాంక్యూ! ఈవిజయం మీదేనని మనిద్దరికీ తెలుసు కదూ?"

ఆమె నవ్వింది ఆనందంగా.

* * * *

సిద్ధార్థ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే దృశ్యాన్ని రాష్ట్రమంతటా టి.వి. లో ఆనందంగా తిలకిస్తారు ప్రజలు.

విలియమ్స్ అతని పక్కనే ఉండి అధికారులతో ఏర్పాట్లన్నీ చేయిస్తున్నాడు. ముందువరుసలో కూర్చుని అతనిని ఆనందంతో గమనిస్తున్నారు మోహన్రావ్, శాంతమ్మలు.

వారిపక్కనే కూర్చుని టేప్ రికార్డ్‌లో తండ్రి ఉపన్యాసాన్ని రికార్డ్ చేస్తున్నాడు శరత్. ఉపన్యాసం మధ్యలో కొడుకు వేపు చూసిన సిద్ధార్థ కొద్ది క్షణాలు మాటలాపి అతనివేపే చూస్తూండిపోయాడు. శరత్‌లోని ఉత్సాహం, మొఖంలోని ఆసక్తి, కళ్ళలోని వెలుగూ - అంతా అచ్చంతనే! తనుకూడా తనతండ్రి ఎన్నికల విజయోత్సవంలో అచ్చం ఇలాగే ప్రవర్తించేవాడు. అతని కళ్ళల్లో ఆనంద బాష్పాలు నిలిచాయ్.

• • • •

జయలక్ష్మి ఆ కార్యక్రమాన్ని ఖమ్మం అడవుల్లో తమ నివాసంలో కూర్చుని చూస్తోంది. దూరంగా కూర్చు ఆడుకుంటున్న పాపాయి కూడా, ఆట ఆపి టి.వి. వేపు చూస్తోంది.

పాపాయి మొఖంలో కనిపిస్తోన్న ఇంద్రకాంత్ పోలికలు చూస్తూంటే ఆమె గుండె తరుక్కుపోయింది. అప్రయత్నంగా కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

నెల రోజులవుతుంది – ఇంద్రకాంత్ పోలీస్ ఎన్ కౌంటర్లో చంపబడి !

అతని ధ్యేయాన్నే తన ధ్యేయంగా చేసుకుని జీవితం గడపడానికి నిశ్చయించుకుంది తను –

* * * *

రామవర్మ బార్‌లో కూర్చుని ఆనందంగా తాగుతూ ఆ కార్యక్రమం చూస్తున్నాడు. తన పేపర్ సిద్ధార్థకు పూర్తి మద్దతు ఇచ్చే విషయంలో బేరసారాలన్నీ సంతృప్తికరంగా జరిగిపోయాయ్. మాలిని అడ్డు తొలగి పోయింది. ఇంక ఇప్పట్లో తనకు చిక్కులేమీ ఉండవ్. తనను విదేశాలకు ప్రభుత్వం ఖర్చుమీద పంపటానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించిన విషయం కూడా ఆ రోజే అఫీషియల్‌గా వర్తమానం వచ్చిందతనికి ! గజపతిరాజా కూడా సిద్ధార్థ ప్రమాణ స్వీకారాన్ని తన గదిలోనే కూర్చుని గమనించ సాగాడు.

ప్రమోద తనని వదిలి స్విట్జర్లాండ్ వెళ్ళిపోయిన దగ్గర్నుంచి అతనికి మానసికంగా చాలా ప్రశాంతంగా ఉంది.

సిద్ధార్థను ఎలా ఆ పదవి నుంచి తప్పించాలా అనేదే అతనిని గతరోజులుగా తొలచివేస్తున్న సమస్య.

"డాడీ !"

"నేను ఎలక్షన్లో నిలబడలంటే ఎంత వయసురావాలి ?"

గజపతిరాజా ఆశ్చర్యపోయాడు. కొంచెం ఆనందం కూడా కలిగిందతనికి.

"ఇరవై అయిదు సంవత్సరాలకు తక్కువుండకూడదు–"

వాడి మొఖంలో నిరాశ కనిపించింది గానీ అంతలోనే తేరుకున్నాడు.

"నా డేటాఫ్ బర్త్ కొంచెం మార్చేస్తే వచ్చే ఎలక్షన్లోనే నిలబడవచ్చు కదూ డాడీ ?"

గజపతిరాజా నివ్వెర పోయాడు.

అచ్చం తన ఆలోచనావిధానమే వాడిది మరీ ఇంత పోలికా ?

లేచి కొడుకు దగ్గరకెళ్ళి వాడి భుజం మీద చేయివేసి ఆప్యాయంగా ఆనందంగానిమిరాడు. అతని కళ్ళల్లో ఆనందభాష్పాలు నిండాయ్.

(అయిపోయింది)

Edited & Published by V. Leelavathy Raghaviah, at 1-8-519/11, Chikkdadpally, Hyd 20. & Printed by P. Ramakrishna at Raghava Printers, 1-8-4/1/1, Chikkdadpalli, Hyderabad-20

JYOTI July -'87 Regd No = H/SD=73

బాంబినో ఇన్‌స్టెంట్ పాయసం



ప్యాకెట్టులోని ఇన్‌స్టాంట్ మిక్స్‌ని నీళ్లలో వేయండి.

7 నిమిషాలు కలుపుతూ వండండి.

రుచికరమైన చిక్కని పాయసం తయారు.

కుటుంబ సభ్యులను ఈ పాయసంతో ఆనందింప చేయండి.

ఇక ముందు మీరు మీ కుటుంబ సభ్యులకు ఇష్టమైన పాయసం తినాలని అనిపించినప్పుడు, మామూలు పద్ధతిలో పాయసంను చేసి శ్రమపడే కన్న బాంబినో ఇన్‌స్టాంట్ పాయసం ప్యాకెట్లు కొని త్రుటిలో రుచికరమైన పాయసం తయారుచేసి అందరూ ఆనందించండి.



"పసందైన పాయసం త్రుటిలో మీకోసం"



బాంబినో

ఇన్‌స్టెంట్ పాయసం

రుచికరమైన సాంప్రదాయక పాయసం నిమిషాలలో మీ కోసం!